సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 320

సోమవారం 10-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



**మీ 'పన్ను' దారేది?**

పాత, కొత్త విధానంలో పన్ను భారంపై అవగాహన

- ప్రాఫిట్ ప్లస్‌లో



**అయ్యో... ఆఖరికి ఓడింది**

అండర్–19 ప్రపంచ కప్ ఫైనల్లో భారత్‌పై బంగ్లాదేశ్ విజయం

- స్పోర్ట్స్‌లో

• ఎట్టకేలకు...

## పోలింగ్ @ 62.59%

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తుది గణాంకాలను.. పోలింగ్ ముగిసిన దాదాపు 24 గంటల తరువాత.. ఎన్నికల సంఘం ఆదివారం సాయంత్రం విడుదల చేసింది. మొత్తంగా, 62.59 శాతం పోలింగ్ నమోదైందని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రణ్‌బీర్ సింగ్ వెల్లడించారు.




- 5లో

• బయోపిక్...

## అలీ @ కలామ్

భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ బయోపిక్ హాలీవుడ్‌లో తెరకెక్కుతోంది. కలామ్ పాత్రను నటుడు అలీ పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను కేంద్ర సమాచార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఆదివారం ఢిల్లీలో విడుదల చేశారు.




- ఫ్యామిలీలో

• జాతర ముగిసినా...

## మేడారంలో రద్దీ

అమ్మవార్ల వనప్రవేశంతో శనివారం మేడారం మహా జాతర ముగిసినా ఆదివారం సమ్మక్క–సారలమ్మకు ఇష్టమైన మాఘశుద్ధ పౌర్ణమి.. అందులోనూ సెలవు రోజు కావడంతో తల్లుల దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.




- 3లో

• ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై...

## సుప్రీం కీలక తీర్పు

ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రాలు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరడానికి సంబంధించి ఎలాంటి ప్రాథమిక హక్కు లేదని పేర్కొంది.



- 5లో

# జేసీ పోస్టు రద్దు!

## అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పోస్టుల సృష్టి

| | |
|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం | 33 జిల్లాలకు జేసీ స్థానంలో అదనపు కలెక్టర్ల నియామకం |
| జిల్లా స్థాయిలో పరిపాలనా సంస్కరణ | ఇకపై రెవెన్యూ శాఖ బాధ్యతలు అదనపు కలెక్టర్లకు! |



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో పాలనా సంస్కరణల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జిల్లా స్థాయిలో రెవెన్యూ చట్టం అమలు, భూ వ్యవహారాలను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ (జేసీ) పోస్టును రద్దు చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు జాయింట్ కలెక్టర్ల స్థానంలో అదనపు కలెక్టర్లను నియమించింది. చాలా జిల్లాల జాయింట్ కలెక్టర్లను అదే జిల్లాకు అదనపు కలెక్టర్లుగా బదిలీ చేసింది. కొన్ని జిల్లాలకు కొత్త అధికారులను అదనపు కలెక్టర్లుగా, అలాగే 14 జిల్లాలకు వేరే అధికారులను అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)గా నియమించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 49 మంది నాన్‌కేడర్, కేడర్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ సోమేశ్‌కుమార్ ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

**రాష్ట్ర పాలన సర్వీసుల దిశగా అడుగులు**

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) తరహాలో తెలంగాణ స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసును నెలకొల్పి రాష్ట్రంలో పాలనా సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. దీనికి తోడు అవినీతికి ఆస్కారం లేని విధంగా, ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు వీలుగా కొత్త రెవెన్యూ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్ పోస్టును రద్దు చేసి అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పోస్టులను సృష్టించారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కలెక్టర్ నేతృత్వంలోని అదనపు కలెక్టర్ల బృందంతో జిల్లా స్థాయిలో పటిష్టమైన అధికారిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)లకు కొన్ని నిర్దిష్ట శాఖలు అప్పగించనుంది. అదనపు కలెక్టర్లు ప్రధానంగా

మిగతా 2వ పేజీలో ▶



# సిరుల వరి..

## రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడి


- 2019-20 ఖరీఫ్, రబీలు కలిపి 1.48 కోట్ల మెట్రిక్ టన్నులు
- రెండో ముందస్తు అంచనా నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం
- తెలంగాణ ఏర్పడ్డాక 79.94 లక్షల మెట్రిక్ టన్నులు అధికం
- పత్తి ఉత్పత్తి 48.62 లక్షల బేల్స్.. గతేడాది కంటే అధికం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరి సిరులు పండిస్తోంది. 2019–20 ఖరీఫ్, రబీ సీజన్లలో వరి ఏకంగా 1.48 కోట్ల మెట్రిక్ టన్నులు పండుతుందని అంచనా. ఖరీఫ్‌లో 89.49 లక్షల మెట్రిక్ టన్నులు పండగా, రబీలో 58.62 లక్షల మెట్రిక్ టన్నులు పండుతుందని సర్కారు అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏకంగా ఖరీఫ్, రబీల్లో అధికంగా 48.09 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అధికంగా పెరగడం విశేషం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏకంగా 79.94 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి అధికంగా పండింది. 2014–15 సంవత్సరంలో రాష్ట్రంలో 68.17 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి అయిన సంగతి విదితమే. ఆహార పంటల రెండో ముందస్తు అంచనాల నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరగడంతో దిగుబడి గణనీయంగా

మిగతా 4వ పేజీలో ▶

**వరి ఉత్పత్తి ఇలా..**

| సంవత్సరం | ఉత్పత్తి (మెట్రిక్ టన్నులు లక్షల్లో) |
|---|---|
| 2014-15 | 68.17 |
| 2015-16 | 45.71 |
| 2016-17 | 98.80 |
| 2017-18 | 93.70 |
| 2018-19 | 100.2 |
| 2019-20 | 148.11 |



## 'సార్స్'ను మించిన కరోనా

- ప్రపంచాన్ని వణికిస్తున్న ప్రాణాంతక వైరస్
- 2002–03 నాటి సార్స్ మరణాల్ని దాటేసిన కరోనా మరణాలు
- వైరస్ వ్యాప్తితో కుదేలవుతున్న చైనా... 813కి పెరిగిన 'కరోనా' మృతుల సంఖ్య
- 37 వేలకు పైగా నిర్ధారిత కేసులు
- సాయమందించేందుకు సిద్ధమని జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ లేఖ

బీజింగ్/న్యూఢిల్లీ: ప్రాణాంతక కరోనా వైరస్ ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తోంది. 26 దేశాలకు విస్తరించిన ఈ వైరస్.. ఒక్క చైనాలోనే శనివారం నాటికి 813 మందిని బలిగొన్నది. వారిలో శనివారం ఒక్కరోజే చనిపోయిన వారి సంఖ్య 89 కాగా, కొత్తగా ఈ వైరస్ సోకిన వారి సంఖ్య 2,656, అనుమానిత కేసుల సంఖ్య 3,916. ఈ వైరస్ సోకి, చికిత్స పొందుతున్నవారి సంఖ్య శనివారం నాటికి 37వేలు దాటింది. ఈ గణాంకాలు కరోనా కల్లోలాన్ని కళ్లకు కడుతున్నాయి. 2002–03లో ప్రపంచాన్ని వణికించిన 'సార్స్' వైరస్‌ను మించిన ప్రమాదకారిగా ఈ కరోనా పరిణమించింది. నాడు 'సార్స్' కారణంగా ప్రపంచవ్యాప్తంగా చనిపోయినవారి సంఖ్య 774 కాగా, ఇప్పటికే కరోనా మృతుల సంఖ్య 800 దాటింది. కరోనా తరహాలోనే సార్స్ వైరస్‌ను కూడా మొదట చైనాలోనే గుర్తించారు. ఈ రెండు కూడా ఒకే వైరల్ కుటుంబానికి చెందినవి కావడం గమనార్హం. ఒక్క చైనాలోనే దాదాపు 37 వేల మందికి పైగా కరోనా వైరస్‌తో బాధపడుతున్న నేపథ్యంలో..

మిగతా 2వ పేజీలో ▶

**నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్ వెల్లడి**

- త్వరలోనే దేశవ్యాప్తంగా భారీ బ్యాటరీల తయారీ ఫ్యాక్టరీలు
- ప్యూర్ ఈవీ విద్యుత్ స్కూటర్ ఈప్లూటో 7జీ విడుదల

# విదేశాల నుంచి లిథియం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ బ్యాటరీల తయారీకి కీలకమైన లిథియం పదార్థాన్ని దక్షిణ అమెరికా దేశాలైన అర్జెంటీనా, చిలీ, బొలీవియా నుంచి సేకరించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని నీతి ఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ డాక్టర్ వి.కె.సారస్వత్ తెలిపారు. విద్యుత్ వాహనాల విస్తృత వినియోగానికి దోహదపడేలా త్వరలోనే దేశవ్యాప్తంగా భారీ సైజు బ్యాటరీల తయారీ ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ప్యూర్ ఈవీ అనే సంస్థ ఐఐటీ–హైదరాబాద్ సాయంతో అభివృద్ధి చేసిన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సారస్వత్, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సారస్వత్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఐదారు బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలన్నది నీతి ఆయోగ్ ఆలోచన అని, ఒక్కొక్క ఫ్యాక్టరీలో

మిగతా 2వ పేజీలో ▶

**విద్యుత్ స్కూటర్ ఈప్లూటో 7జీ**



## మహంకాళి ఆలయాన్ని అభివృద్ధి చేయండి

- అఫ్జల్‌గంజ్ మసీదు మరమ్మతులకు రూ.3 కోట్లు ఇవ్వండి
- సీఎంకు ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ వినతి..
- వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు కేసీఆర్ ఆదేశం



- వివరాలు 2లో

## ఒడిశాలో బస్సుకు షాక్..

11 మంది మృతి, 34 మందికి గాయాలు

- ఒడిశాలో ఓ బస్సుపై 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడటంతో మంటలు చెలరేగి 11 మంది ప్రయాణికులు దుర్మరణం చెందగా.. 34 మంది గాయపడ్డారు.

- వివరాలు 5లో

## డిగ్రీలో కామన్ ఫీజు 'దందా'!

- ఫీజుల పెంపునకు ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఎత్తుగడ
- ఒకే రకమైన కోర్సులకు వేర్వేరు ఫీజులు
- చెల్లించడం కష్టమంటూ కామన్ ఫీజు మెలిక
- ఫీజులు పెంచితే పెరగనున్న రీయింబర్స్‌మెంట్ భారం

- వివరాలు 14లో

# అబార్షన్లు ఆగట్లేదు!

## రాష్ట్రంలో ఏడాదికేడాది పెరిగిపోతున్న సంఖ్య

| 2016-17లో | 2018-19లో |
|---|---|
| 6,481 మందికి.. | 8,154 మందికి.. |

అందులో 47 శాతం అబార్షన్లు అనర్హుల చేతిలోనే

దాదాపు సగం మేరకు ఆడబిడ్డ పుడుతుందనే..

దేశవ్యాప్తంగా నాలుగేళ్లలో 45.24 లక్షల అబార్షన్లు

తాజాగా వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అబార్షన్లు ఏడాదికేడాదికి పెరుగుతున్నాయి. గత నాలుగేళ్లలో తెలంగాణలో 27,559 మంది మహిళలకు అబార్షన్లు జరిగాయని కేంద్ర ప్రభుత్వం తాజా నివేదికలో వెల్లడించింది. ఈ అబార్షన్లలో కొన్నింటిని బిడ్డ కడుపులో ఉన్నప్పుడు ఆరోగ్య పరమైన సమస్యలు వచ్చినప్పుడు గైనకాలజిస్టుల సలహా మేరకు చేస్తారు. కానీ మరికొన్ని అబార్షన్లు మాత్రం ఆడబిడ్డను వదిలించుకోవడానికి జరుగుతున్నవిగా వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2016–17 నుంచి 2019–20 (డిసెంబర్ నాటికి) దేశవ్యాప్తంగా 45.24 లక్షల అబార్షన్లు జరిగాయి. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో తక్కువగా కనిపిస్తున్నా, ఏడాదికేడాదికి ఆ సంఖ్య పెరగటం ఆందోళన కలిగిస్తుంది. పాత అబార్షన్ల చట్టం ప్రకారం కేవలం 20 వారాల వరకు జరిగే అబార్షన్లకు మాత్రమే చట్టబద్ధత కల్పించింది. దీని వల్ల నిజమైన కారణాలు ఉన్నప్పటికీ అబార్షన్లు చేసే అవకాశం లేక కొంత మంది

మిగతా 4వ పేజీలో ▶










**ఇదం జగత్**



ఆ కంపెనీ, ఈ కంపెనీ వెళ్లిపోయిందని వదంతులు పుట్టిస్తున్నారు కానీ, రాజధాని వెళ్లిపోలేదని మాత్రం పుట్టించలేకపోతున్నాం!




## తొలి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్.. ఓ జ్ఞాపకం

సాక్షి, హైదరాబాద్: 'నా తొలి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ 1998లో జారీ చేశారు. ఇది ఓ జ్ఞాపకం'అని పేర్కొంటూ రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆదివారం తన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఫొటోలను ట్వీట్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌పై అతికించి ఉన్న యువ కేటీఆర్ ఫొటో నెటిజన్లను బాగా ఆకట్టుకుంది.

## ఎయిర్‌పోర్టులో 2.5 కిలోల బంగారం పట్టివేత

శంషాబాద్: విదేశాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రెండున్నర కిలోల బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన నలుగురు మహిళలు కొన్నాళ్ల క్రితం సౌదీ అరేబియాలోని జెడ్డాకు వెళ్లారు. వీరు ఆదివారం ఎయిర్ ఇండియా విమానంలో హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. బడా స్మగ్లర్లకు ఈ నలుగురూ క్యారియర్లుగా పని చేస్తున్నారనే సమాచారం కస్టమ్స్ అధికారులకు అందింది. ఈ నేపథ్యంలో అధికారులు వీరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. నలుగురి వద్ద రెండున్నర కిలోల బరువు కలిగిన బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. కొందరు జెడ్డా నుంచి వీరిని కొరియర్‌లుగా వినియోగించుకొని బంగారాన్ని అక్రమంగా రవాణా చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని వివిధ కోణాల్లో విచారిస్తున్న కస్టమ్స్ అధికారులు ఈ గ్యాంగ్ వెనక ఉన్న సూత్రధారుల కోసం ఆరా తీస్తున్నారు.

## టీడీపీ నేతలపై కొనసాగుతున్న ఐటీ దాడులు

సాక్షి, హైదరాబాద్: తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులపై ఆదాయ పన్ను శాఖ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సీఆర్‌పీఎఫ్ బలగాల పహారాలో ఆదివారం తనిఖీలు చేసింది. గురువారం మొదలైన ఈ సోదాలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. టీడీపీ నేతలు, మాజీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లకు అత్యంత సన్నిహితులుగా పేరు పొందిన వారిపై ఈ దాడులు జరగడం గమనార్హం. బంజారాహిల్స్‌లోని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్‌కు చెందిన ఓ కార్యాలయం, లోకేశ్‌కు సన్నిహితుడైన కిలారి రాజేశ్ ఇంటిపై 4వ రోజూ తనిఖీలు జరిగాయి. అలాగే ఉత్తర తెలంగాణకు చెందిన మరో రాజకీయ నాయకుడి ఇంటిపైనా ఐటీ దాడులు కొనసాగాయి.

## జేఎన్‌టీయూ హ్యాండ్‌బుక్‌లో మార్పులు అవసరం: టీటీఐఈఏ

సాక్షి, హైదరాబాద్: జేఎన్‌టీయూహెచ్ హ్యాండ్‌బుక్‌లో విద్యార్థులు, అధ్యాపకులకు ప్రతికూలంగా ఉన్న పలు నిబంధనల్లో మార్పులు చేయాలని తెలంగాణ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయ్స్ అసోసియేషన్ (టీటీఐఈఏ) ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. విద్యార్థుల ధ్రువపత్రాలు యాజమాన్యాల వద్ద ఉంచుకోకూడదన్న ఏఐసీటీఈ నిబంధనల్లో మార్పులు అవసరమని కోరింది. జీతాలను పీరియాడికల్‌కు బదులుగా నెలవారీగా మార్చాలని, ఉద్యోగుల తొలగింపు అధికారాలను పూర్తిగా కాలేజీ యాజమాన్యాలకు అప్పగించడం సరికాదని అభిప్రాయపడింది. హ్యాండ్‌బుక్‌లో ఉద్యోగులకు యాక్సిడెంట్ పాలసీతోపాటు నాన్ టీచింగ్ స్టాఫ్ సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.



## పచ్చదనంతోనే ప్రగతి: కీర్తి సురేశ్

సాక్షి, హైదరాబాద్: పచ్చదనంతోనే సమాజ ప్రగతి సాధ్యమని ప్రముఖ నటి కీర్తి సురేశ్ అన్నారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఆదివారం సూరారంలోని టెక్ మహీంద్రా కంపెనీ ఆవరణలో కీర్తి సురేశ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనంతోనే మానవ ప్రగతి సాధ్యమన్నారు. అనంతరం యువ దర్శకుడు వెంకీ అట్లూరి కూడా గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా తన వంతుగా మొక్కను నాటారు. ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో అంతా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సినీనటుడు కాదంబరి కిరణ్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో–ఫౌండర్ రాఘవ, ప్రతినిధి కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి ఆలయాన్ని అభివృద్ధి చేయండి

- అఫ్జల్ గంజ్ మసీద్ మరమ్మతులకు రూ.3 కోట్లు ఇవ్వండి
- సీఎంకు ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ వినతి..
- వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు కేసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని లాల్‌దర్వాజలో ఉన్న సింహవాహిని మహంకాళి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని ఎంఐఎం శాసనసభా పక్ష నాయకుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. ప్రగతిభవన్‌లో ఆదివారం ముఖ్యమంత్రిని కలసి ఈ మేరకు ఆయన వినతిపత్రం అందజేశారు. ప్రతీ ఏటా ఈ ఆలయంలో నిర్వహించే బోనాలు దేశవ్యాప్తంగా లాల్ దర్వాజ బోనాలుగా ప్రసిద్ధి చెందాయని ఆయన గుర్తు చేశారు. ఇంతటి ప్రసిద్ధి ఉన్నా చాలినంత స్థలం లేకపోవడం వల్ల ఆలయ ప్రాంగణం అభివృద్ధికి నోచుకోవట్లేదని.. దీనివల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని సీఎం దృష్టికి తెచ్చారు. 'లాల్ దర్వాజ మహంకాళి ఆలయానికి వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. బోనాల పండుగ సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఈ గుడిలో పూజలు చేసి, బోనాలు సమర్పిస్తారు. కానీ ఈ గుడి ప్రాంగణం కేవలం వంద గజాల స్థలంలోనే ఉంది. ఇంత తక్కువ స్థలం ఉండటం వల్ల లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎంతో అసౌకర్యం కలుగుతోంది. రూ.10 కోట్ల వ్యయంతో దేవాలయాన్ని విస్తరించి, అభివృద్ధి చేయండి. దేవాలయ విస్తరణ వల్ల దీనికి ఆనుకుని ఉన్న వారు ఆస్తులు కోల్పోయే అవకాశముంది. వారికి ప్రత్యామ్నాయంగా జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉన్న ఫరీద్ మార్కెట్ ఆవరణలో 800 గజాల స్థలం ఇవ్వండి. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేయాలని కోరుతూ స్వయంగా (ముఖ్యమంత్రి) మీరు బంగారు బోనం సమర్పించారు. ఆలయ విస్తరణకు ఆ సమయంలోనే ప్రకటన కూడా చేశారు. ఇక పాతబస్తీలోని అఫ్జల్‌గంజ్ మసీద్ మరమ్మతుల కోసం రూ.3 కోట్లు మంజూరు చేయండి. ఎంతో మంది ముస్లింలు నిత్యం ఈ మసీదులో ప్రార్థనలు చేస్తారు. మరమ్మతులకు నోచుకోకపోవడం వల్ల ప్రార్థనలకు ఇబ్బంది కలుగుతోంది..'అని అక్బరుద్దీన్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. మహంకాళి దేవాలయ అభివృద్ధికి, అఫ్జల్ గంజ్ మసీదు మరమ్మతులకు వెంటనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రెండు ప్రార్థనా మందిరాల అభివృద్ధికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను సీఎం ఆదేశించారు.



ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# జేసీ పోస్టు రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి



రెవెన్యూ శాఖను పర్యవేక్షించనున్నారు. అదనపు కలెక్టర్ల(స్థానిక సంస్థలు)కు ప్రభుత్వం కీలకమైన కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల అమలు బాధ్యతలను అప్పగించనుంది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునే అధికారాలను వీరికి కట్టబెట్టనుంది. జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లను సైతం వీరి పరిధిలోకి తీసుకురానుంది. లే అవుట్ల అనుమతులు, ఆస్తుల గణన (ప్రాపర్టీ అసెస్‌మెంట్స్) తదితర పనులను వీరికే అప్పగించే అవకాశముంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, పారిశుధ్యం, పచ్చదనం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, నర్సరీ ఏర్పాటు, సర్టిఫికెట్ల జారీ ఇకపై వీరే పర్యవేక్షించనున్నారు. వీరిపై జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణ ఉంటుంది. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పోస్టుల విధులు, బాధ్యతలు, జాబ్ చార్ట్‌పై ఈ నెల 11న నిర్వహించనున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం కేసీఆర్ స్పష్టత ఇస్తారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలు అందించడం, అవినీతికి, అలసత్వానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో అదనపు కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించనుంది.

### అవినీతి నిర్మూలనే ప్రధాన ధ్యేయం..

కొత్త జిల్లాలు, కొత్త డివిజన్లు, కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు, కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో భారీ పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. భారీగా పరిపాలన వికేంద్రీకరణ జరిగినా అవినీతి కారణంగా ప్రజలకు ఆశించిన ఫలితాలు అందట్లేదు. అవినీతి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకురాగా, త్వరలో జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురానున్నట్లు సమాచారం. రెవెన్యూ కార్యాలయాల్లో, మున్సిపాలిటీల్లో, గ్రామ పంచాయతీల్లో డబ్బులు ఇవ్వకుండా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా కావల్సిన పనులు జరగాలని, ఇందుకు కఠినంగా వ్యవహరిస్తామని సీఎం కేసీఆర్ పలుమార్లు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో కొత్తగా అదనపు కలెక్టర్ పోస్టులను సృష్టించి, ఒక్కో అదనపు కలెక్టర్‌కు కొన్ని కీలకమైన శాఖల బాధ్యతలను అప్పగించబోతోంది.

### త్వరలో రాష్ట్ర స్థాయిలో కూడా..

రాష్ట్ర స్థాయిలో సైతం ప్రభుత్వం పాలన సంస్కరణలను అమలు చేయబోతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముఖ్యమైన అధికారుల వ్యవస్థ ఏర్పాటు చేయనుంది. సీఎస్‌కు సహాయంగా అదనపు సీఎస్‌ల బృందాన్ని నియమించనుంది. వీరికి కొన్ని శాఖల బాధ్యతలను అప్పగించనుంది. జిల్లా స్థాయిలో ఐఎఎస్ అధికారి నేతృత్వంలో పనిచేసే బృందం పనితీరును సీఎస్ నాయకత్వంలోని బృందం పర్యవేక్షించనుంది. ఎప్పటికప్పుడు కావాల్సిన నిర్ణయాలను ఈ బృందం తీసుకోనుంది.

## బదిలీ అయిన కేడర్, నాన్‌కేడర్ అధికారులు వీరే..

| అధికారిపేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| 1.జి.సంధ్యారాణి | జేసీ, ఆదిలాబాద్ | అదనపు కలెక్టర్, ఆదిలాబాద్ |
| 2.కె.వెంకటేశ్వర్లు | జేసీ, భద్రాద్రి కొత్తగూడెం | అదనపు కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం |
| 3.పి.రాజా విక్రంరెడ్డి | ఎస్జీడీసీ (పోస్టింగ్ కోసం వెయిటింగ్) | అదనపు కలెక్టర్, జయశంకర్–భూపాలపల్లి |
| 4.ఎం.క్రిష్ణ | ఎస్జీడీసీ, రంగారెడ్డి | అదనపు కలెక్టర్, హైదరాబాద్ |
| 5.బి.రాజేశం | జేసీ, జగిత్యాల | అదనపు కలెక్టర్, జగిత్యాల |
| 6.ఓజే మధు | జేసీ, జనగాం | అదనపు కలెక్టర్, జనగాం |
| 7.పి.శ్రీనివాస్‌రెడ్డి | జేసీ, నాగర్‌కర్నూల్ | అదనపు కలెక్టర్, జోగుళాంబ–గద్వాల |
| 8.పి.యాదిరెడ్డి | జేసీ, కామారెడ్డి | అదనపు కలెక్టర్, కామారెడ్డి |
| 9.జీవీ.శ్యామ్‌ప్రసాద్ లాల్ | జేసీ, కరీంనగర్ | అదనపు కలెక్టర్, కరీంనగర్ |
| 10.ఎన్. మధుసూదన్ | ఎస్జీడీసీ, హైదరాబాద్ | అదనపు కలెక్టర్, ఖమ్మం |
| 11.పర్సా రాంబాబు | జేసీ, కొమరంభీం– ఆసిఫాబాద్ | అదనపు కలెక్టర్, కొమరంభీం– ఆదిలాబాద్ |
| 12.ఎం.వెంకటేశ్వర్లు | జేసీ, నిజామాబాద్ | అదనపు కలెక్టర్, మహబూబాబాద్ |
| 13.కె.సీతారామారావు | ఎస్జీడీసీ, మెదక్ | అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్ |
| 14.వై.సురేందర్ రావు | జేసీ, మంచిర్యాల | అదనపు కలెక్టర్, మంచిర్యాల |
| 15.జి.నగేశ్ | జేసీ, మెదక్ | అదనపు కలెక్టర్, మెదక్ |
| 16.కె. విద్యాసాగర్ | జేసీ, మేడ్చల్–మల్కాజిగిరి | అదనపు కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి |
| 17.అభ్రమడ వెంకట్‌రెడ్డి | ఎస్జీడీసీ, యాదాద్రి–భువనగిరి | అదనపు కలెక్టర్, ములుగు |
| 18.వి.హనుమంతరెడ్డి | ఎస్జీడీసీ, చేవెళ్ల | అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూలు |
| 19.వి.చంద్రశేఖర్ | జేసీ, నల్లగొండ | అదనపు కలెక్టర్, నల్లగొండ |
| 20.డి. శ్రీనివాసరెడ్డి | ఎస్జీడీసీ, (వెయిటింగ్) | అదనపు కలెక్టర్, నారాయణ్‌పేట్ |
| 21.ఎ.భాస్కర్‌రావు | జేసీ, నిర్మల్ | అదనపు కలెక్టర్, నిర్మల్ |
| 22.బి. చంద్రశేఖర్ | ఎస్జీడీసీ, సిద్దిపేట | అదనపు కలెక్టర్, నిజామాబాద్ |
| 23.వి.లక్ష్మీనారాయణ | ఎస్జీడీసీ, జేడీ భూభారతి | అదనపు కలెక్టర్, పెద్దపల్లి |
| 24.ఆర్. అంజయ్య | ఎస్జీడీసీ, నిజామాబాద్ | అదనపు కలెక్టర్, రాజన్న–సిరిసిల్ల |
| 25.ఎస్,హరీశ్ | జేసీ, రంగారెడ్డి | అదనపు కలెక్టర్, రంగారెడ్డి |
| 26.జి.వీరారెడ్డి | ఎస్జీడీసీ, డిప్యూటేషన్–పీఆర్ | అదనపు కలెక్టర్, సంగారెడ్డి |
| 27.ఎస్. పద్మాకర్ | జేసీ, సిద్దిపేట | అదనపు కలెక్టర్, సిద్దిపేట |
| 28.డి. సంజీవ రెడ్డి | జేసీ, సూర్యాపేట | అదనపు కలెక్టర్, సూర్యాపేట |
| 29.సబావత్ మోతీలాల్ | ఎస్జీడీసీ, వికారాబాద్ | అదనపు కలెక్టర్, వికారాబాద్ |
| 30.డి.వేణుగోపాల్ | జేసీ, వనపర్తి | అదనపు కలెక్టర్, వనపర్తి |
| 31.పి.మనోహర్‌రెడ్డి | జేసీ, వరంగల్ రూరల్ | అదనపు కలెక్టర్, వరంగల్ రూరల్ |
| 32.ఎస్.దయానంద్ | జేసీ, వరంగల్ అర్బన్ | అదనపు కలెక్టర్, వరంగల్ అర్బన్ |
| 33.జి.రమేశ్ | జేసీ, యాదాద్రి–భువనగిరి | అదనపు కలెక్టర్, యాదాద్రిభువనగిరి |
| 34.ఎం.డేవిడ్ | జేసీ, మహబూబాబాద్ | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), ఆదిలాబాద్ |
| 35.వెంకటేశ్ ధోత్రే | స్పెషల్ ఆఫీసర్, కామారెడ్డి | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), కామారెడ్డి |
| 36.స్నేహలతా మొగిలి | స్పెషల్ ఆఫీసర్, మంచిర్యాల | అదనపు కలెక్టర్, (లోకల్ బాడీస్), ఖమ్మం |
| 37.పి.మోహన్‌లాల్ | ఎస్జీడీసీ, వరంగల్ అర్బన్ | అదనపు కలెక్టర్, (లోకల్ బాడీస్) మహబూబ్‌నగర్ |
| 38.ఇల త్రిపాఠి | స్పెషల్ ఆఫీసర్, భద్రాద్రి కొత్తగూడెం | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్) మంచిర్యాల |
| 39.డి.జాన్ సాంసన్ | అడిషనల్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), మేడ్చల్–మల్కాజిగిరి |
| 40.ఎం.మను చౌదరి | స్పెషల్ ఆఫీసర్, వరంగల్ (అర్బన్) | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), నాగర్‌కర్నూల్ |
| 41.రాహుల్ శర్మ | స్పెషల్ ఆఫీసర్, రాజన్న–సిరిసిల్ల | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), నల్లగొండ |
| 42.బీఎస్ లత | ఎస్జీడీసీ, పీఏ టు స్పెషల్ కలెక్టర్, ఓఆర్ఆర్, హెచ్‌ఎండీ | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), నిజామాబాద్ |
| 43.ప్రతీక్ జైన్ | స్పెషల్ ఆఫీసర్, కుమ్రంభీం–ఆసిఫాబాద్ | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), రంగారెడ్డి |
| 44.రాజర్షి షా | స్పెషల్ ఆఫీసర్, కరీంనగర్ | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), సంగారెడ్డి |
| 45.ముజామ్మిల్ ఖాన్ | స్పెషల్ ఆఫీసర్, సిద్దిపేట | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), సిద్దిపేట |
| 46.పి.చంద్రయ్య | ఎస్జీడీసీ, సూర్యాపేట | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), వికారాబాద్ |
| 47.ఖీమియా నాయక్ | ఎస్జీడీసీ, రాజన్నసిరిసిల్ల | అదనపు కలెక్టర్, (లోకల్‌బాడీస్), యాదాద్రి–భువనగిరి |
| 48.సంతోష్ బీ.ఎం | స్పెషల్‌ఆఫీసర్, వనపర్తి | ప్రాజెక్ట్ డైరెక్టర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ |
| 49.కె.చంద్రమోహన్ | ఎస్జీడీసీ (వెయిటింగ్) | ఓఎస్డీ టు చీఫ్ సెక్రటరీ |

# పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని టీచర్ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ భవన్‌లో సంఘం 50వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ 50 ఏళ్లుగా ముందుండి ఉద్యమాలు చేస్తోందన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ యూనియన్ కీలక భూమిక పోషించిందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పెన్షన్, మెటర్నిటీ లీవ్‌లు, గ్రామీణ ప్రాంత హెచ్‌ఆర్ఏ, అప్రెంటిస్ ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, హెడ్‌మాస్టర్లకు గెజిటెడ్ హోదా వంటి అనేక సదుపాయాలను సాధించిందన్నారు. ఈ సందర్భంగా సంఘానికి విశేష సేవలందించిన సముద్రాల రామనర్సింహాచార్యులు, మహ్మద్ అజీజ్ (నల్లగొండ), బి.మహదేవ్ (రంగారెడ్డి)ను సన్మానించారు. కార్యక్రమంలో మరో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

# 'సార్స్'ను మించిన కరోనా

▶ మొదటి పేజీ తరువాయి

6,188 మంది బాధితుల పరిస్థితి విషమంగా ఉందని చైనా ఆరోగ్య శాఖ ప్రకటించిన పరిస్థితుల్లో.. సార్స్‌తో పోలిస్తే కరోనా కారణంగా చనిపోయే వారి సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. చైనా వెలుపల ఇప్పటివరకు కరోనా కారణంగా ఫిలిప్పీన్స్‌లో ఒకరు, హాంకాంగ్‌లో ఒకరు చనిపోయారు. భారత్‌లో మూడు నిర్ధారిత కేసులను గుర్తించారు.

### ప్రజా యుద్ధం

కరోనా కట్టడికి చైనా ప్రజాయుద్ధమే (పీపుల్స్‌వార్) ప్రారంభించింది. వైరస్ వ్యాప్తిని నిరోధించడం, చికిత్స అందించడం, టీకాను రూపొందించే పరిశోధనలకు ఊతమివ్వడం.. తదితర చర్యల కోసం 1200 కోట్ల డాలర్లకు పైగా కేటాయించింది. 'కరోనా' విషయంలో సున్నితంగా స్పందించాలని చైనా ప్రపంచ దేశాలను కోరుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సంభాషణ సమయంలోనూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అదే విషయాన్ని స్పష్టం చేశారు. మరోవైపు, కరోనా కారణంగా, చైనా ఆర్థిక వ్యవస్థపై తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతి కూల ప్రభావం పడనుంది. ఇప్పటికే పలు దేశాలకు చైనా ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో చైనా నుంచి భారత్‌కు బల్క్ డ్రగ్ దిగుమతులు నిలిచిపోతే.. ఫార్మా రంగంపై అది దీర్ఘకాల ప్రతికూల ప్రభావం చూపుతుందని ఫార్మా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 'డైమండ్ ప్రిన్సెస్'లోని భారతీయులపై ఆందోళన

కరోనా వైరస్ కారణంగా జపాన్ తీరంలో నిలిపేసిన డైమండ్ ప్రిన్సెస్ నౌకలో చిక్కుకుపోయిన భారతీయుల గురించి ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు 3700 మంది ఉన్న ఆ నౌకలో ఇప్పటికే పలువురికి కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారించారు. తాజాగా ఆదివారం మరో ఆరుగురు ఆ వైరస్ బారిన పడినట్లు ప్రకటించారు. వారిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నామన్నారు. అయితే, ఆ నౌకలోని భారతీయులెవరికీ కరోనా సోకలేదని విదేశాంగ మంత్రి జైశంకర్ శుక్రవారం పార్లమెంట్లో ప్రకటించారు.

### ఆరు నెలల్లో టీకా?

కరోనా వ్యాధిని ఎదుర్కోవడానికి అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు వివిధ దేశాల శాస్త్రవేత్తలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ముందుకు అడుగులు వేస్తున్నారు. కొన్ని లక్షల కోట్ల డాలర్ల వ్యయంతో సంయుక్తంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. సాధారణంగా ఒక టీకా తయారు చేయాలంటే ఏళ్లకి ఏళ్లు పడుతుంది. మొదట జంతువుల మీద పరీక్షలు చేయాలి, మనుషులపై క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేయాలి, తర్వాతే ఆ వ్యాక్సిన్‌కి అనుమతి లభిస్తుంది. అయితే సార్స్‌ని మించిపోయిన ఈ వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఆరు నెలల్లో వ్యాక్సిన్‌ను తయారు చేస్తామని శాస్త్రవేత్తల బృందంలోని ఆస్ట్రేలియా పరిశోధనాకారుడు కీత్ చాపెల్ చెప్పారు.

### భారత్ స్నేహ హస్తం

కరోనా వైరస్‌తో అతలాకుతల మవుతున్న చైనాకు భారత్ స్నేహ హస్తం అందించింది. కరోనా కట్టడికి అవసరమైన ఏ సాయమైనా చేసేందుకు సిద్ధమని తెలిపింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు లేఖ రాశారు. గత వారం చైనా నుంచి 650 మంది భారతీయుల్ని వెనక్కి తీసుకురావడంలో జిన్‌పింగ్ సహకారాన్ని మోదీ కొనియాడారు. చైనాలోని భారతీయుల ఆరోగ్యం విషయంలో భారత్‌తో సమన్వయం చేసుకునేందుకు, కరోనాను ఎదుర్కొనే విషయంలో భారత్ సాయం తీసుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని భారత్‌లో చైనా రాయబారి సున్ వీడాంగ్ పేర్కొన్నారు.

### 42 మంది అనుమానితులకు కరోనా నిర్ధారణ పరీక్షలు

హైదరాబాద్: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఐసొలేషన్ వార్డులో ఇప్పటి వరకు చేరిన 42 మంది కరోనా అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని, అందరికీ కరోనా నెగెటివ్ వచ్చిందని గాంధీ ఆస్పత్రి నోడల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం అడ్మిట్ అయిన 9 మందికి నెగెటివ్ రావడంతో ఆదివారం డిశ్చార్జి చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. ఆదివారం ఒకరు అడ్మిట్ కాగా రక్త నమూనాలను సేకరించి నిర్ధారణ పరీక్షలకు పంపామన్నారు.



ఆదివారం ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న నీతిఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి. చిత్రంలో ప్యూర్ ఈవీ సీఈవో రోహిత్ వదేరా, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తదితరులు

# విదేశాల నుంచి లిథియం

▶ మొదటి పేజీ తరువాయి

రెండు గిగావాట్/గంటల సామర్థ్యమున్న బ్యాటరీలు తయారవుతాయని చెప్పారు. అయితే ఇతర దేశాల నుంచి విడిభాగాలను దిగుమతి చేసుకుని వాటిని ఇక్కడ క్రోడీకరించడం కాకుండా అన్నింటినీ ఇక్కడే తయారు చేయాలన్నది తమ ఉద్దేశమని చెప్పారు. ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీల్లోని లిథియంను దిగుమతి చేసుకోవాల్సి ఉందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని లిథియం ట్రయాంగిల్‌గా పేరొందిన అర్జెంటీనా, చిలీ, బొలీవియాలో గనులను తీసుకుని తవ్వేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టామని చెప్పారు. సతీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థలు రక్షణ రంగానికి ఉపయోగపడే పరికరాలు, టెక్నాలజీల అభివృద్ధికి ప్రయత్నించాలని సూచించారు.

### ఈప్లూటో 7జీ ప్రత్యేకమైంది..

ఐఐటీ హైదరాబాద్ సహకారంతో తాము అభివృద్ధి చేసిన ఈ ప్లూటో 7జీ విద్యుత్ స్కూటర్ చాలా ప్రత్యేకమైందని ప్యూర్ ఈవీ సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. బ్యాటరీ విడిభాగాలను దిగుమతి చేసుకున్నప్పటికీ మిగిలిన అన్ని టెక్నాలజీలను ఇక్కడే అభివృద్ధి చేశామని చెప్పారు. ఐఐటీ హైదరాబాద్‌ను ఆనుకునే సుమారు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణమున్న ఫ్యాక్టరీలో ఈప్లూటో 7జీని తయారు చేస్తున్నామని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల్లో 50 వరకూ దుకాణాలను ఏర్పాటు చేశామని, ఈ ఏడాది చివరికల్లా 200 ఔట్‌లెట్లు ప్రారంభిస్తామని తెలిపారు. స్కూటర్ విశేషాలను ప్రస్తావిస్తూ.. రూ.79,999లకు లభించే ఈ స్కూటర్ మార్కెట్‌లో అన్నింటికంటే చౌకైందన్నారు. ఒకసారి ఛార్జ్ చేస్తే ఈ వాహనం సుమారు 90–120 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదని తెలిపారు. గరిష్ట వేగం గంటకు అరవై కిలోమీటర్ల వరకూ ఉంటుందని చెప్పారు. ఇందులో ఉపయోగించే బ్యాటరీ 2.5 కిలోవాట్/గంట సామర్థ్యం కలిగినదని, మూడు నాలుగు గంటల్లో పూర్తిగా ఛార్జ్ చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

# మేడారంలో కొనసాగిన భక్తుల రద్దీ

## జాతర ముగిసినా తగ్గని జనం

- మాఘపౌర్ణమి కావడంతో తరలివచ్చిన జనం
- వర్షంతో చిరువ్యాపారులకు నష్టం
- హన్మకొండకు హుండీలు..
- పూజారులను సన్మానించిన కలెక్టర్ కర్ణన్

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం


ములుగు జిల్లా మేడారంలో శ్రీసమ్మక్క–సారలమ్మ మహాజాతర శనివారం అమ్మవార్ల వనప్రవేశంతో ముగిసినా.. ఆదివారం అమ్మవార్లకు ఇష్టమైన మాఘశుద్ధ పౌర్ణమి.. అందులోనూ సెలవు రోజు కావడంతో తల్లుల దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ఒక వైపు వర్షం కురిసినా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో వనదేవతల గద్దెల ప్రాంగణం కిటకిటలాడింది. ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తుల సంఖ్య అధికంగా ఉండడంతో జంపన్న వాగు నుంచి గద్దెల వద్దకు వెళ్లే దారిలో ట్రాఫిక్ స్తంభించింది. మరో వైపు భారీ వర్షం కారణంగా మేడారం ప్రాంతం జలమయమైంది. జాతరలో చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు జలమయమయ్యాయి. వస్తువులు తడిసిపోవడంతో నష్టపోయామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

### పూజారులకు సన్మానం

మేడారంలో శ్రీసమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులను కలెక్టర్ కర్ణన్ సన్మానించారు. మేడారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూజారులను శాలువాతో సత్కరించి పట్టువస్త్రాలు అందజేసి షీల్డులు బహూకరించారు. వనదేవతల దయతో పూజారులు, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో జాతరను విజయవంతం చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. పూజారులకు ఎలాంటి సాయం కావాలన్న చేసేందుకు సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, జాతర కమిటీ చైర్మన్ రామ్మూర్తి, పూజారులు అభినందనలు తెలిపారు.

### హన్మకొండకు హుండీల తరలింపు

మేడారం శ్రీసమ్మక్క సారలమ్మ మహాజాతర సంద ర్భంగా గద్దెల వద్ద దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన 456 హుండీలను ఆదివారం ప్రత్యేక వాహనంలో హన్మకొండకు తరలించారు. వర్షం పడడంతో హుండీల్లోని కానుకలు తడవకుండా వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పి జాగ్రత్తగా తీసుకెళ్లారు.



జంపన్న వాగు నుంచి గద్దెల వద్దకు వెళ్లే దారిలో స్తంభించిన ట్రాఫిక్



స్వామివారికి సహస్రధారలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

## రామయ్యకు నేత్రపర్వంగా కలశాభిషేకం

**భద్రాచలంటౌన్:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్వామివారి స్వర్ణమూర్తులకు సహస్ర కలశాభిషేక వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. 28 మంది ఆచార్య, బ్రహ్మ, రుత్విక్‌లు, 8 మంది వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గంధ, పుష్ప, దీప, ధూప, అర్ఘ్య, ఆద్యాలతో పలు రకాల ఫలాలను నైవేద్యంగా పెట్టారు. అనంతరం కుంభ, ధ్వజ, అష్ట, ద్వాదశ, నక్షత్ర హారతులు సమర్పించారు. ఆ తర్వాత ఆచార్యులకు పరివట్టం కట్టి స్వామివారి శేష మాలికలను అలంకరించి, మూర్తి కుంభాన్ని శిరస్సుపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.నర్సింహులు, ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు, విశ్రాంత ప్రధానార్చకులు రామచంద్రాచార్యులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీటి సమస్య ఉండొద్దు

### మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి

**గజ్వేల్:** వచ్చే వేసవి నాటికి రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలోనూ మంచినీటి సమస్య ఉండకూడదని, ఇందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు సాగాలని 'మిషన్ భగీరథ' ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండలోని మిషన్ భగీరథ హెడ్ రెగ్యులేటరీ వద్ద ఉన్న నాలెడ్జ్ సెంటర్‌లో రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథ స్థిరీకరణ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. కొన్ని ఆవాసాల్లో ఇంకా ఇంట్రావిలేజ్ వ్యవస్థతో నీటి సరఫరా జరగడం లేదని పేర్కొన్నారు. ఇంట్రావిలేజ్ పనుల్లో ఖమ్మం, నల్లగొండ జిల్లాలు వెనుకబడ్డాయని, అక్కడి అధికారులు తీరు మార్చుకోకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్వో ప్లాంట్ల నీటి వల్ల కలుగుతున్న అనర్థాలను ప్రజలకు వివరించి భగీరథ నీటిని మాత్రమే తాగేలా అవగాహన కల్పించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నాణ్యమైన నీటి సరఫరా చేయడానికి సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వేసవిలోపు పనులు పూర్తయ్యే దిశగా నిత్యం తాను పర్యవేక్షిస్తానని చెప్పారు. సెలవు దినాల్లోనూ సమీక్షలుంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్లు, ఆయా జిల్లాల ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవ మండపం పూర్తి

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తూర్పు రాజగోపురం సమీపంలో నిర్మించిన బ్రహ్మోత్సవ మండపం పూర్తయింది. 2 నెలల క్రితం మండప నిర్మాణ పనులు చేపట్టిన శిల్పులు దానికి తుది మెరుగులు దిద్ది ఆదివారం పూర్తి చేశారు. ప్లాట్‌ఫారం పనులు కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు శిల్పులు పేర్కొన్నారు.



పాతగుట్టలో శ్రీచక్ర తీర్థ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

## పాతగుట్ట ఆలయంలో చక్రతీర్థ స్నానం

**యాదగిరిగుట్ట:** యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం శ్రీ చక్రతీర్థ స్నానం కార్యక్రమాన్ని వేడుకగా జరిపారు. వర్షం కారణంగా శ్రీచక్ర ఆళ్వారుల సేవను ఉదయం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలోనే నిర్వహించి, అనంతరం ప్రత్యేక పాత్రలో శుద్ధమైన జలానికి పూజలు జరిపించి, ఆలయ ప్రధాన మండపంలోనే శ్రీ చక్రతీర్థ స్నానం వేడుకను జరిపారు. అంతకుముందు ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం శ్రీపుష్పయాగం, దేవత ఉద్వాసన, డోలారోహణం చేపట్టారు. సోమవారం శ్రీస్వామి వారికి శతఘటాభిషేకం నిర్వహించనున్నారు. ఈ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. కాగా,యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్‌తో పాటు మేడారంలో జరిగిన సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదాద్రీశుడి దర్శనానికి వచ్చారు. సుమారు 25 వేలకు పైగా భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మదర్శనానికి 2 గంటల సమయం, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.




ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరిలో కొట్టుకుపోతున్న మిర్చిని పరదాల ద్వారా సేకరిస్తున్న రైతులు

## అకాల వర్షం.. అపార నష్టం

- కల్లాలు, చేలల్లోని మిర్చి నీటిపాలు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఆందోళనలో రైతన్నలు

**సాక్షి, నెట్‌వర్క్:** ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా మిర్చి రైతులు కుదేలయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షాలతో కల్లాల మీద ఉన్న మిర్చి, తోటలపై ఉన్న పంట నీటిపాలైంది. చేలలోని పత్తి, మొక్కజొన్న నేలపాలైంది. మామిడి పూత రాలిపోయింది. ములుగు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట, వాజేడు మండలాల్లో ఆరబోసిన వేలాది క్వింటాళ్ల మిర్చి వరద నీటిలో కొట్టుకుపోయింది. వాజేడు మండలం పేరూరులో సుమారు 40 వేల క్వింటాళ్ల మిర్చి గోదావరిలో కలిసిపోయింది. చేతికందిన పంట నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖమ్మం జిల్లాలో ఆదివారం ఉదయం కురిసిన అకాల వర్షం మిర్చి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రస్తుతం మిర్చి పంట కోత కోసి రైతులు కల్లాల్లో అరబెట్టి ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున, మధ్యాహ్నం కురిసిన వానతో మిర్చి పూర్తిగా తడిసింది. కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ముదిగొండ, కామేపల్లి, రఘునాథపాలెం తదితర మండలాల్లో రైతులు నష్టపోయారు. కూసుమంచి మండలంలో 3.92 సెం.మీల వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం మండలంలో 2.22 సెం.మీల వర్షపాతం నమోదైంది. తడిసిన మిర్చి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. రేటు ఇంకా పడిపోతుందని కర్షకులు కుమిలిపోతున్నారు.









# నిర్వహణ భారమంతా నెత్తిమీదే

**ఈ ఏడాది నుంచి ఎత్తిపోతల పథకాల కింద భారీగా విద్యుత్ ఖర్చు**
- విద్యుత్, నిర్వహణ అవసరాలపైనే రూ. 8 వేల కోట్ల ఖర్చు
- నిర్వహణ భారాన్ని మోసేందుకు కేంద్రం విముఖత
- పంప్‌హౌస్‌ల మెయింటెనెన్స్‌కు భారీగా ఖర్చు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలకు, వాటికయ్యే నిర్వహణ ఖర్చును భరించాలన్న ప్రభుత్వ వినతిపై కేంద్ర ప్రభుత్వం విముఖత చూపడం తెలంగాణ ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. ఈ ఏడాది వర్షాకాలం నుంచి అందుబాటులోకి రానున్న భారీ ఎత్తిపోతల పథకాల కింద విద్యుత్ అవసరాలకు అయ్యే ఖర్చులో కొంతైనా కేంద్రం భరిస్తుందని ఆశలు పెట్టుకున్నా, దానిపై కేంద్రం నీళ్లు చల్లడంతో ఆ భారమంతా రాష్ట్రమే భరించాల్సి రానుంది. ఇకపై ఏటా విద్యుత్ అవసరాలకు గరిష్టంగా రూ. 8 వేల కోట్ల మేర వెచ్చించాల్సి రావడం రాష్ట్రానికి కత్తిమీద సాములా పరిణమించనుంది.

**ఆశలపై నీళ్లు చల్లిన కేంద్రం...**
రాష్ట్రంలో ఇప్పటికే 14 ఎత్తిపోతల పథకాల కింద నీటి పంపింగ్ జరుగుతుండగా వాటికి 1,500 మెగావాట్ల మేర విద్యుత్ వినియోగం ఉంటోంది. వాటిపైనే ఏటా రూ. 1,800 కోట్ల మేర విద్యుత్ బిల్లుల రూపేణా చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే ఎత్తిపోతల పథకాల పరిధిలో రూ. 3,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో గరిష్టంగా పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల పరిధిలోనే రూ. 1,600 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండగా దేవాదులలో రూ. 800 కోట్లు, ఏఎంఆర్‌పీలో రూ. 650 కోట్ల మేర విద్యుత్ బిల్లుల బకాయిలున్నాయి. ఈ బిల్లుల చెల్లింపే కష్టసాధ్యమవుతుండగా ఈ ఏడాది ఖరీఫ్ నుంచి విద్యుత్ వినియోగం మొత్తంగా 4,500–5,000 మెగావాట్ల మేర పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది జూన్ నుంచే 2 టీఎంసీల నీటిని కనీసం 6 నెలలపాటు ఎత్తిపోసేలా పంపులను సిద్ధం చేస్తున్నారు. ఈ నీటిని ఎత్తిపోసేందుకు గరిష్టంగా 2,800 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని లెక్కగట్టారు. ఈ విద్యుత్ అవసరాలకు మిడ్‌మానేరు ఎగువ వరకే రూ. 2,500 కోట్ల మేర ఖర్చు కానుండగా మిడ్‌మానేరు దిగువన పంపింగ్‌కు మరో రూ. 1,500 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇక ఈ ఏడాది జూన్ నుంచే సీతారామ ఎత్తిపోతలను పాక్షికంగా ప్రారంభించనున్నారు. వాటితోపాటే ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు అయ్యే



ఖర్చును కలుపుకొని మొత్తంగా ఈ ఏడాది నుంచి రూ. 8 వేల కోట్ల మేర ఖర్చు జరిగే అవకాశం ఉంది. 2020–21 నుంచి 2024–25 వరకు ఐదేళ్ల కాలానికి విద్యుత్ అవసరాలకు మొత్తంగా రూ. 37,796 కోట్లు అవసరం ఉంటుందని నీటిపారుదల శాఖ గతంలోనే తేల్చింది. వాటితోపాటే పంప్‌హౌస్‌ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) ఐదేళ్ల కాలానికి రూ. 2,374 కోట్లు ఉంటుందని లెక్కగట్టింది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే భారీ ఎత్తిపోతల పథకాల విద్యుత్, ఓఅండ్‌ఎంకు సంబంధించి మొత్తంగా రూ. 40,170 కోట్లు అవసరం అవుతుందని, ఈ ఖర్చులో కొంతైనా భరించాలని కేంద్రానికి విన్నవించింది. రాష్ట్ర విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఆర్థిక సాయం చేయాలని కోరినా కేంద్రం స్పందించలేదు. నిర్వహణ భారం మోసే అంశంపై కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. రాష్ట్ర ప్రాజెక్టులకుగానీ, నిర్వహణకుగానీ ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో ఈ నిర్వహణ భారాన్ని మొత్తంగా రాష్ట్రమే భరించాల్సి రానుంది. అసలే ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో ఇది రాష్ట్రానికి గుదిబండగా మారనుంది.

**ఎత్తిపోతల నిర్వహణకు రూ.300 కోట్లు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ నుంచి ప్రధాన ఎత్తిపోతల పథకాలన్నీ నిర్వహణలోకి వస్తున్నందున వాటి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం)కు ప్రత్యేకంగా బడ్జెట్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చూడాలని, దీనికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలని ఇదివరకే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించిన నేపథ్యంలో ఈ మేరకు నిధుల కేటాయింపు జరుగనుంది. ఎత్తిపోతల పథకాల పరిధిలో పంప్‌హౌస్‌లలోని పంపులు, మోటార్లు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రిజర్వాయర్, బ్యారేజీల గేట్లు, కాల్వలు, టన్నెళ్ల నిర్వహణ ఓఅండ్‌ఎం కిందకే తేనుండగా వీటికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.300 కోట్ల మేర కేటాయింపులు చేయనున్నారు. వాటి నిర్వహణ ఖర్చును ఆయా జిల్లా బాధ్యతలు చూసే ఈఎన్‌సీ, సీఈలు పర్యవేక్షించేలా బాధ్యతలు అప్పగించనున్నారు. ఓఅండ్‌ఎంకు అవసరమయ్యే ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, ఇతర సిబ్బంది అవసరాలపై ప్రాజెక్టులవారీగా లెక్కలు తీసి నిర్ణీత సిబ్బంది నియామకాలను చేపట్టి ఓఅండ్‌ఎం బడ్జెట్ నుంచే నిధుల కేటాయింపు చేయనున్నారు.

**కరెంట్ బిల్లులకు నిధుల కేటాయింపు..**
ఇక ఎత్తిపోతల పథకాలకు ఈ ఏడాది నుంచి విద్యుత్తు వినియోగం పెరగనుంది. దానికి అనుగుణంగా విద్యుత్ చార్జీలు తడిసిమోపెడు కానున్నాయి. ఇప్పటివరకు 1400 మెగావాట్ల మేర విద్యుత్ అవసరాలుండగా ఈ ఏడాది జూన్ నుంచి 5 వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉందని లెక్కగట్టారు. వీటికి రూ.4వేల కోట్ల వరకు బిల్లులు చెల్లించే అవకాశముంటుంది. అందుకే విద్యుత్ బిల్లుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు, ఈ ఏడాది విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వీలుగా రూ.3 వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయించే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి.

## విప్‌గా గంప గోవర్ధన్ బాధ్యతల స్వీకరణ



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ విప్‌గా సీనియర్ శాసనసభ్యుడు గంప గోవర్ధన్ ఆదివారం శాసనసభ ఆవరణలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌అండ్‌బీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచినా.. గోవర్ధన్ నిరాడంబరంగా, పేదల కోసం పనిచేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. గంప గోవర్ధన్‌ను గెలిపించినందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలతో పాటు కామారెడ్డి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.


## 'తుంగభద్ర' నీటిని విడుదల చేయండి

**తుంగభద్ర బోర్డుకు రాష్ట్రం వినతి**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆర్డీఎస్ కాల్వల కింది ఆయకట్టు అవసరాలకు తుంగభద్ర రిజర్వాయర్ నుంచి 1.537 టీఎంసీల నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రం తుంగభద్ర బోర్డుకు విన్నవించింది. ఆర్డీఎస్ కింద 20 వేల ఎకరాల ఆయకట్టు అవసరాల నిమిత్తం ఈ నీటిని విడుదల చేయాలని కోరింది. ఈ నెల 10 నుంచి 20 వరకు తొలి 4 రోజులపాటు 2,500 క్యూసెక్కుల చొప్పున, తర్వాతి 6 రోజులపాటు 1,300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ తుంగభద్ర బోర్డు కార్యదర్శికి లేఖ రాశారు.

## 'ఇన్నోవేషన్స్‌కు పాఠశాల దశలోనే పునాది వేయండి'

**సాక్షి, హైదరాబాద్:** విద్య లక్ష్యం ఉద్యోగం సంపాదించుకోవడం మాత్రమే కాదని, విద్యార్థులు వైవిధ్యంతో ఆలోచించి కొత్త ఆవిష్కరణలు చేసేందుకు పాఠశాల దశ నుంచే చర్యలు చేపట్టాలని, ఆవైపునకు విద్యార్థుల ఆలోచనలను మళ్లించాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత సహ సర్ కార్యావహ మన్మోహన్ వైద్య పేర్కొన్నారు. అఖిల భారతయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) అఖిల భారత కార్య నిర్వాహక వర్గ సమావేశాలు ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగాయి. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ అధ్యక్షుడు జేపీ సింఘాల్, ప్రధాన కార్యదర్శి శివానంద్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
DIPR Ro No 1246/LA/PP-Agency/2019-20


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
DIPR Ro No 1252/LA/PP-Agency/2019-20



సంత్ రవిదాస్ చిత్రపటానికి నమస్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

## పుట్టుకతోనే ఎవరూ శూద్రులు కాదని నిరూపించిన రవిదాస్

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్**

**సాక్షి, హైదరాబాద్:** ఉత్తర భారతంలో దళిత సామాజిక వర్గాల ఆధ్యాత్మిక గురువుగా సంత్ రవిదాస్ ప్రజలను ధర్మంవైపు నడిపించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. పుట్టుకతోనే ఎవరూ శూద్రులు కాదని రవిదాస్ నిరూపించారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రవిదాస్ గొప్ప ఆధ్యాత్మిక గురువుగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనలో ప్రజల్లో మార్పు తీసుకువచ్చేందుకు, సామాజిక చైతన్యం కోసం కృషి రవిదాస్ కృషి చేశారన్నారు. వృత్తి పరంగా కులం వచ్చిందే తప్ప జన్మతః కాదని నిరూపించారని తెలిపారు. రవిదాస్ తర్వాత అదే కోవలో బీఆర్ అంబేడ్కర్ సమాజాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. దేశమంతటా ప్రజలు రిజర్వేషన్ ఫలాలు పొందుతుంటే జమ్మూకశ్మీర్‌లో మాత్రం అవి అందడం లేదని, పాలకులు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలు చేయకపోవడం వల్లే ఆ పరిస్థితి తలెత్తిందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, సంఘటన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్, గంగరాజు, అరుణ జ్యోతి, వేముల అశోక్ పాల్గొన్నారు.

## గల్ఫ్‌లో తెలంగాణవాసుల భిక్షాటన



ఉపాధి లేక గదిలో ఉన్న తెలంగాణ గల్ఫ్ కార్మికులు

**వేములవాడ రూరల్:** ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ దేశాలకు వెళ్లిన పలువురు తెలంగాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి వెళ్లి ఒమన్‌లో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న దాదాపు 90 మంది కార్మికులు గత 16 నెలలుగా ఆయా కంపెనీల యజమానులు వేతనాలు ఇవ్వకపోవడంతో భిక్షాటన చేస్తూ పూటగడుపుతున్నారు. ఈ విషయాన్ని బాధితులు ఆదివారం 'సాక్షి'కి తెలియజేశారు. ఇలా చాలామంది తెలంగాణ కార్మికులు గల్ఫ్‌లోని ఇతర దేశాల్లో కూడా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వారు వెల్లడించారు. ఆదివారం ఒమన్ నుంచి గాజుల వెంకటేశ్ 'సాక్షి'తో మాట్లాడుతూ తెలంగాణ నుంచి దాదాపు 2.6 లక్షల మంది గల్ఫ్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రధానంగా కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల నుంచి ఎక్కువ శాతం కార్మికులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు.

## అబార్షన్లు ఆగట్లేదు!

▶ మొదటి పేజీ తరువాయి

అశాస్త్రీయ పద్ధతులను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారు. ఇది గుర్తించిన కేంద్రప్రభుత్వం అబార్షన్ల గడువును 24 వారాలకు పొడిగించింది. ఇక జరుగుతున్న అబార్షన్లలో దాదాపు సగం మేరకు ఆడబిడ్డను వదిలించుకునేవేనని వైద్య నిపుణులు అంటున్నారు.

**వైద్యులు కాని వారి చేతిలోనే 46.6 శాతం అబార్షన్లు..**
కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దేశంలో 46.6 శాతం అబార్షన్లు వైద్యులు కానివారు చేస్తున్నారు. వాస్తవంగా గైనకాలజిస్ట్ మాత్రమే ఈ అబార్షన్లను చేయాలి. అది కూడా ఏదైనా సమస్య ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. కానీ నర్సులు, మంత్రసానులు, ప్రైవేటు ప్రాక్టీషనర్లు, కుటుంబ సభ్యులు లేదా వ్యక్తిగతంగా కొందరు అనైతికంగా అబార్షన్లు చేస్తున్నారు. 27.4 శాతం అబార్షన్లు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్నాయి. 'చాలామంది వైద్యులు అబార్షన్లను అనైతికంగా భావిస్తారు. అందువల్ల తిరస్కరిస్తుంటారు. కానీ కొందరు తల్లిదండ్రులు ఆడబిడ్డ కడుపులో ఉందని స్కానింగ్ ద్వారా తెలుసుకొని అబార్షన్లు చేయిస్తున్నారు. ఇప్పటికీ కొందరు తల్లిదండ్రులు ఆడబిడ్డ విషయంలో సానుకూలంగా ఉండటం లేదన్న'విమర్శలున్నాయి. 'అనేక క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో స్కానింగ్ చేసి డబ్బు ముట్టజెబితే ఆడో మగో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అయితే తల్లిదండ్రుల కోరిక మేరకు కడుపులో నే ఖతం చేస్తున్నారు. ఇంతటి అనైతిక సంఘటనలు జరుగుతున్నా వైద్యాధికారులు పట్టించుకోవడంలేద'ని ఒక గైనకాలజిస్ట్ ఆరోపించారు.

**వివిధ సంవత్సరాల్లో తెలంగాణలో జరిగిన అబార్షన్ల సంఖ్య**

| సంవత్సరం | సంఖ్య |
|---|---|
| 2016–17 | 6,481 |
| 2017–18 | 7,862 |
| 2018–19 | 8,154 |
| 2019–20 (డిసెంబర్ వరకు) | 5,062 |

## సిరులవరి..

▶ మొదటి పేజీ తరువాయి

పెరిగిందని తెలిపింది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి 68.5 లక్షల ఎకరాల్లో సాగైంది. 2018–19తో పోలిస్తే ఏకంగా 20.76 లక్షల ఎకరాలు అధికంగా సాగు కావడం గమనార్హం. దీంతో వరిధాన్యం ఉత్పత్తి కూడా భారీగా వస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవడం, కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టులు జలకళ సంతరించుకోవడంతో సాగు విస్తీర్ణం సాధారణ అంచనాలను మించి నమోదైంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున ముందస్తు పెట్టుబడి ఇవ్వడం, దిగుబడి అధికంగా వచ్చే వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడంతో వరి సిరులు పండిస్తోంది.

**పత్తి 48.62 లక్షల బేల్స్..**
పత్తి రాష్ట్రంలో ప్రధాన పంట. ఖరీఫ్‌లో అత్యధికంగా వరి కంటే సాగు చేస్తారు. ఈసారి 52.24 లక్షల ఎకరాల్లో సాగైంది. గతం కంటే 2.75 లక్షల ఎకరాల్లో అధికంగా సాగు నమోదైంది. అయితే ఉత్పత్తి 48.62 లక్షల బేల్స్ ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. పప్పు పంటల సాగు 13.1 లక్షల ఎకరాల్లో కాగా, ఉత్పత్తి మొత్తం 4.67 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 27 వేల టన్నులు అధికం. కంది పంట ఖరీఫ్‌లో 7.29 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. గతం కంటే స్వల్పంగా తగ్గింది. అయితే ఉత్పత్తి మాత్రం 15 వేల మెట్రిక్ టన్నులు పెరిగింది. దిగుబడి పెరగడంతో ఉత్పత్తి పెరిగిందని నివేదికలో వివరించారు. ఈసారి కందుల ఉత్పత్తి 2.07 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనాల్లో పేర్కొన్నారు. గత సీజన్‌లో ఇది 1.92 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇక మొక్కజొన్న ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో కలిపి 13.69 లక్షల ఎకరాల్లో సాగైంది. గత సీజన్ కంటే 27 వేల ఎకరాలు అధికంగా రైతులు సాగు చేశారు. మొత్తం ఉత్పత్తి 25.59 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రానున్నట్లు అంచనాల్లో తెలిపారు. గత సీజన్‌తో చూస్తే 4.77 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువగా వస్తోంది. ఖరీఫ్‌లో 15.65 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 9.94 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రానున్నట్లు పేర్కొన్నారు. పెసర గత సీజన్‌లో ఎలాగో ఈసారి ఒకే స్థాయిలో ఉత్పత్తి రానుంది. 48 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశారు. మినుముల ఉత్పత్తి పడిపోయింది. గతంలో 31 వేల మెట్రిక్ టన్నులు రాగా, ఇప్పుడు 18 వేల టన్నులకే పరిమితమైంది. సోయాబీన్ గత సీజన్ కంటే 88 వేల మెట్రిక్ టన్నులు పెరిగి ఈసారి 3.22 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. శనగ పంట 1.46 లక్షల ఎకరాల్లో సాగు కాగా, 1.89 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశారు. గత సీజన్ కంటే 1.04 లక్షల ఎకరాలు అధికంగా సాగు కావడంతో ఉత్పత్తి కూడా 25 వేల మెట్రిక్ టన్నులు పెరిగింది. వేరుశనగ 3.27 లక్షల ఎకరాల్లో సాగు కాగా, గతం కంటే 32 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి తగ్గింది. 2.83 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి వస్తోందని నివేదించారు. పసుపు ఉత్పత్తి గతం కంటే 14 వేల మెట్రిక్ టన్నులు తగ్గింది. ఈసారి 3.05 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా వేశారు. అలాగే మిర్చి ఉత్పత్తి ఈసారి 24 వేల మెట్రిక్ టన్నులు పెరిగి 3.28 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి రానున్నట్లు సర్కారు తెలిపింది.

## సమాచార కమిషనర్ల ఎంపికకు కసరత్తు

**సీఎం నేతృత్వంలో కమిటీ భేటీ**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సమాచార కమిషనర్లను ఎంపిక చేసేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఆదివారం ప్రగతి భవన్‌లో సమావేశమైంది. శాసన సభలో అతి పెద్ద విపక్ష పార్టీ, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కమిటీ సభ్యులుగా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు మరో కమిషనర్ పనిచేస్తున్నారు. చట్టం ప్రకారం మరో 8 మంది కమిషనర్లను నియమించేందుకు అవకాశముంది. ఆశావహుల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. సీఎం నేతృత్వంలో ఆదివారం సమావేశమైన ఎంపిక కమిటీ.. ఈ దరఖాస్తులను పరిశీలించి కమిషనర్ల ఎంపికను పూర్తి చేసినట్లు సమాచారం. ఈ మేరకు సమాచార కమిషనర్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలున్నాయి.

# ఐదుగురిని బలిగొన్న గ్రానైట్ లారీ

**సంఘటన స్థలంలో నలుగురు.. • ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి • కరీంనగర్ జిల్లా కురిక్యాలలో ఘటన**



అంజయ్య(ఫైల్)



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ అంజయ్య మృతదేహం



మ్యాక బాణయ్య (ఫైల్)



మ్యాక నర్సయ్య(ఫైల్)



మ్యాక శేఖర్ (ఫైల్)



మ్యాక బాబు(ఫైల్)

**గంగాధర(చొప్పదండి):** గ్రానైట్ లారీ అతివేగం ఐదుగురి ప్రాణాలను బలిగొంది.15 నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సివారిని మృత్యువు కబలించింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలో శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని గౌరాపూర్ గ్రామానికి చెందిన మ్యాక నర్సయ్య(55) కుమారుడు మ్యాక బాబు ఇంటి వద్ద ద్విచక్రవాహనం పైనుంచి పడ్డాడు. తలకు గాయాలు కావడంతో స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు నర్సయ్య తన సమీప బంధువు, పూడూరు గ్రామానికి చెందిన టాటా మ్యాజిక్ వాహనం యజమాని గడ్డం అంజయ్య(47)ను సంప్రదించాడు. అంజయ్య కరీంనగర్ రావడానికి అంగీకరించడంతో బాబు(27), నర్సయ్య, బంధువైన మ్యాక బాణయ్య(60) కరీంనగర్ వెళ్లారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. రాత్రి చికిత్స అనంతరం కరీంనగర్‌లో పని చేసే మరో బంధువు మ్యాక శేఖర్(27)తో కలసి స్వగ్రామానికి బయల్దేరారు.

**ఎదురొచ్చిన మృత్యువు..**
వీరు ప్రయాణిస్తున్న వాహనం గంగాధర మండలం కురిక్యాల సమీపంలోకి రాగానే జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న గ్రానైట్ లారీ వేగంగా వచ్చి టాటా మ్యాజిక్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ అంజయ్య వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. నర్సయ్య, శేఖర్, బాబు రోడ్డుపై ఎగిరిపడి మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన బాణయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న గంగాధర ఎస్సై వివేక్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఎక్స్‌గ్రేషియా కోసం ధర్నా..**
ప్రమాదం విషయం తెలుసుకున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదివారం ఉదయం కరీంనగర్ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల బంధువులను ఓదార్చారు. ఈ సందర్భంగా మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రివద్ద ఐదు గంటలు ధర్నా చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన వారు పేద దళిత కుటుంబాలకు చెందిన వారని వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ శశాంకను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో ఆనంద్‌కుమార్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. లారీ యజమాన్యం నుంచి ఐదుగురి అంత్యక్రియల కోసం ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇప్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టిన టాటాఏస్ వాహనం**



మృతిచెందిన బోనగిరి సత్తయ్య

**స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ:** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లులో కెనాల్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా మరో ఎనిమిది మంది గాయపడ్డారు. తెల్లవారు జామున 3.40 గంటలకు బ్రిడ్జి రెయిలింగ్‌ను టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా 8 మంది గాయపడ్డారు. మేడారం జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన బోనగిరి సత్తయ్య తన కుటుంబసభ్యులతో పాటు మేడ్చల్ జిల్లా కీసర మండలం బండ్లగూడకు చెందిన బంధువులతో కలసి మొత్తం 21 మంది టాటాఏస్ ట్రాలీ వాహనంలో ఈనెల 7న మేడారం వెళ్లారు. అమ్మవార్ల దర్శనం అనంతరం శనివారం అర్ధరాత్రి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఛాగల్లు శివారుకు చేరుకున్న సమయంలో వాహనం అదుపుతప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో బోనగిరి సత్తయ్య(62) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో మరో 8 మంది గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

**వివిధ రోడ్డు ప్రమాదాల్లో 37 మందికి గాయాలు**
ఇటు జనగామ శివారులో జాతీయ రహదారిపై నెల్లుట్ల బైపాస్ క్రాసింగ్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 37 మంది స్వల్పంగా గాయపడ్డారు. ములుగు జిల్లాలో మేడారం మహాజాతరకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో స్వగ్రామాలకు వెళ్తున్న క్రమంలో ఈ ఘటనలు చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొదట 1.30 నుంచి 2.30 గంటల మధ్య సమయంలో నాలుగు కార్లు వేర్వేరుగా ఢీకొన్నాయి. 3 గంటల సమయంలో.. హైదరాబాద్–1 డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు.. మినీ డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి.

# ప్రచారానికి ఫేక్ వైరస్



- కరోనాపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు
- అపోహల్ని తొలగించడానికి డబ్ల్యూహెచ్ఓ ప్రయత్నం

**జెనీవా:** చైనా సహా ప్రపంచ దేశాల వెన్నులో వణుకు పుట్టిస్తున్న కరోనా వైరస్‌పై వస్తున్న వార్తల్లోనూ, జరుగుతున్న ప్రచారంలోనూ నిజానిజాలెంత? వైరస్ ఎలా సోకుతుందన్న దగ్గర నుంచి మృతుల సంఖ్య వరకు గందరగోళం నెలకొని ఉంది. సోషల్ మీడియా విస్తృతి పెరిగాక విపత్తుల సమయంలో అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టుగా తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయి. అయితే చైనాలో అత్యధికులు ఫాలో అయ్యే ఆన్‌లైన్ వెబ్‌సైట్ వారం క్రితం కరోనా మృతుల సంఖ్య 25 వేలకు దగ్గర్లో ఉందని కథనాన్ని ప్రచురించి, ఆ మర్నాడే ఆ సంఖ్యని మార్చేసి అధికారికంగా ప్రభుత్వం వెల్లడించిన మృతుల సంఖ్య ఉంచడంతో ఆందోళనలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఇంటర్నెట్‌లో రకరకాల వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తప్పుడు వార్తలు ప్రచారం చేసే ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలను బ్లాక్ చేస్తోంది. కరోనాపై అపోహల్ని తొలగిస్తోంది. అవేంటో చూద్దాం..

➤ **ప్రచారం: మాంసం తింటే కరోనా వైరస్ సోకుతుంది.**

**వాస్తవం:** ఈ మధ్యకాలంలో చైనాలో గబ్బిలం మాంసం తింటున్న వీడియోలు సోషల్ మీడియాలో పెట్టేవారి సంఖ్య పెరిగిపోతోంది. అందుకే చైనీయుల ఆహార అలవాట్లు వల్లే కరోనా వైరస్ సోకుతోందని ప్రచారం జరుగుతోంది. డబ్ల్యూహెచ్ఓ అధికారులు ఈ ప్రచారాన్ని తోసిపుచ్చారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కొత్త వైరస్‌లు రావడం సర్వసాధారణమని అంటున్నారు. ఈ వైరస్‌కి కారణం పాములా, గబ్బిలాలా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదన్నారు.

➤ **ప్రచారం: చైనా నుంచి వచ్చే ప్యాకేజీలు తీసుకున్నా కరోనా కమ్మేస్తుంది.**

**వాస్తవం:** వైరస్‌లు ఎప్పుడూ భూ ఉపరితలంపై ఎక్కువ కాలం జీవించి ఉండలేవు. అందుకే చైనా నుంచి వచ్చే లేఖలు, ప్యాకేజీలు వంటివి తీసుకున్నా ఎలాంటి ప్రమాదం ఉండదు.

➤ **ప్రచారం: పెంపుడు జంతువులకి కూడా కరోనా వైరస్ సోకుతుంది.**

**వాస్తవం:** ఇంట్లో కుక్కలు, పిల్లులు వంటి పెంపుడు జంతువులుంటే వాటికి కూడా కరోనా వైరస్ సోకుతోందంటూ అవి మరణించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. అయితే కుక్కలు, పిల్లులకి కరోనా సోకుతుందనడానికి ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవని డబ్ల్యూహెచ్ఓ తన వెబ్‌సైట్లో స్పష్టం చేసింది.

➤ **ప్రచారం: రేయింబవళ్లు మాస్క్‌లు ధరిస్తే కరోనా వైరస్ సోకదు.**

**వాస్తవం:** మాస్క్‌లు ధరించినంత మాత్రాన వైరస్ సోకదని చెప్పలేం. మాస్క్‌ల వల్ల చిన్నాచితకా ఇన్‌ఫెక్షన్లు మాత్రమే నిరోధించగలం. కానీ మొండి వైరస్‌లు సోకకుండా మాస్క్‌లు కూడా నిరోధించలేవు. చేతులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుంటే కొంత ప్రయోజనం ఉంటుంది. రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటేనే కరోనాను తట్టుకోగలరని అధికారులు స్పష్టం చేశారు.

➤ **ప్రచారం: వెల్లుల్లి తినడం, నువ్వుల నూనె రోజూ శరీరానికి రాసుకోవడం, ఉప్పు నీళ్లతో తరచూ పుక్కిలించడం చేస్తే వ్యాధి రాదు.**

**వాస్తవం:** ఇదంతా తప్పుడు ప్రచారమే. వెల్లుల్లి బ్యాక్టీరియాను నిరోధిస్తుంది తప్ప వైరస్‌లను కాదు. అదే విధంగా ఉప్పు నీళ్లు పుక్కిలించడం, నువ్వుల నూనె రాసుకోవడం కూడా. వీటి వల్ల ఎప్పుడూ ఉండే సాధారణ ప్రయోజనాలే తప్ప కరోనాని నియంత్రించలేవు.

➤ **ప్రచారం: మిరాకిల్ మినరల్ సొల్యూషన్ వైరస్‌ని చంపేస్తుంది.**

**వాస్తవం:** క్లోరిన్ డయాక్సైడ్‌తో కూడిన మిరాకిల్ మినరల్ సొల్యూషన్ తాగితే కరోనా వ్యాధి తగ్గిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేన్సర్, హెచ్ఐవీ, ఆటిజమ్‌ను కూడా తగ్గిస్తుందని సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. కానీ అది శుద్ధ అబద్ధం. ఆ ద్రావణాన్ని తాగితే వాంతులు, లివర్ ఫెయిల్యూర్ వంటివి జరుగుతాయని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరించింది.

# ఢిల్లీ పోలింగ్ @ 62.59%

**పోలింగ్ ముగిసిన 24 గంటల తరువాత తుది గణాంకాలు వెల్లడించిన ఈసీ**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తుది గణాంకాలను.. పోలింగ్ ముగిసిన దాదాపు 24 గంటల తరువాత.. ఎన్నికల సంఘం ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు విడుదల చేసింది. మొత్తంగా, 62.59 శాతం పోలింగ్ నమోదైందని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రణ్‌బీర్ సింగ్ వెల్లడించారు. 2015 ఎన్నికల కన్నా ఇది దాదాపు 5% తక్కువ. ఆ ఎన్నికల్లో 67.47% మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని 70 నియోజకవర్గాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో బల్లీమారాన్ నియోజకవర్గంలో అత్యధికంగా 71.6%, ఢిల్లీ కంటోన్మెంట్ స్థానంలో అత్యల్పంగా 45.4% పోలింగ్ నమోదైందని సింగ్ తెలిపారు. తుది గణాంకాలను విడుదల చేయడంపై జరిగిన ఆలస్యంపై ఆయన వివరణ ఇచ్చారు. కచ్చితమైన గణాంకాలను విడుదల చేయాలనే ఉద్దేశంతో రాత్రంతా రిటర్నింగ్ అధికారులు సమాచారాన్ని విశ్లేషించారని, అందువల్లనే పోలింగ్‌కు సంబంధించిన తుది శాతాన్ని వెల్లడి చేయడంలో జాప్యం ఏర్పడిందని ఆయన వివరించారు. అయితే, ఇది అసాధారణ ఆలస్యమేమీ కాదన్నారు. తుది పోలింగ్ శాతాన్ని వెల్లడించడంలో ఆలస్యం నెలకొనడాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. 'ఈసీ ఏం చేస్తోంది? పోలింగ్ వివరాలను ఎందుకు విడుదల చేయడం లేదు?' అని ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆయన ట్వీట్ చేశారు. 'బీజేపీ నేతలు ఇచ్చే పోలింగ్ గణాంకాల కోసం ఈసీ ఎదురు చూస్తోంది. అందుకే, పోలింగ్ ముగిసి 24 గంటలు గడుస్తున్నా ఇప్పటికీ తుది లెక్కలు ఈసీ వెల్లడించలేకపోయింది' అని ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మీడియాతో అన్నారు. 70 ఏళ్ల దేశ చరిత్రలో ఇలాంటిది మునుపెన్నడూ జరగలేదని ఆయన వ్యాఖ్యానించారు.



దేశంలో తొలిసారి

## కుక్కకు పేస్‌మేకర్

**న్యూఢిల్లీ:** భారత్‌లో తొలిసారి ఓ కుక్కకు పేస్‌మేకర్ విజయవంతంగా అమర్చారు. కాకర్ స్పేనియల్ జాతికి చెందిన కుక్క ఖుషి (7.5 ఏళ్లు)కి ఢిల్లీలోని మాక్స్ వెటర్నరీ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్‌కు ముందు కుక్క గుండె వేగం నిమిషానికి 20కి పడిపోయిందని, కుక్కల సాధారణ గుండె వేగం నిమిషానికి 60–120 సార్లు ఉంటుందని వైద్యులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 15న దాదాపు గంటన్నర పాటు ఈ ఆపరేషన్ జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ శునకం పరిస్థితి సాధారణంగా ఉందని దాని యజమాని మను మీడియాకు తెలిపారు.

## క్లుప్తంగా...

### కరోనాతో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు నో

**బనశంకరి:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌కు సిలికాన్‌సిటీ బెంగళూరులో ట్రాఫిక్ పోలీసులు కూడా హడలిపోతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లను తాత్కాలికంగా నిలిపేశారు. సాధారణంగా వాహనదారుల నోట్లో గొట్టం పెట్టి గాలిని ఊది ఆల్కోమీటర్ ద్వారా మద్యం తాగిందీ.. లేనిదీ పరిశీలిస్తారు. ఇలా అనేక మంది గాలిని ఊదడం వల్ల క్రిములు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ప్రమాదముందని భావించారు. దీంతో ట్రాఫిక్ పోలీసు విభాగం హెడ్ రవికాంతేగౌడ డ్రంక్ అండ్ డ్రైవ్‌లను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. అవసరమైతే ఆల్కోమీటర్ వాడకుండా వైద్య పరీక్షలు నిర్వహించి జరిమానాలు విధించాలని ఉన్నతాధికారులు సూచించారు.

### అఫ్గాన్‌లో ఇద్దరు అమెరికా సైనికులు మృతి

**కాబూల్:** అఫ్గాన్ సైనికుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు అమెరికా సైనికులు మృతి చెందినట్లు అమెరికా ఆదివారం ధృవీకరించింది. అఫ్గానిస్తాన్‌లోని నాంగర్హర్ ప్రావిన్స్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. షెర్జాద్ జిల్లాలో అఫ్గాన్–అమెరికా బలగాలు 'ముఖ్య నేతల భేటీ' నిర్వహిస్తుండగా అఫ్గాన్ సైనికుడు మెషీన్ గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు అమెరికా సైనికులు చనిపోగా ముగ్గురు అఫ్గాన్ సైనికులు గాయపడ్డారు.

### సీఏఏకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ పుస్తకం

**కోల్‌కతా:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ రాసిన ఓ పుస్తకం అమ్మకానికి పెట్టిన ఆరు రోజుల్లో 1,000 కాపీలు అమ్ముడుపోయింది. మమత రచించిన 'నాగరికట్ట ఆతంకో'(పౌరసత్వ భయం) పుస్తకాన్ని అంతర్జాతీయ కోల్‌కతా పుస్తక ప్రదర్శనలో ఈ నెల 4న అమ్మకానికి ఉంచారు. ఈ పుస్తకంలో రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో భారత్‌లో అనిశ్చితి గురించి ఆమె రాశారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ వ్యతిరేక ఉద్యమం, తాజా రాజకీయాలపై తన అభిప్రాయాలను విశదీకరించారు.

### కన్నడ బీజేపీ వివాదాస్పద ట్వీట్

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటక బీజేపీ శాఖ పోస్టు చేసినట్లుగా ప్రచారంలో ఉన్న ఒక ట్వీట్ వివాదాస్పదమైంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద మైనారిటీ మహిళలు బారులు తీరి తమ గుర్తింపు కార్డులను చూపిస్తూ ఉన్న ఒక వీడియోను కర్ణాటక బీజేపీ తమ ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేసింది. 'గుర్తింపు కార్డులు జాగ్రత్తగా ఉంచుకోండి. మళ్లీ ఎన్‌పీఆర్ సర్వేలో చూపించాల్సి ఉంటుంది' అని రాసి ఉంది. ఈ ట్వీట్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### భదోహీని రవిదాస్ నగర్‌గా మారుస్తాం: మాయావతి

**లక్నో:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండగా సామాజికవేత్త, కవి రవిదాస్‌ను ఎన్నడూ గౌరవించలేదని.. ఇప్పుడు అధికారం కోల్పోగానే స్వార్థ రాజకీయాల కోసం నాటకీయ కోణంలో ఆలయాలను సందర్శిస్తున్నాయని బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శించారు. రవిదాస్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఆదివారం వారణాసిలోని రవిదాస్ ఆలయాన్ని సందర్శించడంపై మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వస్తే భదోహీని సంత్ రవిదాస్‌నగర్‌గా పేరు మారుస్తానన్నారు.

# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై కీలక తీర్పు

**రిజర్వేషన్ల కల్పన ప్రభుత్వాల విచక్షణాధికారమేనన్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించడానికి సంబంధించి శుక్రవారం సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రాలు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే, ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరడానికి సంబంధించి ఎలాంటి ప్రాథమిక హక్కు లేదని పేర్కొంది. 'రిజర్వేషన్లు కల్పించాలని కోర్టులు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించలేవు' అని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ హేమంత్ గుప్తాల ధర్మాసనం తేల్చిచెప్పింది. 2012 సెప్టెంబర్ 5న ఉత్తరాఖండ్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు అందులో పేర్కొనలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేయగా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రభుత్వ నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. ఆ ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పు వెలువరిస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వ నోటిఫికేషన్‌ను సమర్థిస్తూ, హైకోర్టు ఆదేశాలను కొట్టివేసింది. ప్రభుత్వ నిర్ణయం చట్టవ్యతిరేకమని కోర్టు నిర్ధారించడం సరికాదని తీర్పులో పేర్కొంది. 'పబ్లిక్ పోస్ట్‌ల్లో నియామకాలకు సంబంధించి రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టులు ఆదేశించలేవని చట్టంలో స్పష్టంగా ఉంది. అలాగే, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు కచ్చితంగా రిజర్వేషన్లు కల్పించాలనే నిబంధన కూడా లేదు. అయినా, ఒకవేళ రాష్ట్రాలు తమ విచక్షణాధికారాన్ని వినియోగించుకుని వారికి రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే, కచ్చితమైన గణాంకాలు సేకరించి, తద్వారా ఆయా వర్గాలను సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. రిజర్వేషన్లు కల్పించవచ్చు' అని ధర్మాసనం వివరించింది. రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగంలో ఉన్న నిబంధనలపై కూడా ధర్మాసనం వివరణ ఇచ్చింది. 'రాజ్యాంగంలోని 16(4), ఆర్టికల్ 16(4ఏ) అధికరణలు ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని ప్రభుత్వాలకు కల్పిస్తున్నాయి. ఆయా వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లేదని విశ్వసిస్తే ప్రభుత్వాలు వారికి రిజర్వేషన్లు కల్పించేలా నిర్ణయం తీసుకోవచ్చు. ఆయా అధికరణాల్లో ఆ విషయం స్పష్టంగా ఉంది' అని ధర్మాసనం పేర్కొంది.



### తీర్పును ఖండిస్తున్నాం: కాంగ్రెస్

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తమకు ఆమోదనీయం కాదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీల హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఆరోపించింది. ఈ తీర్పును పార్లమెంట్ లోపల, వెలుపల కాంగ్రెస్ లేవనెత్తుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ ఆదివారం తెలిపారు. ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడం వారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. అది ప్రభుత్వాల విచక్షణాధికారంపై ఆధారపడకూడదని కాంగ్రెస్ విశ్వాసం' అని వాస్నిక్ పేర్కొన్నారు.

## ప్రభుత్వానిది తిరోగమన విధానం

**కమాండ్ పోస్టులను అప్పగించకపోవడంపై సుప్రీంకోర్టుకు తెలిపిన మహిళా అధికారులు**

**న్యూఢిల్లీ:** సైన్యంలో మహిళలకు కమాండ్ బాధ్యతలను అప్పగించరాదన్న కేంద్రం నిర్ణయం 'తిరోగమన విధానం మాత్రమే కాదు, ప్రతిభాసామర్థ్యాలకు పూర్తిగా విరుద్ధం. గౌరవానికి భంగకరం'అని ఆర్మీ మహిళా అధికారులు పేర్కొన్నారు. మహిళలకు శారీరకపరమైన పరిమితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్న కేంద్రం వాదనపై వారు సుప్రీంకోర్టుకు విన్నవించారు. సైన్యంలోని 10 కంబాట్ సపోర్ట్ ఆర్మ్స్‌లో 28 ఏళ్లుగా సేవలందిస్తూ మానసికంగా, విధి నిర్వహణపరంగా సామర్థ్యాన్ని నిరూపించుకున్నట్లు తెలిపారు.'పురుష సైనికులతో కూడి నప్లటూన్లు, కంపెనీలను సంక్షోభ సమయాల్లో నడిపిన మహిళల సామర్థ్యాన్ని సైన్యం గుర్తించింది. మహిళా అధికారుల నేతృత్వంలో పని చేసే సమయంలో సైనికులు ఉత్తర్వులను లెక్కచేయని/ పాటించని సందర్భాలు లేనేలేవు. అప్పగించిన ఎలాంటి బాధ్యతలైనా సమర్థమంతంగా నెరవేర్చారు'అని అందులో పేర్కొన్నారు. వాళలకు బాధ్యతలు అప్పగించే విషయమై ఈనెల 11వ తేదీన అత్యున్నత న్యాయస్థానం విచారణ జరపనుంది.



**గిన్నిస్‌కెక్కిన భరతనాట్య ప్రదర్శన**

కేంద్ర పర్యాటక శాఖ నేతృత్వంలో ఏక కాలంలో 10,176 మంది భరత నాట్యంలో పాల్గొని, అయిదు నిమిషాలపాటు ఇచ్చిన ప్రదర్శన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. ఈ ప్రదర్శన తమిళనాడుకు చెందిన గౌరివాక్కంలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ మైదానంలో శనివారం రాత్రి జరిగింది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. - సాక్షి, చెన్నై

# ఒడిశాలో బస్సుకు షాక్..

**11 మంది మృతి, 34 మందికి గాయాలు**

**భువనేశ్వర్:** ఒడిశాలో ఓ బస్సుపై 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడటంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 11 మంది ప్రయాణికులు దుర్మరణం చెందగా.. 34 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గంజాం జిల్లా గోళాంతర ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది. 45 మంది ప్రయాణికులతో జంగల్పాడు నుంచి చికరాడ వెళ్తున్న బస్సు మందరాజ్‌పూర్ వద్ద విద్యుదాఘాతానికి గురైంది. బస్సులోని వారంతా ఓ వివాహ కార్యక్రమానికి హాజరవడానికి వెళ్తున్నారని బెర్హంపూర్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీవో) సర్దార్ జయంత్ కుమార్ మహాపాత్ర వెల్లడించారు. మృతులకు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ సంతాపం తెలిపారు. మరణించిన వారి కుటుంబసభ్యులకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పద్మనాభ బెహరా తెలిపారు.



సంఘటన స్థలంవద్ద గుమికూడిన జనం

## బ్రిటన్ కొత్త వీసాకు తుదిమెరుగులు

**లండన్:** ఈయూ నుంచి వైదొలగిన బ్రిటన్ బ్రెగ్జిట్ పాయింట్స్ బేస్డ్ వీసా, ఇమిగ్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. దీనికి సంబంధించిన వ్యవహారాలకు ప్రధాని బోరిస్ జాన్సన్, హోంమంత్రి ప్రీతి పటేల్‌లు తుదిమెరుగులు దిద్దినట్లు అధికారులు తెలిపారు. దీని ద్వారా నిపుణులను భారత్ సహా ప్రపంచ నలుమూలల నుంచి రప్పించుకోవచ్చని ఆ దేశం భావిస్తోంది. గత వారం జరిగిన సమావేశంలో యూకే మైగ్రేషన్ అడ్వైజరీ కమిటీ సూచించిన సలహాలను ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుంది. ఇందులోనే కనీస వేతనాలు సంబంధించిన వివరాలున్నాయి. నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగావకాశాలను కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు కూడా అందులో ఉన్నాయి. గురువారం మంత్రివర్గ విస్తరణ జరగనుండగా, శుక్రవారం వీసాల వ్యవహారానికి సంబంధించిన వివరాలను ప్రీతి పటేల్ వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిపుణుల రంగంలో యూకే వీసాల్లో అత్యధికులు భారతీయులే ఉన్నారు. గతేడాదిలో 56 వేలకు పైగా టైర్–2 వీసాలను యూకే ఇచ్చింది. బ్రెగ్జిట్ వల్ల ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



రష్యాలోని కోమీ ప్రాంతం ఉసిన్స్క్ విమానాశ్రయంలో విమానం బెల్లీ ల్యాండింగ్ అయింది. గాలి వేగంలో మార్పు వల్ల అకస్మాత్తుగా విమానాన్ని దించాల్సి వచ్చింది. విమానం ముందు చక్రాలు బయటకు రాకముందే ల్యాండ్ అయింది. దీనినే సాంకేతికంగా బెల్లీ ల్యాండింగ్ అంటారు. పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో అందులోని 100 మంది ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు.

## సీఏఏ, ఎన్నార్సీలపై నిరసనలెందుకు?

**మహారాష్ట్ర నవనిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే**

**ముంబై:** అక్రమంగా భారత్‌లో నివాసముంటున్న పాకిస్తానీయులు, బంగ్లాదేశీలను తిప్పి పంపాల్సిందేనని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే డిమాండ్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరపట్టిక (ఎన్నార్సీ)లకు మద్దతుగా ఆదివారం ముంబైలో గిర్గావ్ చౌపట్టి నుంచి ఆజాద్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వేలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం ఆజాద్ మైదానంలో ఆయన మాట్లాడుతూ.. సీఏఏ, ఎన్నార్సీలపై నిరసనలు ఎందుకు చేస్తున్నారంటూ సీఏఏ వ్యతిరేక నిరసనకారులను ప్రశ్నించారు. నిరసనలు ఇలాగే కొనసాగితే.. నిరసనలకు నిరసనలతో, రాళ్లకు రాళ్లతో, ఖడ్గాలకు ఖడ్గాలతోనే జవాబిస్తామని హెచ్చరించారు. పుట్టినప్పటి నుంచి భారత్‌లోనే ఉన్న ముస్లింలను ఎవరూ వెలివేయబోవడంలేదని, వారెందుకు నిరసనలు చేస్తున్నారో అర్థంకావడంలేదన్నారు. సీఏఏ, ఎన్నార్సీ నిరసనకారులు తమ బలాన్ని ఎవరికి, ఎందుకు చూపించాలనుకుంటున్నారని ప్రశ్నించారు. సీఏఏను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్లే నిరసనలు జరుగుతున్నాయన్నారు. పొరుగుదేశాల నుంచి వచ్చే చొరబాటుదారులకు ఆశ్రయం ఇవ్వడానికి భారత్ ఏమైనా ధర్మసత్రమా అని ఆయన ప్రశ్నించారు.

# ఒమర్ ప్రజలను ప్రభావితం చేస్తారు

- మెహబూబా వేర్పాటువాదులకు అనుకూలం
- అందుకే వారిపై పీఎస్‌ఏ ప్రయోగం
- కశ్మీర్ పోలీసుల నివేదిక వెల్లడి



ఒమర్ అబ్దుల్లా




మెహబూబా ముఫ్తీ

**శ్రీనగర్:** 'మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా(49) ప్రజలను ప్రభావితం చేసే శక్తి ఉంది... మరో మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ(60) నిషేధిత ఉగ్రసంస్థకు మద్దతు ప్రకటించారు' ఈనెల 6వ తేదీన ఒమర్, మెహబూబాను ప్రజా భద్రతా చట్టం (పీఎస్‌ఏ) కింద నిర్బంధంలోకి తీసుకున్నట్లు ప్రకటించిన పోలీసులు.. అందుకు కారణాలను తెలుపుతూ రూపొందించిన నివేదికలోని అంశాలివి. జమ్మూకశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేస్తున్నట్లు గత ఏడాది ఆగస్టు 5వ తేదీన ప్రకటించిన కేంద్రం.. ఒమర్, మెహబూబాలతోపాటు మరికొందరు నేతలను నిర్బంధించడంతోపాటు ఇంటర్నెట్‌పై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. డిటెన్షన్ గడువు (ఆరు నెలలు) ముగియడానికి కొన్ని గంటల ముందు వీరిద్దరినీ పోలీసులు పీఎస్‌ఏ కింద నిర్బంధంలోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ చట్టం కింద వీరిని మూడు నెలలపాటు నిర్బంధంలో ఉంచొచ్చు. ఇప్పటికే ఒమర్ తండ్రి, కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాను ఈ చట్టం కింద నిర్బంధంలో ఉంచిన విషయం తెలిసిందే. 'ముఖ్యమంత్రిగా పనిచేసిన ఒమర్‌కు ప్రజల్లో పలుకుబడి ఉంది. రాష్ట్రంలో ఉగ్రవాదం ప్రబలంగా ఉన్న సమయంలో ఎన్నికలను బహిష్కరించాలంటూ ఉగ్రవాద సంస్థలు పిలుపు నిచ్చినప్పటికీ ప్రజలను ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రభావితం చేయగలిగారు. కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి రద్దుకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నించారు' అని ఆ నివేదికలో పోలీసులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఒమర్ చేసిన కామెంట్లను మాత్రం అందులో ప్రస్తావించలేదు. 'పీడీపీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అయిన మెహబూబా 'ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా మాట్లాడారు. కశ్మీర్‌ను భారత్ అన్యాయంగా ఆక్రమించుకుందని వ్యాఖ్యానించారు. నిషేధిత జమాతే ఇస్లామియా సంస్థకు అనుకూలంగా వ్యాఖ్యలు చేశారు' అని పోలీసులు ఆ నివేదికలో పేర్కొన్నారు.

**ఇంటర్నెట్‌పై తాత్కాలిక నిషేధం**

కశ్మీర్‌లో ఆదివారం ఉదయం ఇంటర్నెట్‌పై ఆంక్షలు విధించిన యంత్రాంగం సాయంత్రానికి ఆంక్షలు సడలించింది. పార్లమెంట్‌పై ఉగ్రదాడి ఘటనలో దోషి అఫ్జల్ గురుకు ఉరి శిక్ష అమలై ఏడేళ్లవుతున్న సందర్భంగా వేర్పాటువాద సంస్థ జేకేఎల్ఎఫ్ ఆదివారం బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో ముందు జాగ్రత్తగా ఇంటర్నెట్‌ను బంద్ చేశారు.

# సాక్షి సాహిత్యం




నల్లగొండ । సోమవారం
ఫిబ్రవరి । 10 । 2020
sakshisahityam@gmail.com


## ఈవారం పుస్తకాలు

**సులభ వ్యాకరణము**
రచన: బొంత లచ్చారెడ్డి; పేజీలు: 152; వెల: 100; ప్రతులకు: రచయిత, 1-2-400, శాంతి నగర్, కాలేజ్ కాలనీ, ఆదిలాబాద్-504001. ఫోన్: 9493557554

**ప్రేమా! ప్రేమా! నువ్వెక్కడ? (నవల)**
రచన: వీరాజీ; పేజీలు: 248; వెల: 200; ప్రతులకు: రచయిత, 101- ఎస్వీస్ నెస్ట్, 12-13-853/28, గోకుల్ నగర్, తార్నాక, సికింద్రాబాద్-17. ఫోన్: 9290099512

**కలగన్నది-కనుగొన్నది-1**
పేజీలు: 216; వెల: 50




**కలగన్నది-కనుగొన్నది-2**
పేజీలు: 180; వెల: 50
చెరుకూరి సత్యనారాయణ జ్ఞాపకాలు
ప్రచురణ: తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటీ, 2/1, అరండల్‌పేట, గుంటూరు-2. ఫోన్: 9848664587

**సమర శంఖం (వ్యాస సంపుటి)**
రచన: మేకిరి దామోదర్(మేదాజీ); పేజీలు: 188; వెల: 100; ప్రతులకు: లలిత పబ్లికేషన్స్, 23-6-234/4/ఎ, న్యూ శాయంపేట్, టైగర్ హిల్స్ కాలనీ, హంటర్ రోడ్, హన్మకొండ-506001. ఫోన్: 9573666650

**తెలుగు కథానిక రైతు జీవిత చిత్రణ**
రచన: డాక్టర్ పి.వి.సుబ్బారావు; పేజీలు: 448; వెల: 300; ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, విజయవాడ; ప్రతులకు: రచయిత ఫోన్: 9849177594

**తత్వశాస్త్ర దారిద్ర్యం**




మూలం: కార్ల్ మార్క్స్; తెలుగు: వై.వి.రమణారావు; పేజీలు: 352; వెల: 250; ప్రతులకు: అనువాదకుడు, 15-8-967, వరదయ్య నగర్, ఖమ్మం-507002. ఫోన్: 9441816881

**చింకిచాప (కథలు)**
రచన: పోట్లూరు సుబ్రహ్మణ్యం; పేజీలు: 198; వెల: 100; ప్రతులకు: రచయిత, రెవెన్యూ కాలనీ, చంద్రబాబు నగర్ రోడ్, నెల్లూరు-524004. ఫోన్: 9491128052

**ఎడారిపాట (కవిత్వం)**
రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి; పేజీలు: 176; వెల: 100; ప్రతులకు: జి.వినయ్‌కుమార్ రెడ్డి, 86-267, సోమప్ప కాలనీ, బి.క్యాంప్, కర్నూలు-518002. ఫోన్: 9110595847

**చైనాలోని పరిణామాలు భారత్-చైనా సంబంధాలపైన**
రచన: కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు; పేజీలు: 296; వెల: 150; ప్రతులకు: పోరునేల, హైదరాబాద్. ఫోన్: 7702888998

**సిద్దిపేట జిల్లా సాహిత్య చరిత్ర**



రచన: పప్పుల రాజిరెడ్డి; పేజీలు: 96; వెల: 40

**సంగారెడ్డి జిల్లా సాహిత్య చరిత్ర**
రచన: అవుసుల భానుప్రకాశ్; పేజీలు: 80; వెల: 40


**తెలుగు వీరుడు సదాశివరెడ్డి**
రచన: ఆచార్య బిరుదురాజు రామరాజు; పేజీలు: 76; వెల: 40

**కష్టజీవి**
రచన: ఆకెళ్ల సుబ్రహ్మణ్య కవి; పేజీలు: 52; వెల: 25 ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, సైఫాబాద్, హైదరాబాద్-500004. ఫోన్: 040-29703142




# నవ్వుల గజ్జెలు

● కథాసారం



''వేడిగా ఏ మే ముంది?''

''వడ, దోసె, ఇడ్లీ, పూరీ, బోండా, మైసూర్ పాక్'' ఏకబిగిని రాము పాఠం వల్లించాడు. వాడి చూపులు ఫ్యామిలీ రూమ్స్‌కేసి పదే పదే పరుగులెత్తుతున్నాయి.

''రెండు ప్లేట్లు ఇడ్లీ చట్నీ పట్రా!''

రాము వడిగా వంటింటివేపు నడిచాడు. నడుస్తుంటే ఏదో పొరపాటు చేసినట్టు తట్టింది. చప్పున ఆర్డర్ తీసుకున్న టేబుల్ దగ్గరకు వెళ్లి ''ఇడ్లీ లే''దని సమాధానం చెప్పాడు.

ఆర్డర్ యిచ్చిన కుర్రాడు ఆలోచనలో పడ్డాడు. ''అయితే రెండు కప్పుల టీ పట్రా!''

''రెండు టీ'' అని రాము గట్టిగా అరిచాడు. అరుపు వేగంతో వంటింట్లోకి వెళ్లాడు. కౌంటర్ పైన 'టీ' కనపడకపోవడంతో విసుక్కున్నాడు. కౌంటర్ మీద మోచేతులు ఆనించి, వదులుగా నిలబడ్డాడు. కొంతసేపటికి టీ కప్పులు కనపడ్డాయి. వెంటనే అందుకుని దుడుకుగా టేబుల్ దగ్గర కొచ్చాడు. కప్పుల అంచులు ఒరుసుకుని నడకలో టీ సాసర్లలో పడింది. టీ తగిలి, చేతి బొటనవ్రేలు చురుక్కుమంది. చెయ్యి వణికింది. చేతిలోంచి కప్పు జారి ఆర్డరిచ్చిన కుర్రాడి ఒళ్లో పడింది. అతను దిగ్గున లేచి రామును ఫెళ్లున చెంపమీద కొట్టాడు. ఆ దెబ్బకి రెండవకప్పు, ఎడమచేతి సాసర్‌లోంచి దొర్లి టేబుల్‌పైన ముక్కలైంది. రాము శరీరంపైన పడగలు విప్పి, పాములు, జెర్రులు పాకాయి. మనసులో కోపం లేదు. కాని ఒళ్లు తెలియని ఉద్రేకం పొంగి ఆర్డర్ యిచ్చిన కుర్రాడిని ఫెళ్లున కొట్టాడు. హోటలులోని మనుషులు ఈ సంఘటనకు ఏక కంఠంతో గొల్లుమన్నారు. కౌంటర్ మీది యజమాని తిట్ల వర్షంతో లేచాడు. దెబ్బలతో, తన్నులతో రాముని హోటల్ నుంచి తరిమాడు. రాము గుడ్డల్ని గిరాటు వేశాడు. రాముకి యజమానిపై తిరగబడదామన్న వాంఛే కలగలేదు. నరాలన్నీ సడలి ఒక విధమైన ఆనందం కమ్మింది. శరీరం తడిబట్టకు మల్లే బిగుసుకు పోయింది. కళ్లముందు నగ్నంగా రోడ్డు పరుచుకొని వుంది. బరువుగా అడుగులు వేస్తూ ముందుకు సాగాడు.

కొంతదూరం అనాలోచితంగా నడిచాడు. కాళ్లు ఎందుకో పీక్కుపోతున్నాయి. కొద్దిగా ఆకలనిపించింది. ఆకలిని దులిపేసుకుని, రోడ్డు పక్కనున్న మైదానంలో గుమిగూడిన ఒక గుంపులోకి వెళ్లాడు. వెళ్లడంలో తనకు రెండింతలు పొడుగున్న మనిషి కాలు తొక్కాడు. అతను కస్సున లేచాడు. రాము పిల్లికి మల్లే ముందుకి వెళ్లి మొదటి వరుసలో కూర్చున్నాడు. అక్కడ మగకోతి, ఆడకోతిని బతిమాలుతున్నది. ఆడకోతి తల్లిగారింటికి వెడతానని మగకోతిని భయపెట్టుతున్నది. మగకోతి తల నిమరడానికి చూస్తోంది. ఆడకోతి గుర్రుమంటున్నది. ఆ కోతుల్ని చూస్తే నవ్వు వచ్చింది కాని, వాటి ఆలుమగల బాగోతం ఎందుకో కలత పెట్టింది. ఆడకోతి తల నిమరాలనిపించింది. లేచి ఆడకోతి వేపు వెళ్లాడు. కోతులాడించేవాడు 'కుర్రాడా, కూర్చో' అని గద్దించాడు. తనని 'కుర్రా'డనటం వెగటుగా తోచింది. ఆ మాటతో ఉత్సాహం చచ్చింది. తన చోటుకి వచ్చి కూర్చున్నాడు. ఆడకోతి అంత బతిమిలాడించుకోవడం చూచి కోపం వచ్చింది. ఇంతలో మగ కోతి కర్ర తీసుకుని ఆడకోతి వెంట పడింది. ఆడకోతి కోతులాడించేవాడి చుట్టూ దొరకకుండా పరుగెత్తుతున్నది. మగకోతి వేగం హెచ్చింది. త్వరగా సమీపించి రెండు బాదింది. ఆడకోతి కీచుకీచులాడింది. మగకోతి చెప్పినట్టల్లా వినడం మొదలుపెట్టింది. రాముకు ఎందుకో ఆడకోతి మక్కెలు విరగదన్నాలనీ, ఆ తర్వాత తల నిమరాలనీ అనిపించింది. ఆట ముగిసింది. ఆడించేవాడు డబ్బులు అడుక్కుంటున్నాడు.


> **రాముకు ఎందుకో ఆడకోతి మక్కెలు విరగదన్నాలనీ, ఆ తర్వాత తల నిమురాలనీ అనిపించింది. ఆట ముగిసింది. ఆడించేవాడు డబ్బులు అడుక్కుంటున్నాడు.**

రాము లేచి, తిరిగి నడక సాగించాడు. రోడ్డు పైన ఒక జంట చిరునవ్వులతో సాగింది. రాము తన కళ్లని ఆ జంటకి వప్పగించాడు. పర్దాతో ఒక రిక్షా ఎదురుగా వచ్చి, దాటేసి వెళ్లింది. రాము కళ్లు ఆ పర్దాని చీల్చడానికి ప్రయత్నించాయి. ఒక అమ్మాయి గాలికి ఎగురుతున్న కొంగుతో, సైకిలు పైన దాటేసి వెళ్లింది. రాము చూపులు చక్రాల వేగంలో యిరుక్కొని పోయినాయి. ఆ సైకిలుని నిలుచున్న పాటున పడగొట్టాలనిపించింది.

సైకిలు మళ్లిన సందులోకి వెళ్లాడు. సైకిలు కనపడలేదు. ఏదో పోగొట్టుకున్నవాడికి మల్లే సందును దిగులుగా కలియ జూశాడు. సందులో చీకట్లు అలముకొంటున్నాయి. కళ్లముందు మసక తెరల్ని ముంచుతున్నాయి. చీకట్లోకి వెళ్లడానికి మనస్సు ఒప్పుకోలేదు. తిరిగి హోటలుకు వెడితే బాగుండుననిపించింది. నిలుచున్న పాటున తరిమివేసిన యజమాని ఆశ్రయమిస్తాడన్న నమ్మకం లేదు. ఎక్కడా తలదాచుకోవడానికి చోటు లేదన్న తలపుతో భయం వేసింది. ఆకలి వేస్తున్నది. తినడానికి ఏమైనా దొరికితే బాగుండు ననిపించింది. పోనీ చొక్కాలు అమ్ముకుంటే? చిరిగిన చొక్కాలు ఎవ్వరూ తీసుకోరనే అధైర్యం వెంటనే తగిలింది. బిచ్చమెత్తుకుంటే? హోటలు ముందు రోజూ బిచ్చమెత్తుకునే బిచ్చగాళ్ల దురవస్థ అతనికి వచ్చింది. వెళ్లగొట్టేముందు పని చేసిన జీతమైనా కట్టిస్తే బాగుండేది. రెండు సంవత్సరాలు చేసిన చాకిరీ అయినా యజమానికి గుర్తురాలేదు. ఎన్నడూ లేనిది ఈ మధ్యనే తిరగబడటం ఎక్కువైంది. కెలికి కయ్యం పెట్టుకోవాలని వుంటుంది. పట్నమంతా ఒకటే పనిగా తిరగాలని వుంటుంది.

ఏమీ తోచక వచ్చిన దారి పట్టాడు. తాను తిరిగిన రోడ్డుపై దీపాలు పెట్టివున్నాయి. పైన ఆకాశం మబ్బులతో పచ్చిగర్భిణిలా వుంది. వాన వస్తుందన్న భయమేసి, వడివడిగా నడిచాడు. వంద అడుగులు వేశాడో లేదో చినుకులు ప్రారంభమైనాయి. రాము వెంటనే ఒక కొట్టు చూరు కిందికి చేరుకున్నాడు. కొట్టులోని దీపాల వెలుతురులో రకరకాల చీరెలు జిగేలు మంటున్నాయి. రంగుచీరలన్నింటిని కప్పుకొని, వాటి మెత్తదనాన్ని ఆనందిస్తూ ఆ కొట్టులోనే పడుకోవాలనిపించింది. కాని కొట్టువాడి లావుపాటి శరీరం చూచి భయమేసింది. వర్షం ఎక్కువవుతున్నది. ఆకలి కలవర పెడుతున్నది. కాని వానతెరల్లోంచి వీధి దీపాలు ముచ్చటగా కనబడుతున్నాయి. ఏ హోటల్‌కైనా వెళ్లి తిరిగి సర్వర్‌గా చేరితే? చీరెల కొట్టువాడు కొట్టు కట్టేసే సన్నాహంలో ఉన్నాడు. దూరాన ఎక్కడో ఒక కుక్క ఏడుస్తున్నది. ఆకలి వేసి కాబోలు. కుక్కమోస్తరు ఆకలికి మనిషి ఎందుకు ఏడ్వడు? అయినా ఈ అర్ధరాత్రి ఉద్యోగం ఎవరిస్తారని? తిరిగి తన హోటల్‌కి వెళ్లి ఏ సర్వర్‌నైనా పట్టెడన్నం కోసం బతిమాలడం మంచిదనిపించింది. యజమాని రాత్రిపూట హోటల్‌లో ఉండడు. కొట్టువాడు కొట్టు మూశాడు. కొట్టు ముందుభాగం గుడ్డి చీకటిలో మునిగింది. కొట్టువాడు కారెక్కి యింటికి వెళ్లిపోయాడు. వర్షం యింకా కురుస్తూనే వుంది. చలి ఎక్కువవుతున్నది. రాము చంకలోని చొక్కాలు తీసి ఒకదానిపైన ఒకటి తొడుక్కున్నాడు. వర్షం వెలిసే సూచన కనబడలేదు. రెండు గంటలయింది. ఆకలికి పేగులు అరుస్తున్నాయి. హోటల్‌కి వెళ్లటం అసాధ్యమనిపించింది. ఉన్న రెండు బట్టలు తడుపుకోవడానికి మనస్సు ఒప్పుకోలేదు. కొట్టుముందే ఆకలి పడక వేయడానికి నిశ్చయించుకున్నాడు. కప్పుకున్న ధోవతి తీసి కింద పరిచాడు. ఇంతలోకే తడుస్తూ ఒక కుక్కకూన కొట్టు కప్పుకిందికి పరుగెత్తుకొచ్చింది. దాన్ని వెళ్లగొట్టే ఉద్దేశంతో కడుపులో ఒక తన్ను తన్నాడు. కుంయిమని ఒక మాటు వెలుపలకు వెళ్లి, వానకి తిరిగి లోపలికి వచ్చింది. దాని అవస్థ చూచి జాలి వేసింది. తనకు ఎదురుగా వున్న మూలకి నక్కి పడుకుంది. చేసేదేమీ లేక, ధోవతి మీద మేను వాల్చాడు. మిగిలిన యింకొక ధోవతి కప్పుకున్నాడు.

కళ్లు పొడుచుకున్నా నిద్ర రావడం లేదు. చలీ, ఆకలీ పోటీలు పడుతున్నాయి. వాటి తాకిడికి రోడ్డు దీపాల వంక చూస్తూ లొంగిపోతున్నాడు. జ్వరంతో శరీరం సలసల కాగుతున్నది. అయిదు, పది, యిరవై నిమిషాలు గడిచాయి. కుక్కకూన లేచి వచ్చి రాము పక్కలో పడుకుంది. రాము కుడి చెయ్యి అనాలోచితంగా కుక్కపైన పడి, దాని తల నిమరడం మొదలుపెట్టింది. కూన మరీ దగ్గరికి జరిగింది. రాము కళ్లు బరువుగా మూతలు పడ్డాయి. ఆడకోతి కిచకిచలు, రిక్షా చక్రాల గజ్జెలు, గాలిలో ఎగురుతున్న పమిటలు, అతని చెవుల్లో గలగలా మోగినై. కొట్లో కనిపించిన రంగురంగుల చీరెలు కప్పుకుంటూ నిద్రలో మునిగాడు. కొంతసేపటికి వాన వెలిసింది. కుక్కపిల్ల అతని చెయ్యి తప్పించుకుని తిరిగి వీధి కెక్కింది.


భాస్కరభట్ల కృష్ణారావు

భాస్కరభట్ల కృష్ణారావు (1918- 1966) కథ 'నవ్వుల గజ్జెలు'కు సంక్షిప్త రూపం ఇది. వయసుకు వస్తున్న ఒక కుర్రాడి మానసిక అవస్థ ఇందులో చిత్రితమైంది. సౌజన్యం: తెలంగాణ సాహిత్య అకాడమీ వెలువరించిన 'పరిసరాలు'. 1940-50 మధ్య వచ్చిన వివిధ రచయితల కథల్ని వట్టికోట ఆళ్వారుస్వామి రెండు సంపుటాలుగా వెలువరించారు. 1956లో దేశోద్ధారక గ్రంథమాల ప్రచురించిన వీటిని ఒకే సంపుటంగా తె.సా.అ. గతేడాది తెచ్చింది. కథకుడు, నవలా రచయిత భాస్కరభట్ల ఆలిండియా రేడియోలో పనిచేశారు. కృష్ణారావు కథలు, చంద్రలోకానికి ప్రయాణం, వెన్నెల రాత్రి పేరుతో కథాసంపుటాలు వచ్చాయి. 'వెల్లువలో పూచిక పుల్లలు' ఆయనకు పేరుతెచ్చిన నవల.

● ప్రయాణం

# నా నాటకాల మూలసూత్రాలు

'కావ్యేషు నాటకం రమ్యమ్' అనే వాక్యం నాకు బాల్యంలోనే జీర్ణమైపోయింది. నేను హైస్కూలు దాటకుండానే రంగు పూసుకున్నాను. బాలరాముడి పాత్రతో 1960లో నాటకరంగానికి శ్రీకారం చుట్టేను.

దాదాపు 200 కథలు రాశాను. 20 నవలలు రాశాను. టీవీ సీరియల్స్‌కి దాదాపుగా 800 ఎపిసోడ్స్ రాశాను. దాదాపు 80 సినిమాలకు కథ, మాటలు రాశాను. దినపత్రికలో కాలమ్స్ రాశాను. ఎన్ని రాసినా, నాటక రచన పట్ల నా ఆసక్తి పెరుగుతూనే వచ్చింది- సాంఘిక నాటికలు, పిల్లల నాటికలు, పద్య నాటకాలు, రేడియో నాటకాలు ఇలా అన్ని విభాగాల్లో రచన చేశాను.


1997లో నేను రాసిన మొట్టమొదటి నాటకం 'కాకి ఎంగిలి' హైదరాబాదు రసరంజని హాలులో రోజువారీ ప్రదర్శనలు ఇచ్చారు. ఇది రాయటానికి ముందు నాటకం ఎలా రాయాలి? అనే విషయం చాలాకాలం ఆలోచించేను. నాటకంలో వస్తువైవిధ్యం, సన్నివేశాల కూర్పు, పాత్ర చిత్రణ, పాత్ర స్థాయి, స్వభావాన్ని అనుసరించి సంభాషణలు ఉంటే ఆ నాటకం ప్రేక్షకులని ఆకర్షిస్తుందని గ్రహించేను. పద్యనాటకాలు రాసినా ఇవే మూలసూత్రాలు పాటించేను. 'అల్లసాని పెద్దన', 'రాణి రుద్రమ', 'రాణాప్రతాప్' లాంటి చారిత్రక నాటకాలు రాసినా ఇదే మార్గాన్ని అనుసరించేను.

'క్రాస్ రోడ్స్' లాంటి స్త్రీవాద ఇతివృత్తంతో ఇంకో నాటకం రాయండి అని అడిగే మహిళామణులున్నారు. 'ఓం' లాంటి ధర్మప్రభోదాన్ని చేసే నాటకం రాయండి అని అడిగే ఆర్ష విద్యా సంపన్నులున్నారు. 'మీ ఇల్లెక్కడ?' లాంటి తాత్విక చింతనతో నాటకాలు రాయాలి అని ఆశించే తత్త్వవేత్తలున్నారు. 'కలనేత' లాంటి నాటకాలు చూసి తెలంగాణ మాండలికంలో రచనలు చేయమని కోరేవాళ్లున్నారు.

1988లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది నాటక పోటీలు మొదలుపెట్టింది. ఆనాటి నుంచీ ఈనాటి వరకూ దాదాపు ప్రతీ సంవత్సరం నేను రచించిన ఏదో ఒక నాటిక పోటీలో పాల్గొంటూ వచ్చాయి. 13 సార్లు ఉత్తమ రచనకు నంది బహుమతులు అందుకున్నాను.

నా నాటకాలకు బహుమతులు రావటానికి, నాకు ఇంత పేరు రావటానికి, ఆయా నాటకాల్లో ఆ పాత్రలు ధరించిన నటీనటులు, టెక్నీషియన్స్- ముఖ్యంగా దుగ్గిరాల సోమేశ్వరరావు, బి.ఎం.రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, గంగోత్రి సాయి లాంటి దర్శకులే కారణం.

◆ ఆకెళ్ల





ఆకెళ్లగా ప్రసిద్ధులైన ఆకెళ్ల వెంకట సూర్య నారాయణ నాటకాలు రెండు సంపుటాలుగా వచ్చాయి. ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి. రచయిత ఫోన్: 9440054477

## రారండోయ్

● రావి రంగారావు సాహిత్య పీఠం జన రంజక కవి పురస్కారాలను ఫిబ్రవరి 10న సా. 6 గం.కు గుంటూరులోని అన్నమయ్య కళావేదికలో ప్రదానం చేస్తారు. గ్రహీతలు: మెట్టా నాగేశ్వరరావు (మనిషొక పద్యం), కరీముల్లా (ఎదురు మతం), మందరపు హైమవతి (నీలి గోరింట), కన్నెగంటి వెంకటయ్య (మమతల హృదయాలు), ఎరుకలపూడి గోపీనాథరావు (భావనా తరంగాలు).

● సిరికోన - మహేంద్రభారతి సాహిత్యోత్సవం ఫిబ్రవరి 13న సాయంత్రం 5:30కు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరగనుంది. ఇందులో బులుసు వేంకటేశ్వర్లు 'నీలమోహనం' ఆవిష్కరణ, సిరికోన భారతి వ్యాస సంపుటి (సం. గంగిశెట్టి లక్ష్మీనారాయణ, జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి) ఆవిష్కరణ కానున్నాయి. గంగిశెట్టి స్మారక ఉత్తమ అనువాదక పురస్కారాన్ని డాక్టర్ కోడూరి ప్రభాకర రెడ్డికీ; రుక్మిణమ్మ గంగిశెట్టి స్మారక ఉత్తమ ప్రథమ కవితా సంపుటి పురస్కారాన్ని దేవనపల్లి వీణావాణికీ; చెన్నరాయ కిశోర్ స్మారక తెలుగు తేజో స్ఫూర్తి పురస్కారాన్ని దేశముఖ్ ప్రవీణ్ శర్మకూ ప్రదానం చేయనున్నారు.

● తెలంగాణ సాహిత్య అకాడమీ నెలనెలా నవలా స్రవంతిలో భాగంగా ఫిబ్రవరి 14న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో పి.వి.నరసింహారావు 'లోపలి మనిషి'పై పరాంకుశం వేణుగోపాల స్వామి ప్రసంగిస్తారు. అధ్యక్షత: నందిని సిధారెడ్డి.


● భూతపురి సాహిత్య పురస్కారాన్ని గండ్లూరి దత్తాత్రేయ శర్మకు ఫిబ్రవరి 16న ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో ప్రదానం చేయనున్నారు. నిర్వహణ: భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం.

● అనిల్ డ్యానీ కవితా సంపుటి స్పెల్లింగ్ మిస్టేక్ పరిచయ సభ ఫిబ్రవరి 16న సా. 6 గంటలకు సీసీవీఏ, మొఘల్రాజపురం, విజయవాడలో జరగనుంది.

● అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా గుడిపల్లి నిరంజన్ రాసిన 'నిట్టాడి' దీర్ఘ కవిత ఆవిష్కరణ ఫిబ్రవరి 16న ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్, సి.యన్.రెడ్డి సేవాసదన్‌లో జరగనుంది. ఆవిష్కర్త గోరటి వెంకన్న. నిర్వహణ: పూలే అంబేడ్కర్ అధ్యయన వేదిక, నాగర్‌కర్నూల్.

● రీవిజిట్

'కళ్లకు కాసిన్ని చూపు ఉత్సవాలు ఇవ్వకుండా' 'ఇంతగా పరుగెత్తాలా' అని ప్రశ్నిస్తాడు దర్భశయనం. 'అన్నం తెలిసిన ప్రతివాడికీ/ అతను తెలుసు, ఆకలి తెలిసినట్లే' అని 'ధాన్య మానవుని' కవిత చేస్తాడు. ఆయన మొదటి కవితా సంపుటి 'జీవన వీచిక' 1987లో వచ్చింది. పదవ పుస్తకం తాజాగా వచ్చిన 'ధాన్యం గింజలు'. అందులోని ఒక కవిత:



**ధాన్యం గింజలు**
పేజీలు: 88; వెల: 80
ప్రతులకు: కవి, ఆంధ్రా బ్యాంక్ అపెక్స్ కాలేజ్, ప్లాట్ నం. 27-29, నానక్‌రామ్ గూడ, హైదరాబాద్-32.
ఫోన్: 9440419039

## పరస్పరం

ఈ అర్ధరాత్రి
ఈ పుస్తకమూ నేనూ
ఇద్దరమే మెలకువతో

అది నాకందిస్తున్నదేమిటో
దానికి నేనిస్తున్నదేమిటో
ఇపుడే ఎట్లా చెప్పేది

దాన్ని ఇష్టంగా
ఛాతీ మీద బోర్లేసుకున్నా-
నేల మీద ఆకాశాన్ని కప్పినట్టు!

ఈ రాత్రి ఏదో వేళ
నేను నిద్రలోకి జారినపుడే
బహుశా అది కూడా!

తెల్లారాకే
తెలుస్తుంది
దాని మీద కొత్తగా హరిత ముద్రలెన్నో!
నా లోపల దాని నీలి ఛాయలెన్నో!

◆ దర్భశయనం శ్రీనివాసాచార్య

## గ్రహం అనుగ్రహం

శ్రీవికారి నామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. మాఘ మాసం. తిథి బ.పాడ్యమి ఉ.11.44 వరకు, తదుపరి విదియ. నక్షత్రం మఖ రా.7.34 వరకు, తదుపరి పుబ్బ. వర్జ్యం ఉ.8.13 నుంచి 9.44 వరకు, తిరిగి రా.3.04 నుంచి 4.33 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.23 వరకు. తదుపరి ప.2.54 నుంచి 3.37 వరకు. అమృత ఘడియలు సా.5.14 నుంచి 6.44 వరకు; **సూర్యోదయం:** 6.34 **సూర్యాస్తమయం:** 5.55; **రాహుకాలం:** ఉ.7.30 నుంచి 9.00 వరకు. **యమగండం:** ఉ.10.30 నుంచి 12.00 వరకు

**నమాజ్ వేళలు**
ఫజర్: 5.32 జొహర్: 12.30
అసర్: 4.39 మగ్రీబ్: 6.15 ఇషా: 7.29

● మీకు తెలుసా?



రష్యన్-తెలుగు నిఘంటువు 1988లో వచ్చింది. దీని కూర్పరి స్వెత్లానా ద్జెనిట్. ఎడిటర్‌గా నిడమర్తి ఉమారాజేశ్వరరావు పనిచేశారు. సోవియట్ యూనియన్‌లో కూడా తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఆసక్తి ఉందనీ, 'ప్రముఖ రచయితలైన గురజాడ, కుటుంబరావు, శ్రీశ్రీ, చలం, గోపీచంద్, తిలక్, బుచ్చిబాబు మొదలైనవారి రచనలు రష్యన్ భాషలోకి అనువదించబడ్డా'యనీ స్వెత్లానా తన ముందుమాటలో రాశారు.

● సాహిత్య మరమరాలు

# అదిరేటి డ్రెస్సు నేనేస్తే!



విశ్వనాథ ఒక సాహితీ సభ కోసం కాకినాడకు వెళ్లారు. పి.ఆర్. కాలేజీ అనబడే పిఠాపురం రాజా కళాశాలలో సభ. సభాధ్యక్షుడు, తెలుగు శాఖాధ్యక్షుడే. అది నిండు వేసవి. అయినా డాబుగా ఉంటుందనో యేమో ఆయన సూటూబూటుతో దర్జాగా వచ్చారు. విశ్వనాథ, రామాయణ కల్పవృక్షంలోని మాయావి వృత్తాంతాన్ని చదువుతున్నారు. ఈ మాయావి, హిమవంతుని మీదకు యుద్ధానికి వెళ్లాడు. హిమవంతుడు 'నేను జడాన్ని. నాతో పోట్లాడితే ఏమొస్తుంది. అక్కడ మహావీరుడైన వాలి ఉన్నాడు, వాని మీదకు వెళ్లు, నీ యుద్ధ పిపాస తీరుతుంది' అన్నాడు. వెంటనే మాయావి దున్నపోతు రూపాన్ని ధరించి వాలి మీదకు దూకాడు. ఇది చెబుతూ- 'మాయావి ఎందుకు దున్నపోతు రూపాన్నే ధరించాడంటే ఏం చెబుతాం?' కొన్నింటికి కారణాలుండవు. కొందరు నడివేసవిలో కూడా ఉలెన్ కోటు వేసుకుని దర్జాగా కూర్చుంటారు. ఎందుకలా కూర్చున్నారంటే ఏం చెబుతాం? ఒక్కొక్కరి తీరు అంతే!' అని చమత్కరించారు. ఆ తెలుగు శాఖాధిపతి ముఖం చిన్నబోయింది.


◆ డి.వి.ఎం.సత్యనారాయణ

● పరిచయం

# శూన్యంలో... సందేశం

గనులు మరియు భూగర్భ శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు డాక్టర్ వి.డి.రాజగోపాల్. మనిషి విశ్రాంతిగా ఉన్నప్పటికీ ఆయనలోని మనసు తనను తాను తవ్వుకుంటూనే ఉన్నది. అది కవిత్వ రూపంలో వెలికి రావడానికి తహతహలాడింది. అయితే, కవిత్వం అనేది సమాజానికి సందేశాన్ని ఇచ్చేదిగా ఉండాలనేది ఆయన స్థిర సంకల్పం. అందుకే ఆయన వెలువరించిన 'శూన్యంలో కాసేపు' సంపుటికి స్పష్టంగా సందేశాత్మక కవితలు అని పేర్కొన్నారు. దానికి కొలకలూరి ఇనాక్ లాంటి గురువుల దీవెనలు ఉండనే ఉన్నాయి. అట్లా ఈ సంపుటి సగటున పేజీకో బొమ్మతో అందంగా ముస్తాబై మన ముందుకు వచ్చింది.

వైఎస్ఆర్, ఏఎన్నార్, బాపూజీ, బాలాజీ, క్రికెట్, క్రిస్మస్, దీపావళి, రామనవమి, భారత మాత, రాజ్యాంగం, గురువు, స్నేహం ఇలా ఎన్నింటిమీదో ఆయన కవి హృదయం పలికింది. 'సృష్టికి కారణభూతుడు బ్రహ్మ అన్నది విన్న నిజం/ మానవ జన్మకు మహిళే కారణం అన్నది ఉన్న నిజం' అంటూ యావత్ మహిళాలోకపు కష్టానికి తల్లడిల్లిపోతాడు. 'బ్రతకడం ఎలా ఇన్ని కష్టాల కడలిలో' అంటూ ఇష్టదైవం షిరిడీ నాథుని వేడుకుంటాడు. సందేశాత్మకంగానూ, వాస్తవికంగానూ కవిత్వం రాసిన రాజగోపాల్ అభినందనీయులు.



**శూన్యంలో కాసేపు**
(సందేశాత్మక కవితలు)
రచన: డాక్టర్ వి.డి.రాజగోపాల్; పేజీలు: 118; కవి చిరునామా: 1-1-538/1, సాయి మయూరి రెసిడెన్సీ, హైదరాబాద్-80. ఫోన్: 9505690699

◆ వై.అరుణ్


మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబరుకు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ

సోమవారం ॥ 10-2-2020






దక్షిణ కొరియా చర్చిలో సామూహిక వివాహాలు

# కరోనావారి పెళ్లి పిలుపు

**కల్యాణం వచ్చినా, అదేదో 'సమ్‌థింగ్..' అదొచ్చినా ఆగదని అంటారు. కరోనా వైరస్ ఎంతగా వ్యాపిస్తున్నా ఎక్కడా పెళ్లిళ్లు మాత్రం ఆగడం లేదు. 'వస్తే రానివ్వండి.. మా దగ్గర మాస్క్ లేకపోతే కదా..' అని వధూవరులు రెడీ అయిపోతున్నారు. 'పెళ్లంటే కరోనా భయపడాలి కానీ, కరోనా అంటే పెళ్లికేం భయం' అని అనుభవజ్ఞులైన దంపతులు.. పెళ్లీడు పిల్లల్ని సపోర్ట్ చేస్తున్నారు. కరోనా న్యూస్‌లోకి వచ్చాక.. కరోనాతో పాటు న్యూస్‌లోకి వచ్చిన కొన్ని పెళ్లిళ్లివి. ఇవి.. చూసే పెళ్లిళ్లు కావు, చదివే పెళిళ్లు. కాబట్టి మీరు మూతికి మాస్క్ వేసుకోకుండానే ముసిముసిగా చదువుకోవచ్చు.**

## మాస్కులు తియ్యకండర్రా

పెళ్లికి అందరూ వచ్చేశారు. పెళ్లికొడుకు తరఫువారెవరో, పెళ్లికూతురు తరఫువారెవరో తెలియడం లేదు! అందరి ముఖాలకూ కరోనా మాస్కులు ఉన్నాయి. పెళ్లికొడుకులెవరో, పెళ్లికూతుళ్లెవరో కూడా తెలియడం లేదు. సామూహిక పెళ్లిళ్లవి. అతిథులు, ఆహ్వానితులు ఓ 30 వేల మంది వరకు ఉన్నారు. వధూవరులు.. మార్చుకోవలసిన పెళ్లి ఉంగరాలు మర్చిపోయినా పర్వాలేదు. మాస్కులు మాత్రం తీసేయొద్దు అని పెళ్లి జరిపించే పెద్దలు మాటాకోసారి హెచ్చరిస్తున్నారు. మాస్క్ లేకుండా చర్చిలో కనిపించిన 21 ఏళ్ల ఓ యూనివర్సిటీ విద్యార్థిని పట్టుకున్నారు. ''నేను కట్టుకోను'' అన్నాడు. ''ఆఖరి నిముషంలో నువ్వు వధువును కట్టుకోనన్నా నష్టం లేదు. ఆఖరి నిముషాలు రాకుండా ఉండటం కోసం నీ మూతికి మాస్క్ కట్టుకోవడం తప్పనిసరి'' అని హితవు చెప్పారు. ''నేను పెళ్లి కొడుకును కాదు. పెళ్లికొచ్చినవాడిని'' అన్నాడు కుర్రాడు. అయినా మూతికి మాస్క్ వేసుకోవలసిందే'' అన్నా, కుర్రాడు విన్లేదు. ''ఆ దేవుడే కాపాడతాడు'' అన్నాడు. దక్షిణ కొరియా అది. పక్కనే చైనా ఉంది. చైనాలో కరోనా ఉంది. దేవుడు ఆ దగ్గర్లో లేడు. అయినా దేవుడు కాపాడతాడు అంటున్నాడంటే.. అతడి నమ్మకం కరోనా కంటే బలమైనది అనుకోవాలి. దక్షిణ కొరియా గపియోంగ్‌లో శుక్రవారం ఈ మూకుమ్మడి మాస్కల.. అయ్యో సారీ.. ఈ మూకుమ్మడి పెళ్లిళ్ల తంతు జరిగింది.

**కుర్రాడు విన్లేదు. "ఆ దేవుడే కాపాడతాడు" అన్నాడు.**

పెళ్లంటే కరోనా భయపడాలి కానీ, కరోనా అంటే పెళ్లెందుకు భయపడుతుంది.. అని ఓ గుంపులో ఓ వృద్ధుడు తత్వాలు పాడుకుంటూ కనిపించడం కూడా అక్కడివారికి వినిపించింది. ఇప్పటికే పాతిక వరకూ కరోనా కేసులు పిలవని పెళ్లికి వచ్చిన వారిలా దక్షిణ కొరియాలో చొరబడ్డాయి.


ఇతడే.. కరోనా డ్యూటీకి వెళ్లిన వరుడు; పక్కన వధువు

## ఫోనొస్తే పక్కకెళ్లాడు

అబ్బాయిది చైనా. అమ్మాయిదీ చైనా. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఒకే దేశం కాబట్టి పెద్దలూ పోనీలే అనుకున్నారు. అబ్బాయి మెడలో స్టెతస్కోప్ ఉంటుంది కానీ.. చూడ్డానికి కత్తిలా ఉంటాడు. అమ్మాయి సంగతి చెప్పక్కర్లేదు. చక్కదనాల చురకత్తి. పెళ్లి చేసుకుందాం అనుకున్నారు. ''మేమూ మీకు పెళ్లి చేయాలనుకున్నాం'' అన్నారు పెద్దలు. పెళ్లికి ముహూర్తం పెట్టేశారు. ముహూర్తం టైమ్‌కి వధూవరుల కన్నా ముందు, వధూవరుల అమ్మానాన్నల కన్నా ముందు కరోనా వైరస్ వచ్చి పెళ్లి మండపంలో కూర్చుంది. కూర్చొని, ''భజంత్రీలు వాయించండి.. పురోహితులూ మీరు మంత్రాలు చదవండి..'' అంది. అక్కడ పురోహితుడు లేడు. హితులూ లేరు. పెళ్లి కొడుకు కూడా కనిపించలేదు! ''ఫోనొస్తే పక్కకెళ్లారు నాన్నా ఆయన'' అంది పెళ్లికూతురు. పక్కకెళ్లిన పెళ్లికొడుకు పెళ్లికూతురు పక్కకొచ్చి ఇక కానివ్వండి అన్నాడు. పదే పది నిముషాల్లో అయిపోవాలి అని కూడా చెప్పాడు. అలాగే కానిచ్చేశారు. పెళ్లయిపోయింది. పెళ్లి కొడుకు పెళ్లి కూతుర్ని వదిలిపెట్టి డ్యూటీకి వెళ్లిపోయాడు. హాస్పిటల్‌కి కరోనా కేసులేవో వచ్చాయని అర్జెంట్ కాలొస్తే.. పెళ్లికి అతడు పెట్టిన తొందర అది! కుర్రాడంటే ఇలా ఉండాలి అన్నారు పెళ్లికొచ్చినవాళ్లు. మా ఆయన గ్రేట్ అన్నట్లు పెళ్లి కూతురు సిగ్గుల మొగ్గయింది.. మాస్క్ తియ్యకుండానే. కరోనా భయం ఉన్నా కూడా ఆ పెళ్లికి నలుగురైనా వచ్చారంటే.. పెళ్లి కొడుక్కన్నా గ్రేట్ అనాలి వాళ్లను. ఆ నలుగురూ.. అమ్మాయి అమ్మానాన్న. అబ్బాయి అమ్మానాన్న.

**పదే నిముషాల్లో పెళ్లయిపోయింది. డాక్టరుబాబు పెళ్లి కూతుర్ని వదిలిపెట్టి కరోనా డ్యూటీకి వెళ్లిపోయాడు.**

## వెనకే వస్తాం మీరెళ్లండి

అమ్మాయిది చైనా. అబ్బాయిది ఇండియా. ఇండో–చైనా సంబంధాలు బాగోలేవని, పెళ్లి సంబంధాలు కుదరకుండా ఉంటాయా! దేని దారి దానిదే. బుధవారం పశ్చిమ బెంగాల్‌లో మనబ్బాయికీ, మనబ్బాయిని ఇష్టపడి మన కోడలిగా రాబోతున్న చైనా అమ్మాయికి పెళ్లి జరిగింది. పెళ్లికి అమ్మాయి అమ్మానాన్న రాలేకపోయారు. అదేంటి.. అందరూ కలిసే కదా ముందొచ్చేస్తారు! అలా ఎలా జరిగింది? ''ముందు అమ్మాయిని తీసుకెళ్లు బాబూ.. వెనకే మేం వచ్చేస్తాం' అన్నారు అమ్మాయి పేరెంట్స్. సరేనని తీసుకొచ్చాడు. వీళ్లిలా ఇండియా రాగానే, కరోనా అలా చైనాను విజిట్ చేసింది. ఇండియా వచ్చే ఫ్లయిట్స్ అన్నీ రద్దయ్యాయి. ఫ్లయిట్‌లు రద్దయ్యాయని పెళ్లి రద్దవుతుందా! తన మానాన తను జరిగిపోయింది. పెళ్లి ఫొటోలు చైనా వెళ్లిపోయాయి. ''మీరేమీ బాధపడకండి మమ్మీ.. మేమే చైనా వస్తాం.. అక్కడే గ్రాండ్‌గా ఫంక్షన్ కూడా చేసుకుందాం'' అని పెళ్లి కూతురు కాల్ చేసి చెప్పేసింది. ''వద్దొద్దు.. మేం చెప్పే వరకు రాకండి'' అని కన్న హృదయాలు పెళ్లి ఫొటోలు ఉన్న సెల్‌ఫోన్‌లను గుండెలకు హత్తుకున్నాయి. ఆ హత్తుకున్న ఫొటోలు ఇటువైపు బట్వాడా అవగానే మళ్లీ ఇక్కడ పెళ్లి సందడి.


బెంగాల్ వరుడు, చైనా వధువు

**ఇండియా వచ్చే ఫ్లయిట్స్ అన్నీ రద్దయ్యాయి. ఫ్లయిట్‌లు రద్దయ్యాయని పెళ్లి రద్దవుతుందా!**

## సారీ.. మీరెవరో తెలీదు

ఈ మధ్యే.. కొత్త సంవత్సర వేడుకల కోసం సింగపూర్ నుంచి చైనా ట్రిప్‌కి వెళ్లొచ్చారు అతడు, ఆమె. జోసెఫ్ య్యూ, కాంగ్ టింగ్.. వాళ్ల పేర్లు. వీటిల్లో అమ్మాయి పేరేదో, అబ్బాయి పేరేదో గుర్తుపెట్టుకోవడం కష్టం కనుక అమ్మాయి, అబ్బాయి అని చెప్పుకోవడమే సుఖంగా ఉంటుంది. మన సుఖం మాట అలా వదిలేస్తే.. వాళ్లిద్దరికీ ఒక కష్టం వచ్చింది. ఇటీవలే.. చైనా నుంచి తిరిగొచ్చాక.. వాళ్ల పెళ్లయింది. పెళ్లి కాదు వాళ్ల కొచ్చిన కష్టం. పెళ్లి రిస్సెషన్‌కి ఎవరూ రాకపోవడం! 'వియ్ సాలిసిట్ యువర్ ప్రజెన్స్..' అనగానే 'సారీ.. మీరెవరో మాకు తెలీదు' అని టక్కున ఫోన్ పెట్టేస్తున్నారు! కరోనా వైరస్ బంధుమిత్ర సమేతంగా తమ సంతోషాన్ని దెబ్బకొట్టేసిందని ఈ కపుల్‌కి అర్థమైంది. వెంటనే మళ్లీ అందరికి ఫోన్‌లు చేశారు. ''మా పెళ్లి రిసెప్షన్‌కి మేము రాము. దూరంగా ఎక్కడో ఉండి స్క్రీన్‌లో మీకు కనిపిస్తుంటాం. మీరు మా పెళ్లి విందు భోజనాలు ఆరగిస్తూ మమ్మల్ని ఆశీర్వదిస్తే చాలు'' అని రిక్వెస్ట్ చేశారు. ''దానికేముంది బాబూ.. దానికేముందమ్మా.. పెళ్లన్నాక రిసెప్షన్ జరక్కుండా ఉంటుందా.. మేము రాకుండా పోతామా..'' అని అంతా అడ్వాన్స్‌గా ఆశీస్సులు అందించి, వెంటనే రిసెప్షన్‌కి దిగిపోయారు.


సీన్‌లో ఆరగింపు ఆహ్వానితులు.. స్క్రీన్‌లో వధూవరులు

**"మా పెళ్లి రిసెప్షన్‌కి మేము రాము. సరేనా. మీరొచ్చి పెళ్లి విందు భోజనాలు ఆరగించి మమ్మల్ని ఆశీర్వదిస్తే చాలు".**

## గుండె ధైర్యం గల పిల్లాడే!

చైనా అబ్బాయిలకు ఇండియా అమ్మాయిలు దొరకట్లేదేమో.. ఎక్కడ చూసినా ఇండియా అబ్బాయి–చైనా అమ్మాయిల కాంబినేషన్ పెళ్లిళ్లే కనిపిస్తున్నాయి. కరోనా వైరస్ వచ్చాక.. ఇండియాలో మొదట జరిగిన ఇండో–చైనా పెళ్లి బహుశా ఈ ఇద్దరిదే కావచ్చు. ఫిబ్రవరి 2న మధ్యప్రదేశ్‌లోని మండ్సార్‌లో జరిగిన ఈ పెళ్లిలో.. అందరూ అబ్బాయి గుండె ధైర్యాన్ని మెచ్చుకున్నారు. కొందరైతే 'హవ్వ' అని బుగ్గలు నొక్కుకుంటూ.. పెళ్లి కూతుర్ని తెచ్చుకున్నాడా, కరోనాను తెచ్చుకున్నాడా అని గుసగుసలాడుకున్నారు. మొత్తానికి పెళ్లి కన్నుల పండుగగా జరిగిపోయింది. అయితే ఆ పెళ్లిలో వధువు తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల మీద స్థానిక వైద్యాధికారుల కన్ను పడింది. వాళ్లలా చూడగానే, ''అబ్బే మాకు అలాంటిదేమీ లేదు'' అన్నారు వీళ్లు. డాక్టర్లు ఊరుకుంటేనా! పెళ్లన్నాక ఫార్మాలిటీలు లేకుండా ఉంటాయా, కరోనా అన్నాక వైద్య పరీక్షలు లేకుండా పోతాయా.. మీకు కరోనా ఉండదని మాకు మాత్రం తెలీదా..'' అని వాళ్లను ల్యాబులకు లాక్కెళ్లారు. ''ఏంటండీ ఇది!'' అని అమ్మాయి కోపంగా చూసింది. ''మనకెందుకు పోనిద్దూ'' అన్నట్లు అబ్బాయి నవ్వుతూ చూశాడు. 'మన'అనే ఆ మాట ఒక్కటి చాలదా.. భార్యాభర్తలు తమ దాంపత్య జీవితంలోని కరోనాల్లాంటి కష్టకాలాలను ఎన్నిటినైనా దాటేయడానికి!


చైనా వధువు, మధ్యప్రదేశ్ వరుడు

**హవ్వ! పెళ్లి కూతుర్ని తెచ్చుకున్నాడా, కరోనాను తెచ్చుకున్నాడా!!**

రెండు విషయాలు

## అమ్మ చనిపోయాక

ప్రిన్స్ హ్యారీ ఒక బిడ్డకు తండ్రి అయ్యాక కూడా.. తన తల్లి డయానాతో పెనవేసుకుని ఉన్న తన చిన్ననాటి జ్ఞాపకాలను విడిచిపెట్టలేకపోతున్నారు. యు.ఎస్.లో గురువారం జరిగిన 'ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు'లో ప్రసంగిస్తున్నప్పుడు అకస్మాత్తుగా ఆయనకు తన తల్లి జ్ఞప్తికొచ్చారు. ''నా జీవితంలోని పెద్ద విషాదం మా అమ్మ చనిపోవడం. ఆమె నన్నెంతగా ప్రేమించేవారో ఒక్కో సందర్భాన్నీ గుర్తుకు తెచ్చుకుంటుంటే మనసుకు తీరని ఆవేదన కలుగుతుంటుంది. నాటి దురదృష్టకర ఘటనన నుంచి బయటపడేందుకు గత ఏడేళ్లుగా నేను థెరపీలో ఉన్నాను'' అని ప్రిన్స్ హ్యారీ గుండె లోతుల్లోంచి మాట్లాడారు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత.. ''రాజకుటుంబంలోంచి బయటికి వచ్చినందుకు మాకేమీ పశ్చాత్తాపాలు లేవు'' అన్నారు. దీనర్థం.. అమ్మ తప్ప నాకక్కడ అయినవారెవరూ లేరని చెప్పడమే! ఎన్ని చెప్పీ.. తల్లి స్మృతుల్లోంచి హ్యారీని బయటికి తెప్పించలేనని ఆయన భార్య మేఘన్ మార్కల్ అర్థం చేసుకున్నట్లున్నారు.. అందుకే ఆమె కూడా తరచూ భర్తకు తోడుగా డయానా స్మృతుల్లోకి వెళుతుంటారు. డయానా 1997లో పారిస్‌లో జరిగిన కారు ప్రమాదంలో మరణించారు. డయానా వ్యక్తిగత జీవిత సంచలనాలను ఫొటోలుగా తీసేందుకు ఆమె కారును వెంటాడుతున్న రహస్య మీడియా వాహనాలే ఆ ఘోర ప్రమాదానికి కారణం.


తల్లీకొడుకులు : చిన్నారి ప్రిన్స్ హ్యారీ, లేడీ డయానా


ప్రిన్స్ హ్యారీ, మేఘన్ మార్కెల్

## సినిమా విడుదలయ్యాక

శుక్రవారం బాలీవుడ్ చిత్రం 'షికారా' విడుదలైంది. రివ్యూలలో ఐదు స్టార్‌లకు రెండున్నర స్టార్‌లు వచ్చాయి. సినిమా పేలిపొద్ది అనుకున్నారు. తేలిపోయింది. ''రిలీజ్‌కు ముందు ఎవరో కోర్టులో కేసు వెయ్యబోయీ ఆగిపోయారని తెలిసింది'' అని విధు వినోద్ చోప్రా ట్వీట్ కూడా పెట్టారు. 'షికారా' సినిమా దర్శకుడు ఆయన. ఇస్లాం తీవ్రవాదుల అమానుష కాండ నుంచి తప్పించుకునేందుకు 1990లలో ప్రాణాలు కోల్పోయిన వాళ్లు కోల్పోగా, కశ్మీర్ లోయను వదిలిపోయిన లక్షల మంది కశ్మీరీ పండిత్‌ల కథ ఇది. సినిమా కాబట్టి కొంచెం ప్రేమను చొప్పించారు. అదే దెబ్బ కొట్టేసినట్లుంది! ఎక్కడైనా ప్రేమ కానీ, ఒక జాతి జాతి ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని జన్మభూమిని వదిలి పరుగులు తియ్యడం ఎంత దయనీయమైన కథాంశం! ఆ దైన్యాన్ని చూపించలేక చేతులు ఎత్తేసినట్లున్నారు చోప్రా. ''నువ్వు తీవ్రవాదాన్ని చూపించలేదు. నువ్వు మారణహోమాన్ని చూపించలేదు. మా కుటుంబాలు మొత్తం ఇస్లాం తీవ్రవాదానికి తుడిచిపెట్టుకుని పోయాయి. ఒక కశ్మీరీ పండిత్‌గా నేను నీ సినిమాను గుర్తించడం లేదు'' అంటూ ఓ ప్రేక్షకురాలు థియేటర్‌లో లేచి నిలబడి పెద్దగా అరుస్తున్న వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. థీమ్ ఏదైనా ఓ చుక్క ప్రేమ కలిపి సేల్ చేసుకోవాలని చూస్తే ఇలాగే అరకొర రివ్యూ స్టార్‌లు, ప్రేక్షకుల ఆగ్రహాలు మిగులుతాయని చోప్రా లాంటివాళ్లు ఎప్పటికైనా గ్రహిస్తారా?!


థియేటర్‌లో మండిపడుతున్న ప్రేక్షకురాలు


'షికారా' చిత్రంలోని ఒక సన్నివేశం

చెట్టు నీడ

## మాటల సంచి

ఒక రైతు తన పక్క పొలంలోని ఇంకో రైతు మీద అపవాదు వేశాడు. కానీ వెంటనే తన తప్పు తెలుసుకుని క్షమాపణ వేడుకోవడానికి మతాధికారి దగ్గరకి వెళ్లాడు. మతాధికారి అతన్ని ఒక సంచి నిండా పక్షి ఈకలు తీసుకెళ్లి ఊరి మధ్యలో వాటిని జారవిడవమన్నాడు. రైతు మతాధికారి చెప్పినట్టే చేశాడు. తరువాత మతాధికారి రైతుని వెళ్లి ఆ ఈకలన్నీ ఏరి సంచిలో వెయ్యమన్నాడు. ఎంత ప్రయత్నించినా అతనాపని చెయ్యలేకపోయాడు. ఎందుకంటే ఆ ఈకలన్నీ గాలికి చెల్లాచెదురై ఎక్కడెక్కడికో ఎగిరిపోయాయి. అతను ఖాళీ సంచితో తిరిగి వెళ్లాడు. అప్పుడా



మతాధికారి రైతుతో, ''ఇదే నీ మాటలకి కూడా వర్తిస్తుంది. సునాయాసంగా నువ్వు వాటిని జారవిడిచావు. గాని వాటిని నువ్విప్పుడు వెనక్కి తీసుకోలేవు. నీ మాటలని ఎన్నుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండు'' అన్నాడు.

చాలామంది ఆ రైతులాగే ప్రవర్తిస్తుంటారు. జారిన కాలిని తిరిగి తీసుకోగలమేమో కానీ, నోటినుంచి జారిన చెడు మాటను ఎట్టి పరిస్థితులలోనూ తిరిగి వెనక్కి తీసుకోలేము. అందుకే ముందే జాగ్రత్తగా మాట్లాడటం మేలని పెద్దలు చెబుతుంటారు.

ఏరో స్పేస్

## చేతికి అందిన కల

**ఆకాశంలో చందమామను చూపిస్తూ గోరుముద్దలు పెట్టేటప్పుడు ఆ అమ్మ తన బిడ్డ కలలు ఆకాశంలో విహరిస్తున్నాయని ఊహించనైనా ఊహించలేదు. అప్పుడే కాదు, మనదేశం చంద్రయాన్ ప్రయోగాలు చేస్తున్నప్పుడు కూడా ఆ అమ్మానాన్నకు తమ కూతురు ఆలోచనలు అంతరిక్షంలో ఉన్నాయని తెలియదు. 'తను అంత పెద్ద కలలు కంటోందని మేము ఊహించనే లేదు' అంటున్నారు లలిత తల్లిదండ్రులు!**

కర్నాటక రాష్ట్రం, చిత్రదుర్గ జిల్లా హరియూర్ పట్టణం ఇప్పుడు వార్తల్లోకి వచ్చింది. లలిత అనే ఇరవై రెండేళ్ల అమ్మాయి సాధించిన స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో హరియూర్‌తోపాటు లలిత అమ్మానాన్న.. రాజేంద్ర, చిత్రలు కూడా సెలబ్రిటీలయ్యారు. బెలగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదువుతున్న లలిత ఫైనల్ పరీక్షల్లో 9.7 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించింది! ఈ పర్సెంటేజ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు. వారం రోజులుగా చిత్రదుర్గ జిల్లా మొత్తం ఈ సంబరాన్ని ఆస్వాదిస్తోంది. 'ఏటా ఎవరో ఒకరు ఫస్ట్ ర్యాంకు సాధిస్తూనే ఉంటారు కదా' అనే ప్రశ్న మామూలే. కానీ లలితది.. అమ్మానాన్నలు అరచేతుల్లో నడిపించి మరీ చదివించిన నేపథ్యం కాదు. హరియూర్ మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ వచ్చిన డబ్బుతో జీవనం గడుపుతున్న కుటుంబం వాళ్లది. ముగ్గురమ్మాయిలను పట్టుదలగా స్కూలుకు పంపించారు. వాళ్ల పెద్దమ్మాయే లలిత. తల్లిదండ్రుల కష్టం తెలిసిన అమ్మాయిలు కావడంతో ఇప్పటికీ ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి మార్కెట్‌కు కూరగాయల చేరవేతలో తండ్రికి సహాయంగా ఉంటున్నారు. ఇంటి పనులు ముగించుకుని తల్లి వచ్చి మార్కెట్‌లో కూర్చునే లోపు కూతుళ్లలో ఎవరో ఒకరు దుకాణంలో ఉంటారు. ఆ తర్వాత కాలేజీలకు వెళ్తారు. అలా లలిత కూడా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు కూరగాయలతోపాటు పుస్తకాలు కూడా పట్టుకెళ్లేది. ఆ అమ్మాయి దుకాణంలో కూర్చుని చదువుకుంటూ, బేరం వచ్చినప్పుడు కూరగాయలమ్మడం ఆ మార్కెట్‌లో తోటి వ్యాపారులకే కాదు, కూరగాయలు కొనుక్కోవడానికి వచ్చిన వాళ్లకు కూడా పరిచిత దృశ్యమే. లలిత స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అని తెలియగానే ఇప్పుడు ఆమెను తెలిసిన వాళ్లందరూ తమ ఇంటి బిడ్డ సాధించిన విజయంగా సంతోషపడుతున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో శనివారం ఆమెకు బంగారు పతకాన్ని బహూకరించారు.

లలిత ఆ ఇంట్లో తొలి గ్రాడ్యుయేట్. వేడుక చేసుకోవడానికి అదే పెద్ద సందర్భం అనుకుంటే.. స్టేట్ ఫస్ట్‌ర్యాంకుతో పాస్ కావడం, బంగారు పతకం అందుకోవడంతో రాజేంద్ర, చిత్రల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. లలిత మాత్రం ''మమ్మల్ని చదివించడానికి అమ్మానాన్న పడిన కష్టం తెలుసు. వాళ్లు గర్వపడేలా ఎదుగుతాను. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేయాలనుకుంటున్నాను. ఇస్రో చైర్మన్ శివన్ నాకు ఆదర్శం. అంతరిక్ష పరిశోధన చేయడం నా కల'' అంటోంది.

– మంజీర


లలిత


నాన్న, అమ్మ, చెల్లెళ్లతో లలిత (నాన్న పక్కన)

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
10-2-2020



# సూపర్ ఎగ్జైట్‌మెంట్

మేకప్ రూమ్‌లో చాలా శ్రద్ధగా డైలాగ్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. ఈ ఏకాగ్రత 'ఇండియన్ 2' కోసమే. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇండియన్ 2'. 1996లో కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్'(తెలుగులో 'భారతీయుడు') చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం 'ఇండియన్ 2' షూటింగ్ చెన్నైలో జరుగుతోందని సమాచారం. ఈ షూట్‌లో కాజల్ పాల్గొన్నారు. ''ఇండియన్ 2' షూట్‌లో పాల్గొంటున్నాను.. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది'' అన్నారు కాజల్ అగర్వాల్. ఈ సినిమాలో 80ఏళ్ల వృద్ధురాలి పాత్రలో కనిపిస్తారట కాజల్. ఈ చిత్రంలోని పాత్ర కోసం అప్పట్లో మార్షల్ ఆర్ట్స్ కూడా సాధన చేశారామె. సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది.


● కాజల్

# పొల్లాచిలో షురూ



'నిన్ను కోరి' వంటి సక్సెస్‌ఫుల్ సినిమా తర్వాత మరోసారి కలిశారు హీరో నాని, దర్శకుడు శివ నిర్వాణ. వీరిద్దరి కాంబినేషన్‌లో 'టక్ జగదీష్' అనే సినిమా తెరకెక్కుతోంది. ఇందులో రీతూ వర్మ, ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై హరీష్ పెద్ది, సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ పొల్లాచిలో నేడు ప్రారంభం కానుంది. సినిమాలోని కీలక సన్నివేశాలను, పాటలను ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారట చిత్ర బృందం. ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.

● నాని



● రాము జూపల్లి, అల్లు అరవింద్, విజయ్ దేవరకొండ

# భవిష్యత్ డిజిటల్ రంగానిదే

**- అల్లు అరవింద్**

''ఏడాది క్రితం ఓ మీడియం మన సినిమాలను తినేస్తుందేమో అనే భయంతో 'ఆహా ఓటీటీ' ప్రయాణం మొదలైందని చెప్పవచ్చు. ఆహా గురించి మా అబ్బాయిలకు (అల్లు అర్జున్, అల్లు బాబీ, అల్లు శిరీష్)లకు చెప్పగానే..'నాన్నా.. నువ్వు రేపటిని చూస్తున్నావ్' అన్నారు. తెలుగు వారికి తెలుగు కంటెంట్‌ను చూపిస్తే బాగుంటుందనే ఉద్దేశంతో 'ఆహా ఓటీటీ'కి శ్రీకారం చుట్టాం'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. 'ఆహా ఓటీటీ' ప్రివ్యూ ఫంక్షన్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ఎవరైనా డిజిటల్ మీడియంలోకి రావాలంటే సందేహించొద్దు. భవిష్యత్తు డిజిటల్ రంగానిదే. ఇది మాకు కొత్త. అందుకే అందరి సహకారాన్ని కోరుకుంటున్నాం. మై హోమ్ రామేశ్వర్‌రావుగారు, రామ్‌లతో పాటు మరి కొందరు 'ఆహా ఓటీటీ'లో భాగస్వామ్యులుగా ఉన్నారు. అజయ్ ఠాకూర్ హ్యాండిల్ చేస్తున్నారు. టెక్నాలజీ బిజినెస్ గురించి కోల్‌కతాలోని మా స్నేహితులు, ఓ అమెరికన్ కంపెనీ సపోర్ట్ తీసుకుంటున్నాం. ఈ ఏడాది పాతిక షోలను ప్లాన్ చేస్తున్నాం. దర్శకుడు క్రిష్ ఓ షో చేస్తున్నారు. ఇందులో కంటెంట్ బోల్డ్‌గా ఉంటుంది. కాబట్టి పేరెంట్ కంట్రోలింగ్ సిస్టమ్ ఉండేలా చూసుకోవాలి'' అన్నారు. 'మేం గృహనిర్మాణం నుంచి ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెట్టాం. అరవింద్‌గారి ఆలోచనల నుంచి పుట్టిందే 'ఆహా ఓటీటీ'. ఇందులో వందశాతం తెలుగు కంటెంట్ ఉంటుంది. అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఏడాది ప్రీమియాన్ని 365 రూపాయలుగా నిర్ణయించాం'' అన్నారు జూపల్లి రామూరావు. ''ఆహా ఓటీటీ' ఫ్యూచర్ ఎంటర్‌టైన్‌మెంట్ గేమ్‌చేంజర్‌గా చెప్పవచ్చు. టీవీని ఓటీటీ రీప్లేస్ చేస్తుందనిపిస్తోంది. సినిమాల నుంచి వెబ్‌కు యాక్టర్స్ క్రాస్ ఓవర్ అవుతున్నారు'' అన్నారు విజయ్ దేవరకొండ. ''నా రైటింగ్‌లోని మరో కోణమే 'మస్తీస్'. అజయ్‌భూయాన్ బాగా డైరెక్ట్ చేశారు. అవకాశం ఇచ్చిన అల్లుఅరవింద్, రామ్, అజిత్‌ఠాగూర్‌కి థ్యాంక్స్'' అన్నారు దర్శకుడు క్రిష్. యాక్టర్ నవదీప్ మాట్లాడారు.

# అలీ @ కలామ్




● 'కలామ్' బయోపిక్

భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ బయోపిక్ హాలీవుడ్‌లో తెరకెక్కుతోంది. కలామ్ పాత్రను నటుడు అలీ పోషిస్తున్నారు. పప్పు సువర్ణ నిర్మాణంలో జగదీష్ దానేటి, జానీ మార్టిన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను కేంద్ర సమాచార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ ఆదివారం ఢిల్లీలో విడుదల చేశారు. ''సినీ జీవితంలో అత్యంత సంతృప్తిని ఇచ్చిన పాత్ర ఇది. కలామ్‌గారితో ఫొటో దిగితే చాలనుకున్నాను. ఆయన బయోపిక్‌లో నటించే అవకాశం రావడం నా అదృష్టం'' అన్నారు అలీ. ''అలీగారికి ఇది 1,111వ చిత్రం. ఈ పాత్రకు ఆయన సరిగ్గా సరిపోయారు'' అన్నారు జగదీష్ దానేటి.

# రవీనా ఆగయా



● రవీనా, ప్రశాంత్ నీల్

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కేజీయఫ్ ఛాప్టర్ :2'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ నిర్మిస్తోంది. 'కేజీయఫ్' చిత్రం తొలి భాగం సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. రె ండో భాగంలో కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రవీనాటాండన్ 'రమికా సేన్' అనే పాత్రలో కనిపించబోతున్నారు. సినిమాలో ఆమె పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. ఈ ఏడాది జూలైలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

# పిచ్చెక్కించే వినోదం



● జొన్నవిత్తుల

ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకునిగా మారారు. ఆయన తెరకెక్కించనున్న 'ఆర్జీవీ' అనే చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'కార్తికేయ' చిత్ర నిర్మాత వెంకట శ్రీనివాస్ బొగ్గరం సమర్పణలో మాగ్నస్ సినీప్రైమ్ పతాకంపై బాల కుటుంబరావు పొన్నూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. బాల కుటుంబరావు పొన్నూరి మాట్లాడుతూ– ''ఒక విద్యావేత్తగా పాఠాలు చెప్పి మంచిని బోధించే వృత్తిలో ఉన్న నాకు, జొన్నవిత్తుల గారు చెప్పిన కథ నచ్చడంతో సామాజిక బాధ్యతగా ఈ సినిమా నిర్మిస్తున్నా. ఇదొక మంచి చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ– ''ప్రస్తుత సమాజంలో కొందరు స్వేచ్ఛ పేరుతో యువతను తప్పుదోవ పట్టించే భావజాలాన్ని ఒక సిద్ధాంతంలా ఎక్కించారు. దీని వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని మా సినిమాలో చూపిస్తున్నాం. ఇందులో పిచ్చెక్కించే వినోదం ఉంటుంది. ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తాం. మార్చి మొదటివారంలో చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అన్నారు.

# సరాసరి గుండెల్లో దించావే...



● రష్మికా మందన్నా, నితిన్

'హై క్లాసు నుంచి లో క్లాసుదాకా..', 'వాటే..వాటే..వాటే బ్యూటీ' పాటల తర్వాత 'భీష్మ: సింగిల్ ఫరెవర్' చిత్రం నుంచి 'సరాసరి గుండెల్లో దించావే.. మరీ మరీ మైకంలో ముంచావే.. అయినా సరే ఈ బాధ బాగుందే' అనే పాట లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు. నితిన్, రష్మికా మందన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భీష్మ'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మించారు. 'సరాసరి..' పాటకు శ్రీమణి లిరిక్స్ అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో శేఖర్ మాస్టర్ నేతృత్వంలో ఈ పాట చిత్రీకరించారు. ఈ సినిమాకు మహతి స్వరసాగర్ సంగీతం అందించారు. 'భీష్మ' ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... నితిన్ వివాహం ఏప్రిల్ 16న జరగనుంది. తన స్నేహితురాలు షాలినీతో నితిన్ ఏడడుగులు వేయబోతున్నారు.

# యాక్షన్‌కి రెడీ



● కత్రినా

హీరోయిన్ కత్రినాకైఫ్ ఈ ఏడాది సూపర్ హీరోగా మారబోతున్నారని బాలీవుడ్ సమాచారం. ఆల్రెడీ ఇందుకు తగ్గ పనులు కూడా మొదలయ్యాయట. సల్మాన్‌ఖాన్‌తో 'సుల్తాన్' (2016), 'టైగర్ జిందా హై'(2017), 'భారత్' (2019) చిత్రాలను తెరకెక్కించిన అలీ అబ్బాస్ జాఫర్, కత్రినాను సూపర్ హీరోగా మార్చే కథను రెడీ చేస్తున్నారట. ఇందులో క్యారెక్టర్ పరంగా కత్రినా అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌ను చేయబోతున్నారని బాలీవుడ్ టాక్. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నారు అలీ అబ్బాస్. వీలైనంత త్వరగా కథను ముగించి, ఈ ఏడాదిలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నారట దర్శకుడు. కాగా అలీ అబ్బాస్ దర్శకుడిగా తెరకెక్కించిన తొలిచిత్రం 'మేరే బ్రదర్‌కీ దుల్హన్'లో హీరోయిన్‌గా నటించిన కత్రినా ఆ తర్వాత 'టైగర్ జిందా హై', 'భారత్' చిత్రాల్లోనూ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే.

# అమాయక కుర్రోడి కథ



● మహి రాథోడ్, రేణుక

మహిరాథోడ్, రేణుకా బైరాగి జంటగా నటిస్తున్న చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. మహి రాథోడ్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్నారు. పీవీయమ్ జ్యోతి ప్రొడక్షన్ పతాకంపై నిర్మిస్తోన్న ఈ చిత్రానికి శివ పాలమూరి దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి నటుడు 'దిల్' రమేశ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాతల్లో ఒకరైన సిస్టర్ మణి కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు శివ మాట్లాడుతూ–''ఇది నా తొలిచిత్రం. ఈ నెల 14న షూటింగ్ ప్రారంభించి సింగిల్ షెడ్యూల్‌లో ఈ చిత్రాన్ని పూర్తి చేస్తాం. త్వరలోనే టైటిల్ ప్రకటిస్తాం'' అన్నారు. ''దర్శకుడు చెప్పిన కథ నచ్చటంతో ఈ సినిమాను నిర్మిస్తున్నా'' అన్నారు హీరో మహి. నటుడు 'దిల్' రమేశ్ మాట్లాడుతూ– ''యాత్ర' చిత్రం తర్వాత నాకు మంచి పాత్రలు వస్తున్నాయి. ఈ చిత్రంలోకూడా కీలకమైన పాత్రలో నటిస్తున్నా. అమాయక కుర్రోడు ప్రేమించి, పెళ్లి చేసుకున్న తర్వాత ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు? అనేది ఈ సినిమా'' అన్నారు.

# వలయం ట్రైలర్ బాగుంది

**- అడవి శేష్**



● లక్ష్, అడవి శేష్, రమేష్

''స్నేహం, బంధుత్వం కన్నా నేను ప్యాషన్నే ఎక్కువ నమ్ముతాను. ఆ ప్యాషన్ ఉంటేనే ఇండస్ట్రీలో మనందరం ఉంటాం అని నమ్ముతాను'' అన్నారు అడవి శేష్. లక్ష్, దిగంగనా సూర్యవంశీ జంటగా రమేష్ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వలయం'. చదలవాడ శ్రీనివాసరావు సమర్పణలో పద్మావతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ట్రైలర్‌ను విడుదల చేసిన అడవి శేష్ మాట్లాడుతూ– ''లక్ష్‌లో ప్యాషన్ ఉంది. అది ట్రైలర్‌లో కనిపిస్తోంది.. 'వలయం' ట్రైలర్ నచ్చింది. సినిమా బాగా ఆడాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''వలయం' అనేది సమిష్టి కృషి. మా నాన్న నాకు ఓ చాన్స్ ఇచ్చారు. ఆయన సపోర్ట్ లేకపోతే మళ్లీ వచ్చేవాణ్ని కాదు. నా మిత్రుడు శేష్ అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నాను'' అని లక్ష్ అన్నారు. ''లక్ష్ పెద్ద హీరోగా పేరు తెచ్చుకుంటే సంతోషం.. మంచి కొడుకుగా ఉంటే ఇంకా సంతోషం'' అన్నారు చదలవాడ శ్రీనివాసరావు. ''అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, లక్ష్‌కు థ్యాంక్స్'' అన్నారు రమేష్ కుడుముల. దర్శకులు కేయస్ నాగేశ్వరరావు, నాగు గవర, చంద్ర మహేశ్, నిర్మాత శోభారాణి, నటుడు రవి ప్రకాశ్, సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మాట్లాడారు.







పరిచయం | అంకితాబెన్ షా

**అంకితాబెన్ షా... గుజరాత్‌లో ఇప్పుడు వార్తల్లోని వ్యక్తి. అహ్మదాబాద్ రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్‌లో మగవాళ్లు నడుపుతున్న ఆటోలతోపాటు అంకితాబెన్ షా ఆటో కూడా ఉంటుంది. ఆమె మీడియా దృష్టిని ఆకర్షించడానికి కారణం ఒక మహిళ ఆటో నడుపుతుండడం మాత్రమే కాదు. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ ఉమన్ ఆటో నడపడం కూడా. అందులోనూ తండ్రి వైద్యం కోసం ఆమె ఈ సాహసం చేస్తున్నారు.**




● అంకితా షా : అహ్మదాబాద్‌లో అంగవైకల్యం గల తొలి మహిళా ఆటో డ్రైవర్‌గా గుర్తింపు

# పెద్ద కొడుకు

‘‘మా అమ్మానాన్నకు మేము ఐదుగురు సంతానం. అందరిలో పెద్దదాన్ని. మా నాన్న అనారోగ్యంతో మంచం పట్టాడు. ఆయనకు వైద్యం చేయించడంతోపాటు ఇంటిని పోషించాలి. నేను ఆడపిల్లను అని కానీ, నాకు శారీరక వైకల్యం ఉందని కాని ఊరుకోవడం నా వల్ల కాలేదు. ఆటో స్టీరింగ్ పట్టుకున్నాను. మహిళను కాబట్టి చూసిన వాళ్లు ఇన్ని ప్రశ్నలు వేస్తున్నారు. అబ్బాయినైతే ఎవరూ ఏమీ అడిగేవాళ్లే కాదు. మా నాన్న అంత మంది పిల్లల్ని పోషిస్తూ కూడా నన్ను చదివించాడు. ఆడపిల్ల, అందులోనూ శారీరక వైకల్యం ఉంది చదువెందుకు అనుకోలేదాయన. అలాంటి తండ్రికి నేను రుణం తీర్చుకోవాల్సిన సమయం ఇది’’ అంటారు అంకితాబెన్ షా.

### ఆఫీసుల చుట్టూ తిరిగింది

అంకితాబెన్ షా సొంతూరు గుజరాత్, సూరత్‌కు సమీపంలోని పాలిథానా గ్రామం. ఆమెకు చిన్నప్పుడు కుడికాలికి పోలియో సోకింది. వాళ్లకు తెలిసిన డాక్టర్ అతడికి చేతనైన వైద్యం చేయడంతో ఆమె కోలుకోలేదు సరికదా, మెరుగైన వైద్యం అందక కాలిలో కొంత భాగం తొలగించాల్సి వచ్చింది. దాంతో ఆమెకు కృత్రిమ కాలు అమర్చారు. ‘మిగిలిన అందరు పిల్లల్లా అన్ని పనులూ చేయలేదు, కాబట్టి చదివిస్తే ఏదో ఒక ఉద్యోగం వస్తుంది. ఎవరి మీదా ఆధారపడకుండా తన బతుకు తాను జీవించగలుగుతుంది..’ అనుకున్నాడు ఆమె తండ్రి. అనుకున్నట్లే డిగ్రీ వరకు చదివించాడు కూడా. పదేళ్ల కిందట డిగ్రీ పట్టాతో అహ్మదాబాద్‌లో అడుగుపెట్టారు అంకిత. పాతికేళ్ల అమ్మాయి... చేతిలో పట్టాతో ఉద్యోగం కోసం అహ్మదాబాద్‌లోని ఆఫీసుల చుట్టూ తిరిగింది. ఓ గర్ల్స్ స్కూల్‌లో క్లర్క్ ఉద్యోగం వచ్చింది. మొదటి మూడు నెలలు నామమాత్రపు వేతనం ఇచ్చేటట్లు, మూడు నెలల తర్వాత మంచి జీతం ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకుంది ఆ యాజమాన్యం. అయితే పది నెలలైనా జీతం మాటేలేదు. కాల్ సెంటర్ ఉద్యోగానికి గుజరాతీ యాసతో కూడిన ఇంగ్లిష్ ఉచ్చారణ పెద్ద అడ్డంకి అయింది. దాంతో అంకిత స్పోకెన్ ఇంగ్లిష్ ప్రాక్టీస్ చేశారు. అహ్మదాబాద్ వ్యాపార నగరం చూపించిన జీవితాన్ని గుర్తు చేసుకుంటూ.. ‘‘ఎన్నో ఆఫీసుల గడపలు ఎక్కి దిగాను. బీఏ ఎకనమిక్స్ పట్టా నా చేతిలో ఉంది, అయినా సరే నా కాలికి ఉన్న వైకల్యమే వాళ్లకు ప్రధానంగా కనిపించింది. ఇంటర్వ్యూ చేసిన తర్వాత నా సర్టిఫికేట్‌లు చేతిలో పెడుతూ ‘వైకల్యం గురించి ఆలోచించాల్సి వస్తోంది’ అనేవారు. పట్టు వదలకుండా ప్రయత్నం చేయగా చేయగా ఎట్టకేలకు ఒక కాల్ సెంటర్‌లో ఉద్యోగం దొరికింది. రోజుకు పన్నెండు గంటల పని. పన్నెండు వేలు జీతం. బతుకుకు ఆసరా దొరికిందని సంతోషపడేలోపు నాన్నకు పెద్ద అనారోగ్యం. క్యాన్సర్ అన్నారు. ఆయనకు పని చేసే పరిస్థితి లేకపోవడమే కాదు ఆయనకు వైద్యం చేయించడానికి చాలా డబ్బు కావాలి. ఆయనను హాస్పిటళ్లకు తీసుకెళ్లాలి అంటే ఆఫీసుకు సెలవు పెట్టాలి. ఉద్యోగం చేస్తూ, వైద్యం చేయిస్తూ సూరత్– అహ్మదాబాద్‌ల చుట్టూ తిరిగాను. ఉద్యోగం నుంచి నన్ను తీసేయలేదు కానీ, నా సెలవులు వాళ్లకు ఇబ్బందిగా ఉంటున్నాయని తెలుస్తోంది.



### ఇదేం పని అన్నారు

ఒక రోజు... ఇంట్లో అందరూ ఉన్నప్పుడు ఉద్యోగం మానేస్తానని చెప్పాను. వాళ్లు ఆ మాటకు పెద్దగా ఆశ్చర్యపోలేదు. కానీ ఆటో నడపతానన్న మాటకు ఆశ్చర్యపోయారు. నాకు తెలిసిన ఆటో డ్రైవర్ లాల్జీ బారోత్ దగ్గర డ్రైవింగ్ నేర్చుకున్నాను. అతడు కూడా ఫిజికల్లీ చాలెంజ్‌డ్ పర్సనే. అతను తన ఆటోకు మార్పులు చేయించుకున్నట్లే నాక్కూడా హ్యాండ్ బ్రేక్ పెట్టించాడు. ఆరు నెలల నుంచి ఆటో నడుపుతున్నాను. రోజుకు ఎనిమిది గంటలు పని చేస్తున్నాను, నెలకు పాతిక వేలు మిగులుతున్నాయి. నాన్న కోసం హాస్పిటల్‌కు వెళ్లాల్సినప్పుడు ఇప్పుడు ఎవరి నుంచీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఖర్చులకు సరిపడినంత డబ్బు రాలేదనిపిస్తే మరో రెండు గంటలు పని చేయడానికి నేను సిద్ధమే.

### కామెంట్‌లు వస్తుంటాయి

రోడ్డు మీద బైక్‌లలో వెళ్లే వాళ్లలో కొందరు పోకిరీలు ఏదో ఒక కామెంట్ చేస్తుంటారు. మహిళ ఆటో నడుపుతోందని గమనించి నా ఆటోను దాటుకుని ముందుకి వెళ్లి తలలు తిప్పి నన్ను పరిశీలనగా చూస్తారు. వాళ్ల నోటికి వచ్చినదేదో కూస్తారు. ఆ మాటలను పట్టించుకోవాల్సిన అవసరమే లేదనిపిస్తుంది నాకు. ఎండలో తిరిగితే చర్మం కమిలిపోతోందనే బెంగ కూడా లేదు. నీడపట్టున కూర్చుని చేసిన ఉద్యోగాల కంటే ఆటో నడపడంలో నాకు సంతృప్తి ఉంది. భవిష్యత్తులో కూడా ఇక ఆ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయను. నాన్న ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ట్యాక్సీ సర్వీస్‌ని విస్తృతం చేస్తాను. పెద్ద తమ్ముడికి పనిలో పడే వయసు వచ్చింది. తనను కూడా ఇదే పనిలో పెడతాను. మా కుటుంబాన్ని గట్టెక్కించిన స్టీరింగ్‌ని మాత్రం ఎప్పటికీ వదలను’’ అన్నారు అంకిత.

– మంజీర


పరి పరిశోధన

## లవణాలతో కరోనా వైరస్ నుంచి రక్షణ?



కరోనా వైరస్...
పేరు చెప్పగానే ప్రపంచం ఉలిక్కిపడే పరిస్థితి. చికిత్స లేని ఈ వ్యాధికి నివారణే మేలైన మందు. కానీ ఎలా? ఈ చిక్కు ప్రశ్నకు సమాధానం ఇదిగో అంటున్నారు కెనెడా శాస్త్రవేత్తలు. వైరస్‌లు సోకకుండా ఉండేందుకు కట్టుకునే సాధారణ మాస్కులతో మేలు కంటే కీడే ఎక్కువని వీరు స్పష్టం చేస్తున్నారు. ఈ మాస్కులు గాల్లో వైరస్‌లతో కూడిన నీటిచుక్కలను ఒడిసిపట్టగలిగినా.. చంపలేవని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త హ్యో జిక్ ఛోయ్ అంటున్నారు. అయితే కరోనా వైరస్ ఇంతకంటే సూక్ష్మమైన వాటి గుండా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ మాస్క్‌లకు సక్రమంగా నాశనం చేయకపోతే వాటిల్లో చిక్కుకుని ఉన్న వైరస్‌లు ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. మరి తరుణోపాయం? ఇళ్లల్లో వాడే సోడియం క్లోరైడ్, పొటాషియం క్లోరైడ్‌లతో తయారైన ద్రావణాన్ని వాడటం ద్వారా వైరస్‌లను నిలువరించవచ్చునని ఛోయ్ తెలిపారు. లవణాలతో కూడిన ద్రావణం మాస్క్‌ల్లోపల స్ఫటికాల మాదిరిగా మారుతుందని, వీటికున్న పదునైన కొసలు వైరస్‌లను చంపేస్తాయని వివరించారు. ఇన్ఫ్లుయెంజా వైరస్‌లు మూడింటితో తాము ప్రయోగాలు చేసి సత్ఫలితాలు సాధించామని చెప్పారు. కేవలం ఐదు నిమిషాల్లో వైరస్ నిస్తేజమైపోగా.. అరగంటలో మరణించిందని వివరించారు. ఇదే సాంకేతికత కరోనా వైరస్‌ను అడ్డుకునేందుకు ఉపయోగపడవచ్చునని తెలిపారు. ఈ ద్రావణాన్ని వాణిజ్య స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ లోపుగా మాస్కులు ఉపయోగిస్తున్న వారు చేతివేళ్లతో మాస్కుల్లోని ఫిల్ట్రేషన్ పదార్థాన్ని ముట్టకపోవడం మేలని సూచిస్తున్నారు.

## గాల్లోంచి నీరు.. కొత్త రికార్డు!



గాల్లోని తేమను పిండి, నీటిగా మార్చేందుకు ఇటీవలి కాలంలో బోలెడన్ని యంత్రాలు, టెక్నాలజీలూ అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇవేవీ అనుకున్నంత సమర్థంగా పనిచేయవు. గంటల సమయం తీసుకుని అరకొరగా నీళ్లు ఇస్తాయీ యంత్రాలు. ఈ నేపథ్యంలో జాన్ హాప్కిన్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎంఓఎఫ్)పై చేసిన ప్రయోగం అందరి దష్టిని ఆకర్శిస్తోంది. కేవలం ఒక గ్రాము మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ పదార్థం ఫుట్‌బాల్ మైదానమంత ఉపరితలం కలిగి ఉంటుంది. గతంలోనూ ఈ ఎంఓఎఫ్‌లతో గాల్లోని తేమను నీటిగా మార్చవచ్చునని రుజువైంది. కిలోగ్రాము ఎంఓఎఫ్‌తో బెర్క్‌లీ యూనివర్శిటీ కాలేజీ ఒక రోజులో వంద మిల్లీలీటర్ల నీటిని ఒడిసిపట్టగలిగింది. గత ఏడాది ఈ మోతాదు 1.3 లీటర్లకు చేరింది. జాన్‌హాప్కిన్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు మాత్రం ఏకంగా 8.66 లీటర్ల నీటిని ఒడిసిపట్టడంలో విజయం సాధించారు. తాము ఇప్పటివరకూ దాదాపు పది ఎంఓఎఫ్‌లపై ప్రయోగాలు చేశామని, వీటిల్లో ఒకటి ప్రతి కిలోగ్రాము పదార్థానికి ఒక రోజులో 8.66 లీటర్ల నీటిని అందిస్తోందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఝియాంగ్ షీ తెలిపారు. వాతావరణ పరిస్థితులను మార్చడం ద్వారా మరింత ఎక్కువ నీటిని రాబట్టేందుకు ఉన్న అవకాశాలను ప్రస్తుతం పరిశీలిస్తున్నామని చెప్పారు. పరిశోధనల వివరాలు సైంటిఫిక్ రిపోర్ట్స్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

● స్నేహం

# చేయి చేయి కలిపితే విజయం

**పని ప్రదేశాల్లో ముఖ్యంగా ఉద్యోగాలు చేసే చోట మహిళలు ఒకరికొకరు నిజాయితీతో మనస్ఫూర్తిగా స్నేహితులుగా ఉండగలరా..? సాటి స్త్రీల పట్ల అసూయ, శత్రుత్వాలను అధిగమించి విజయాలను చేరుకోగలరా..? స్త్రీ స్నేహాలు నిస్సారంగా, సత్యానికి దూరంగా ఉంటాయా..? ఈ ప్రశ్నలతో పాటు సమాధానాలనూ హార్వర్డ్ బిజినెస్ రివ్యూలో ప్రచురించారు. ఈ రివ్యూలో ప్రచురించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధన దీనికి కొన్ని రుజువులను చూపింది.**



### రుజువులు ఇవి..

- మహిళలు స్నేహితులుగా, సన్నిహిత ఆరోగ్యకరమైన బంధాలను పంచుకోవడమే కాదు వారి స్నేహితుల విజయాలకు కూడా కీలక పాత్ర పోషిస్తారు.
- బలమైన స్నేహాలు మహిళల వృత్తిని సానుకూలంగా ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.
- విజయాలను సాధించిన మహిళా స్నేహితులను కలిగి ఉంటే వారి నుంచి మంచి కెరీర్ సలహాలను పొందవచ్చు. సమస్యను వారు అర్థం చేసుకుని, తగిన సహాయాన్ని అందించగలరని నిర్ధారించుకోవచ్చు.

### సూచనలివి..

- మీ స్నేహితులతో మీరే అధికంగా మాట్లాడుతూ ఉండటం కన్నా వినడం వల్ల ఎక్కువ విషయాలు తెలుస్తాయి.
- నైపుణ్యాలను పెంచే సలహాలు ఇవ్వగల వ్యక్తిని కలిగి ఉండటమే కాదు.. ఆమె అడుగుజాడలను అనుసరించాలని భావించే స్నేహితులకు ఒక మద్దతును లభిస్తుంది.
- ఇటీవల కాలంలో ఉద్యోగ నియామకాల విషయానికి వస్తే పురుషులు కూడా లింగభేదాల పట్ల పట్టింపు లేదనే విషయాన్ని వెల్లడించినట్లు ఆ రివ్యూ స్పష్టం చేసింది. దీనికి కారణం ‘పురుషుల ఆధిపత్య వృత్తులను స్త్రీలు సమర్థవంతంగా నిర్వహిస్తుండమే.

### అధిగమించేందుకు నైపుణ్యాలు

- స్నేహితులతో ఉన్నప్పుడు మీ ఉద్యోగానికి సంబంధించిన విషయాలు చర్చించడానికి వెనకడుగు వేయద్దు. పని చేసే చోట మీ అనుభవాలు, పోరాటాలు, సందేహాలను తీర్చడానికి అవి ఉపయోగపడతాయి. అంతేకాదు, మీరు కూడా సలహాలను కోరడానికి సిగ్గుపడకూడదు.
- రెజ్యూమ్‌ను తయారుచేయడానికి లేదా ఇంటర్వ్యూలో నెగ్గడానికి చిట్కాలు, పనిలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించే నైపుణ్యాలు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటాయి.
- పని చేసేచోట పురుషులతో పాటు మహిళలను సమానంగా పరిగణించినట్లయితే ఈ సహాయక వ్యవస్థ అవసరం లేదు. కిందటేడాది బుకింగ్.కామ్ నిర్వహించిన అధ్యయనంలో పాల్గొన్న 42 శాతం మంది మహిళలు కార్యాలయంలో పక్షపాతాన్ని ఎదుర్కొన్నామని చెప్పారు. సీనియర్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న 52 శాతం మహిళలు, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా పనిచేస్తున్న 57 శాతం మహిళలు కార్యాలయంలో లింగ పక్షపాతాన్ని ఇప్పటికీ ఎదుర్కొంటున్న అంగీకరించారు. అయితే, ఈ పక్షపాతం మహిళ వృత్తిలో ఎదగడానికి నిచ్చెనలా సాయపడుతుంది అని వారు తెలియజేయడం విశేషం.

పని చేసే చోట సమాజంలో లింగ విభజనను సృష్టించే వైఖరి క్రమంగా తగ్గుతోంది. పూర్తిగా కనుమరుగయ్యేవరకు మహిళలు ఒకరికొకరు వ్యక్తిగత, వృత్తిపరమైనా సహాయాన్ని అందించుకోవడం వల్ల మెరుగైన ఫలితాలను పొందవచ్చు.

● వాలెంటైన్ వీక్ ఫిబ్రవరి 7-14

**వాలెంటైన్స్ డే- ప్రేమికుల దినోత్సవం దగ్గర పడింది. ప్రపంచమంతా ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు వాలెంటైన్ వీక్ జరుపుకుంటోంది. ఫిబ్రవరి 7 రోజ్ డే, ఫిబ్రవరి 8 ప్రపోజ్ డే, ఫిబ్రవరి 9 చాక్‌లెట్ డే, ఫిబ్రవరి 10 టెడ్డీ డే, ఫిబ్రవరి 11 ప్రామిస్ డే, ఫిబ్రవరి 12 హగ్ డే, ఫిబ్రవరి 13 కిస్ డే చివరిగా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే జరుపుకోనున్నారు. నేడు ‘టెడ్డీ డే’ కనుక ప్రేమికులు టెడ్డీ బేర్‌లను ఇచ్చి పుచ్చుకుంటారు.**



# మురిపెమైన ప్రేమ కానుక

ప్రేమ ఎంత ఉదాత్తభావన అయినా అది నిర్వచనాలకు హద్దులకు నిరిష్టతలకు లొంగేది కాకపోయినా ప్రేమ అనేసరికి అది ప్రధానంగా స్త్రీ, పురుషుల మధ్య సంభవించేదిగా ఎక్కువ మంది భావిస్తారు. స్త్రీ, పురుషుల మధ్య జనించే ప్రేమనే ఈ ప్రపంచం కుతూహలంగా చూస్తుంది. ఆ కథలు వింటుంది. ఆ ప్రేమను కంటుంది. ఆ ప్రేమలో ఆటంకం ఎదురైతే రోదిస్తుంది. భావ ప్రపంచంలో అందరూ ప్రేమికులు ఏకమవ్వాలనే కోరుకుంటారు. చిత్రమేమిటంటే వాస్తవ ప్రపంచంలో ప్రేమకు ఉండేన్ని అడ్డంకులు మరి దేనికీ ఉండవు.

### అందరూ దాటి వచ్చే కేంద్రం

ప్రేమకు వయసు లేకపోయినా ప్రేమకు వయసు ఉందనే అందరూ అనుకుంటూ ఉంటారు. ప్రేమకు హక్కుదారులు యుక్తవయసులో ఉన్న వారే అని భావిస్తారు. యుక్తవయసులోకి అబ్బాయి, అమ్మాయి ప్రవేశించగానే వారు ఎక్కడ ప్రేమలో పడతారోనని పెద్దలు ఉలికులికి పడుతుంటారు. కనిపెట్టుకుని ఉంటారు. నిజానికి ఆ పెద్దలందరూ ‘ఆ వయసు’ను దాటి వచ్చినవారే. అప్రమేయంగా ఆ వయసులో ఏదో ఒక ప్రేమలో పడినవారే. అందుకు ఉన్న అడ్డంకులను తలుచుకుని, విఫలమయ్యి, ఒక్కోసారి విజయాలు సాధించి ప్రేమను ఎలాగోలా అనుభవించినవారే. అయినప్పటికీ తమ తర్వాతి తరం ప్రేమ గురించి వారికి గుబులు ఉంటుంది. చిత్రంగా వారసలు ప్రేమే పట్టనట్టు ఉంటే బెంగ కూడా ఉంటుంది. ఇన్ని విరోధమైన భావనలు కల్పించే శక్తి ప్రేమకే కదా ఉంది.

### జీవించే క్షణాలు

డబ్బు సంపాదించిన రోజులని, ఉపాధి కోసం కష్టపడిన రోజులని, కుటుంబం కోసం పాటుపడిన రోజులని చాలామంది ‘జీవించే క్షణాలు’గా గుర్తిస్తారో లేదో కాని తాము ప్రేమించిన రోజులని, ప్రేమలో ఉన్న రోజులని మాత్రం ‘జీవించే క్షణాలు’గా గుర్తిస్తారు. దాటి పోయిన ఆ రోజులు వారిలో మధురంగా గూడు కట్టుకుని ఉంటాయి. సఫలమైన, విఫలమైన ఆ ప్రేమ క్షణాలను ఏ మనిషీ మర్చిపోడు. స్త్రీలు బహుశా వాటిని ఎన్నటికీ బయటపెట్టే సాంఘిక పరిస్థితులు మనకు లేవు. పురుషులు తమ ప్రయివేటు సందర్భాలలో సాటి మిత్రులకు వాటిని పంచుకుంటారు. కాని ప్రతి ఒక్కరూ వాటిని ఏదో ఒక సందర్భంలో తప్పక తలుచుకుంటారు. ఆ డబా ఇల్లు, కొమ్మలు దించిన కొబ్బరి చెట్లు, చల్లగాలి, పక్కింటి వసారాలో బట్టలు ఆరేస్తూ ఆ అమ్మాయి, ట్యూషన్‌కు పుస్తకాలను గుండెలకు ఆన్చుకుని వెళ్లే ఆ అమ్మాయి, రెండు జడల కాటుక కనుల ఆ అమ్మాయి, కళ్లెత్తి మూగగా చూసి మరేం మాట్లాడలేని ఆ అమ్మాయి... అంటూ ఎన్నో జ్ఞాపకాలు. రింగుల రింగుల జుట్టు ఆ అబ్బాయి, పూల చొక్కా ఫుల్‌హ్యాండ్స్ అబ్బాయి, నవ్వితే బిక్కచచ్చి బెంబేలెత్తిపోయే ఆ అబ్బాయి... ఇలా అమ్మాయిలు లిస్ట్ చదువుతారు.

### అమాయక కానుకలు

కానుక లేనిదే ప్రేమ లేదు. ఓ.హెన్రీ రాసిన ఒక ప్రఖ్యాత కథలో ప్రేమికుడు తన వాచీ అమ్మి ప్రియురాలికి దువ్వెనలు కొంటాడు. ప్రియురాలు తన జుట్టు అమ్మి ప్రియుడి వాచికి బంగారు చెయిన్ కొంటుంది. ఆ కానుకలు వారికి ఉపయోగపడవు. కాని ఆ ప్రేమ వారి ప్రేమను మరింత పెంచింది. గులాబి పూలు, రిబ్బన్లు, గాజులు, ఉంగరాలు, దండలు, వాచీలు, పెన్నులు, యాష్ ట్రేలు ప్రేమికుల మధ్య నడిచే కానుకలు. ఇప్పుడు ఈ కొత్త యుగంలో టెడ్డీ బేర్లు ఇచ్చి పుచ్చుకోవడం ఒక ప్రేమ కానుకగా చలామణిలో ఉంది.

### టెడ్డీ బేర్

వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమికులు టెడ్డీ బేర్‌లు ఇచ్చిపుచ్చుకుంటారు. టెడ్డీ బేర్‌లు ప్రేమకు, స్నేహానికి, అమలినత్వానికి, ఎదుగుదలకు చిహ్నం. ఎదిగే వయసులో ఉండే ప్రేమికులు తమ ప్రేమ మరింత ఎదగాలని టెడ్డీ బేర్‌లను ఇచ్చి పుచ్చుకుంటారు. 1910ల నాటి నుంచి అమెరికాలో, జర్మనీలో ఒకేసారి తయారవుతూ వచ్చిన ఈ స్టఫ్డ్ బేర్‌లు నాటి అమెరికా ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ముద్దు పేరు ‘టెడ్డీ’ మీదుగా టెడ్డీ బేర్‌లు అయ్యాయి. వేటకు వెళ్లిన రూజ్‌వెల్ట్ బంధించిన ఒక ఎలుగును చంప నిరాకరించినందుకు ఆయనకు ‘టెడ్డీ’ అనే ముద్దు పేరు వచ్చింది. టెడ్డీ బేర్ కాలక్రమంలో పిల్లలు ఇష్టపడే ముఖ్యమైన ఆటబొమ్మగా మారింది. ఇంట్లో ఒక తప్పనిసరి అలంకరణగా కూడా మారింది.

### ప్రేమకు సీజన్ లేదు

ప్రేమకు సంవత్సరంలో 365 రోజులూ సీజనే. ప్రేమలో ఉన్నవారికీ ప్రతి క్షణమూ ఉత్సవమే. కాని దేశాలకు, సంస్కృతులకు, మతాలకు పర్వదినాలు ఉన్నట్టుగా ప్రేమికులకు కూడా ఒక పర్వదినం ‘వేలెంటైన్స్ డే’. అది వారి రోజు. వారు ఈ ప్రపంచాన్ని ప్రేమమయం చేసే రోజు. గాఢంగా ప్రేమ ప్రదర్శించే రోజు. ఈ ప్రేమను ఓడించడానికి ఎప్పటికప్పుడు ఎందరో ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని వారంతా గతించి ప్రేమ మాత్రం పదేపదే పునరుజ్జీవనం అవుతూనే ఉంటుంది. మనిషి ఉన్నంతకాలం ఉద్భవిస్తూనే ఉంటుంది.

ఈ వాలెంటైన్ వీక్ సందర్భంగా ప్రపంచమంతా వినిపించే నినాదాలు ఇవే:

**ప్రేమా జిందాబాద్...**
**ప్రేమికులూ వర్ధిల్లాలి.**

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
10-2-2020


ఐటీఐ నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ దాకా రకరకాల కోర్సులు పూర్తిచేసుకొని.. ఉద్యోగాన్వేషణ సాగిస్తున్న విద్యార్థుల సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. ప్రస్తుతం ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో అనేక సందేహాలు.. తమ చదువుకు తగ్గ ఉద్యోగం లభిస్తుందా.. జాబ్ మార్కెట్‌లో పరిస్థితి ఎలా ఉంది.. మందగమన పరిస్థితులు ఇలాగే కొనసాగుతాయా.. గతేడాది నియామకాల ధోరణి ఎలా ఉంది.. ఏఏ రంగాల్లో నియామకాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇలాంటి సందేహాల నేపథ్యంలో.. 2020లో నియామకాలపై సర్వేల అంచనాలు..




# కొలువులు ఆశాజనకమేనా..!

- » టాప్-5లో రిటైల్, అకౌంటింగ్, ట్యాక్సేషన్, ఎడ్యుకేషన్, బీపీఓ
- » పుంజుకోనున్న ఆటోమొబైల్స్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, ఆయిల్‌రంగాలు
- » 2020 ఆశాజనకం: తాజా సర్వేలు

### గతేడాది టాప్-5

ఇటీవల ప్రముఖ జాబ్ పోర్టల్ నౌకరీ డాట్ కామ్ నిర్వహించిన సర్వే ప్రకారం- టాప్‌లో నిలిచిన అయిదు రంగాలు.. » ఐటీ-సాఫ్ట్‌వేర్ » అకౌంటింగ్, ట్యాక్సేషన్ అండ్ ఫైనాన్స్ » రిటెయిలింగ్ » బీపీఓ/ఐటీఈఎస్/సీఆర్ఎం/ట్రాన్స్‌క్రిప్షన్ » ఎడ్యుకేషన్, టీచింగ్, ట్రైనింగ్.

### ఈ రంగాల్లో వృద్ధి

ఈ అయిదు రంగాలు రెండంకెల వృద్ధి నమోదు చేసుకొని ముందంజలో నిలిచాయి. ఐటీ-సాఫ్ట్‌వేర్ రంగం 29 శాతం; అకౌంటింగ్, ట్యాక్సేషన్ అండ్ ఫైనాన్స్ 28 శాతం; రిటెయిలింగ్ రంగం 14 శాతం; బీపీఓ/ఐటీఈఎస్/సీఆర్ఎం/ట్రాన్స్‌క్రిప్షన్‌లో 11 శాతం;ఎడ్యుకేషన్/టీచింగ్/ట్రైనింగ్‌లో 9శాతం వృద్ధి నమోదైంది. దీనికి అనుగుణంగా ఈ రంగాల్లో నియామకాలు సైతం పుంజుకున్నాయి.

### అగ్రస్థానంలో ఐటీ

నియామకాల పరంగా ఇప్పటికీ ఐటీ-సాఫ్ట్‌వేర్ రంగమే ముందంజలో నిలుస్తోంది. ఒకవైపు ఆటోమేషన్, ఐఓటీతో ఐటీలో కొలువుల కోతలు అనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ.. గతేడాది అతి పెద్ద జాబ్ క్రియేటర్‌గా ఈ రంగం నిలిచింది. 2018 కంటే 2019లో ఈ రంగంలో ఎక్కువ ఉద్యోగాలు లభించాయి. ఇదే ధోరణి ఈ ఏడాది కూడా కొనసాగుతుందని అంచనా. ఎందుకంటే.. విద్యార్థులు, ఉద్యోగార్థులు సంస్థల అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు కృషి చేస్తున్నారు. దాంతో ఐటీ రంగంలో ఆటోమేషన్, ఐఓటీ తదితర విభాగాల్లో దాదాపు రెండు లక్షల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

### ఫైనాన్స్‌కు పునర్వైభవం!

తాజా సర్వే ప్రకారం.. గతేడాది టాప్-5 రిక్రూటర్స్ జాబితాలో ఫైనాన్స్ రంగం రెండో స్థానంలో నిలవడం విశేషం. ఫైనాన్స్ రంగంలో పునర్వైభవం కనిపిస్తోందని, ముఖ్యంగా ట్యాక్సేషన్, అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగాలకు సంబంధించి నూతన నియామకాలు ఆశాజనకంగా ఉన్నాయని సదరు సర్వేలో తేలింది. ఈ ఏడాది కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నారు. జీఎస్‌టీ కార్యకలాపాలు విస్తృతం కావడం, ఇతర నూతన ఆర్థిక విధానాల కారణంగా ఫైనాన్స్, అకౌంటింగ్ రంగాల్లో దాదాపు 80 వేల నుంచి 90 వేల ఉద్యోగాలు లభిస్తాయని ఈ రంగాల్లోని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### రిటైల్.. ఎవర్‌గ్రీన్

నియామకాల పరంగా గత అయిదారేళ్లుగా ఎవర్ గ్రీన్ రంగం రిటైల్. గతేడాది రిటైల్ రంగంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విభాగాల్లో కలిపి నియామకాల్లో 14 శాతం వృద్ధి నమోదైంది. ఈ-కామర్స్ కార్యకలాపాలు విస్తృతం కావడమే ఇందుకు కారణం. ఈ సంవత్సరం కూడా ఇదే పంథా కొనసాగే అవకాశముందని అంచనా. ముఖ్యంగా ఇప్పటికే అమెజాన్ వంటి ఈకామర్స్ సంస్థలు వేల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటిస్తున్నాయి. రీటైల్, ఈ-కామర్స్ రంగాల్లో మొత్తంగా దాదాపు లక్షన్నర కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి.

### ఎమర్జింగ్ ఎడ్యుకేషన్

గతేడాది నియామకాల్లో టాప్-5 జాబితాలో నిలిచిన రంగం.. ఎడ్యుకేషన్, టీచింగ్, ట్రైనింగ్. గత సంవత్సరం ఈ రంగంలో దాదాపు 80 వేల ఉద్యోగాలు లభించాయి. 2020లో ఈ సంఖ్య కొంత పెరిగే అవకాశం కూడా ఉంది. టీచింగ్ అండ్ లెర్నింగ్ విభాగంలో వందల సంఖ్యలో కొత్త ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం.. అదే సమయంలో విద్యార్థులు కూడా ఈ-లెర్నింగ్ వైపు దృష్టిసారిస్తుండటంతో ఈ రంగం విస్తరిస్తోంది. దాంతో ఈ రంగంలో కొత్త నియామకాలు జరుగుతున్నాయి. 2020లో ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో కలిపి దాదాపు 1.2 లక్షల నియామకాలు జరిగే అవకాశముందని అంచనా.

### భేషుగ్గా బీపీఓ

తాజా సర్వే అంచనాల ప్రకారం-టాప్-5 రిక్రూటర్స్ జాబితాలో నిలిచిన మరో విభాగం బీపీఓ/ఐటీఈఎస్. ఔట్‌సోర్సింగ్ కార్యకలాపాలు 50 బిలియన్ డాలర్లకు చేరుకోవడం.. ఫలితంగా 2019లో ఈ విభాగాల్లో దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు లభించాయి. ఇదే విధంగా 2020లోనూ కార్యకలాపాలు సాగుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి అనుగుణంగా ఐటీఈఎస్‌లో దాదాపు 1.05లక్షల కొత్త నియామకాలు జరగనున్నాయి.

### ఆర్థిక మందగమనం

గతేడాది ఆర్థిక మందగమన పరిస్థితుల కారణంగా నాలుగు రంగాల్లో మాత్రం నియామకాల పరంగా ప్రతికూల పరిస్థితులు కనిపించాయి. అవి..

- ఆటో/ఆటో అనుబంధ పరిశ్రమ — 11 శాతం తగ్గుదల
- హోటల్స్/రెస్టారెంట్స్/ఎయిర్‌లైన్స్/ట్రావెల్ — 9 శాతం తగ్గుదల
- బ్యాంకింగ్/ ఫైనాన్షియల్ సర్వీసెస్/ బ్రోకింగ్ — 7 శాతం తగ్గుదల
- ఆయిల్ అండ్ గ్యాస్/పవర్/ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/ఎనర్జీ — 4 శాతం తగ్గుదల

గతేదాది ఆటోమొబైల్ రంగంలో నెలకొన్న సంక్షోభం, అదే విధంగా బీఎఫ్ఎస్ఐ రంగంలో ఆటుపోట్లే ఇందుకు కారణమని అధ్యయనంలో తేలింది. కానీ.. ఈ సంవత్సరం ఇవి మళ్లీ పుంజుకుంటాయని.. నియామకాలు ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నారు.

### బీఎఫ్ఎస్ఐ దూకుడు

ఈ ఏడాది బీఎఫ్ఎస్ఐ రంగంలో దాదాపు 60 వేల కొత్త ఉద్యోగాలు లభించనున్నట్లు తాజా సర్వే పేర్కొంది. అలాగే ఆటోమొబైల్ రంగం 2020-21 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తిరిగి పుంజుకుంటుందని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ పేర్కొంది. ముఖ్యంగా బీఎస్-6 ప్రమాణాలు పాటించాలనే ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో.. బీటెక్ మెకానికల్, ఆటోమొబైల్ అభ్యర్థులతోపాటు డిప్లొమా, ఐటీఐ విద్యార్థులకూ అవకాశాలు లభిస్తాయని తెలిపింది. కొత్తగా 15 శాతం నుంచి 20 శాతం మేరకు నూతన నియామకాలు జరుగుతాయని అంచనా.

### మెరుగైన హాస్పిటాలిటీ

గతేడాది హోటల్స్, రెస్టారెంట్స్, ట్రావెల్ రంగాల్లో నియామకాల్లో ప్రతికూల ధోరణి కనిపించింది. కాని 2020లో మాత్రం భారీ సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. హాస్పిటాలిటీ రంగంలో మొత్తం 13.45 మిలియన్ల కొత్త ఉద్యోగాలు లభిస్తాయని.. ఇందులో రెస్టారెంట్స్‌లో 10.4 మిలియన్లు, హోటల్స్‌లో 2.3 మిలియన్లు, ట్రావెల్ ఏజెంట్స్/టూర్ ఆపరేటర్స్ విభాగంలో 0.6 మిలియన్ల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఐబీఈఎఫ్ సంస్థ అంచనా.

### స్థూలంగా.. ఆశాజనకం

ఆయా సంస్థలు చేసిన అధ్యయనాలు, గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ఏడాది నియామక పరిస్థితులు స్థూలంగా ఆశాజనకంగానే ఉండనున్నాయి. యువత తాము చదువుతున్న కోర్సుకు సంబంధించిన రంగంలో తాజా టెక్నాలజీపై అవగాహనతోపాటు, సదరు నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. అప్పుడే అవకాశాలు అందుకునే ఆస్కారం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

### కొత్త ఉద్యోగాలు ఖాయం

"ఈ ఏడాది ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ముఖ్యంగా ఏఐఎంఎల్, ఐఓటీ విభాగాల్లో దాదాపు రెండు లక్షల నియామకాలు జరిగే అవకాశం ఉంది. విద్యార్థులు దీనికి అనుగుణంగా సంబంధిత నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి.

**-బి.భానుమూర్తి**, సీఓఓ, విప్రో

### పురోగమన బాటలో

"గత రెండేళ్లుగా సంక్షోభంలో ఉన్న ఆటోమోటివ్స్ రంగం ఈ ఏడాది కొంత పుంజుకునే అవకాశముంది. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వాహనాల తయారీ పెరుగుతుండటం, మరోవైపు బీఎస్-6 ప్రమాణాలు తప్పనిసరికావడం వల్ల ఈ రంగంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. భారీ స్థాయిలో కాకున్నా.. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఆటోమొబైల్ రంగంలో నియామకాలు పురోగమన బాటలో ఉంటాయనడంలో సందేహం లేదు.

**– అలోక్ రే**, అసిస్టెంట్ డైరెక్టర్, ఆపరేషన్స్- ఎస్ఎంఈవీ



### అంచనాలన్నీ ఆశాజనకంగానే

పలు ఇతర సంస్థల నిర్వహించిన సర్వేల్లోనూ హైరింగ్ ట్రెండ్స్ ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఐటీ, బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, రిటైల్, ఎఫ్ఎంసీజీలు.. ఈ ఏడాది టాప్-5లో నిలిచే అవకాశముందని ఎన్ఎస్‌డీసీ, మెహైరింగ్ క్లబ్ అండ్ సర్కారీ నౌకరీ.ఇన్ఫో సంస్థల అంచనా. ఈ సర్వే అంచనాల ప్రకారం-ఈ-కామర్స్, రిటెయిల్‌లో 1.12 లక్షల ఉద్యోగాలు; ఐటీ-ఐటీఈఎస్‌లో 1.05 లక్షల ఉద్యోగాలు, ఎఫ్ఎంసీజీలో 87,500 ఉద్యోగాలు, ఉత్పత్తి రంగంలో 68,900 ఉద్యోగాలు, బీఎఫ్ఎస్ఐ సెగ్మెంట్‌లో 60 వేల ఉద్యోగాలు, హెల్త్‌కేర్ విభాగంలో 98 వేల ఉద్యోగాలు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం నియామకాల్లో 8శాతం వృద్ధి నమోదవుతుందని పేర్కొంది.

### ఉద్యోగ సమాచారం

#### డబ్ల్యూసీడబ్ల్యూ-10

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన విమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ (డబ్ల్యూసీడబ్ల్యూ) విభాగం-శ్రీకాకుళం ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** కేస్ వర్కర్-3, పారా మెడికల్ పర్సనల్-2, ఐటీ స్టాఫ్-2, మల్టీపర్పస్ హెల్పర్-1,సెక్యూరిటీ గార్డ్-2.
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:**ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 12, 2020
- **వెబ్‌సైట్:** https://wdcw.ap.gov.in

#### సెట్స్-8

చెన్నైలోని సొసైటీ ఫర్ ఎలక్ట్రానిక్ ట్రాన్సాక్షన్స్ అండ్ సెక్యూరిటీ (సెట్స్).. ఒప్పంద ప్రాతిపదికన 8 ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 19, 2020
- **వెబ్‌సైట్:** www.setsindia.in


బ్యాంక్స్ ప్రత్యేకం

✦ స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్, ఆన్‌లైన్ టెస్టులు మోడల్ పేపర్స్, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్ గైడెన్స్ మొదలైనవి.

విద్య, ఉద్యోగ సమాచారం కోసం

WWW.SAKSHIEDUCATION.COM

SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...

10th Class

SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS

PHYSICS


# ఉద్యోగాల గేట్‌వే

గేట్.. ఐఐటీలు, నిట్‌లు వంటి ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ స్థాయి పరీక్ష! కానీ, మరే ఇతర ఆప్టిట్యూడ్ టెస్టుకు లేని ప్రత్యేకత దీని సొంతం!! గేట్ కేవలం ఉన్నత విద్యకే కాకుండా.. ఉన్నతస్థాయి ఉద్యోగాలకూ బాటలు వేస్తుంది. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూలు) గేట్ స్కోరు ఆధారంగా ఎంట్రీ లెవల్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. ప్రస్తుతం పలు పీఎస్‌యూల్లో దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉపయోగపడేలా పీఎస్‌యూల నియామక ప్రక్రియ, అర్హతలు, ప్రిపరేషన్ విధానంపై ప్రత్యేక కథనం..



## పీఎస్‌యూ జాబ్స్

- » గేట్ స్కోర్ ఆధారంగా మలిదశకు ఆహ్వానిస్తున్న పీఎస్‌యూలు
- » మలిదశ ఎంపిక ప్రక్రియలో జీడీ, ఇంటర్వ్యూలకు వెయిటేజీ
- » ఎంపికైతే ఉన్నత ఉద్యోగం, ఆకర్షణీయ వేతనం ఖాయం

గేట్ స్కోరు ఆధారంగా పీఎస్‌యూలు గ్రాడ్యుయేట్, ట్రైనీ ఇంజనీర్స్‌తోపాటు పలు ఎంట్రీ లెవల్ పోస్టులను భర్తీ చేస్తున్నాయి. కొలువుల భర్తీకి సంబంధించి పీఎస్‌యూలు ప్రత్యేక నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. వీటిలో అత్యధికం గేట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి. అధిక శాతం పీఎస్‌యూలు నియామకాల పరంగా తాజా గేట్ స్కోరును పరిగణలోకి తీసుకుంటుండగా.. మరికొన్ని గతేడాది స్కోరును కూడా అనుమతిస్తున్నాయి.

### కటాఫ్ స్కోరు

పీఎస్‌యూల్లో కొలువులు దక్కించుకొనే క్రమంలో అభ్యర్థులు ముందుగా గేట్‌లో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించాల్సి ఉంటుంది. అత్యధిక పీఎస్‌యూలు గేట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థుల జాబితా రూపొందిస్తున్నాయి. హరియాణా పవర్ యుటిలిటీస్ వంటి కంపెనీలు గేట్ స్కోరు ఆధారంగా నేరుగా నియామకాలు జరుపుతున్నాయి.

### జీడీ/ఇంటర్వ్యూ

పీఎస్‌యూలు గేట్ స్కోర్‌తోపాటు గ్రూప్ డిస్కషన్(జీడీ), ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలను ఖరారు చేస్తున్నాయి. మొదట దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను గేట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తున్నాయి. ఆ తర్వాతి దశలో జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. వీటికి తుది జాబితా ఎంపికలో నిర్దేశిత వెయిటేజీ లభిస్తోంది. అలా గేట్ స్కోర్‌తోపాటు మలిదశలోనూ ప్రతిభ చూపిన వారికి ఆఫర్ లెటర్ అందుతోంది.

### 80 శాతం వెయిటేజీ

పీఎస్‌యూలు(అధిక శాతం) గేట్ స్కోర్‌కు 80-85 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. తర్వాత దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్‌కు గరిష్ఠంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు పది శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. వెయిటేజీల పరంగా పీఎస్‌యూల మధ్య వ్యత్యాసాలున్నాయి.

### గ్రూప్ డిస్కషన్

పీఎస్‌యూలు గేట్ కటాఫ్ స్కోరు ఆధారంగా అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్(జీడీ)కు ఆహ్వానిస్తాయి. ఇందులో అభ్యర్థులను ఐదు నుంచి పది మందితో కూడిన బృందాలుగా ఏర్పాటు చేసి.. వారికేదైనా ఒక టాపిక్ ఇచ్చి చర్చించమంటారు. గ్రూప్ డిస్కషన్‌కు 20 నుంచి 30 నిమిషాల సమయం కేటాయిస్తారు.

### పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థి వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. ప్రాజెక్ట్ వర్క్, మినీప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్స్ ద్వారా అభ్యర్థులు ఎలాంటి నైపుణ్యాలు పొందారనే విషయాన్ని పరీక్షిస్తారు. దీంతోపాటు అభ్యర్థుల ఆప్టిట్యూడ్, ఆటిట్యూడ్‌లను అంచనా వేస్తారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగం, సంస్థ పట్ల ఉన్న ఆసక్తి.. దానికి గల కారణాలు.. భవిష్యత్తు లక్ష్యాల కోణంలో ప్రశ్నలు ఎదురవుతాయి. ఈ దశ పూర్తయిన తర్వాత గేట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల వెయిటేజీని క్రోడీకరించి.. తుది జాబితా రూపొందిస్తారు.

### విజయానికి సమకాలీనం

✦ మలిదశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూలో విజయం సాధించాలంటే.. సబ్జెక్ట్ పరిజ్ఞానంతోపాటు సమకాలీన అంశాలపైనా అవగాహన ఉండాలి. కాబట్టి ఔత్సాహికులు బీటెక్ సబ్జెక్టులతోపాటు సమాజాన్ని ప్రభావితం చేస్తున్న నాన్ టెక్నికల్ అంశాలపైనా దృష్టిపెట్టాలి. గేట్ ప్రిపరేషన్ సమయంలోనే కోర్ కాన్సెప్ట్‌లపై పట్టు సాధించడం పీఎస్‌యూ ఇంటర్వ్యూల పరంగా లాభిస్తుంది. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులంతా సదరు పీఎస్‌యూ ప్రొఫైల్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. సంస్థ ఏయే రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుంది, దాని పనితీరు ఎలా ఉందో తెలుసుకోవాలి.

### ఆకర్షణీయ వేతనాలు

పీఎస్‌యూలు గేట్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్నాయి. గెయిల్ వంటి కంపెనీల్లో కనీస వేతనం రూ. 60 వేల నుంచి ప్రారంభమవుతుంది. కొన్ని పీఎస్‌యూలు.. సర్వీస్ బాండ్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఉద్యోగాన్ని ఖరారు చేసుకున్న అభ్యర్థులు నిర్దిష్ట కాలం పాటు సంస్థలో పనిచేస్తామని పేర్కొంటూ.. అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వ్యవధి రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకు ఉంటోంది.

### నోటిఫికేషన్స్‌పై దృష్టి

పీఎస్‌యూలు అభ్యర్థుల ప్రయోజనార్థం నియామక ప్రక్రియ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తున్నాయి. కొన్ని పీఎస్‌యూలు సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో నోటిఫికేషన్లు విడుదల చేసి.. షెడ్యూల్, ఎంపిక ప్రక్రియ వివరాలను అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు జనవరి, ఫిబ్రవరిల్లో నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. పీఎస్‌యూ ఉద్యోగాల ఔత్సాహికులు గేట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా పీఎస్‌యూల నోటిఫికేషన్లకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.

### అర్హత పరీక్షపైనా

పీఎస్‌యూ ఔత్సాహికులు కేవలం గేట్‌పైనే దృష్టిపెడితే సరిపోదు. అర్హత పరీక్ష(బీటెక్)లో నిర్దిష్ట పర్సంటేజీ సాధించటంపైనా దృష్టిసారించాలి. ఎందుకంటే.. పీఎస్‌యూలు అర్హత పరీక్షలో కనీసం 65శాతం మార్కులు, 27ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని అమలుచేస్తున్నాయి. ఈ విషయంలో రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు మార్కులతోపాటు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు లభిస్తాయి.

### దరఖాస్తుల ప్రక్రియ

గేట్ 2020కి సంబంధించి ఇప్పటికే కొన్ని పీఎస్‌యూలు దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేశాయి. మరికొన్ని కంపెనీల దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. వాటి వివరాలు...

- **గెయిల్:** దరఖాస్తుకు చివరితేదీ మార్చి 3.
- **ఎన్‌పీసీఎల్:** దరఖాస్తుకు చివరితేదీ ఏప్రిల్ 9.
- **ఓఎన్‌జీసీ:** ఏప్రిల్ చివరి వారం
- **ఐఓసీఎల్:** మార్చి రెండోవారం

### గత కటాఫ్ మార్కులు

అందుబాటులో ఉన్న ఖాళీలు.. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పీఎస్‌యూలు కటాఫ్‌ను నిర్ణయిస్తున్నాయి. కొన్నేళ్లుగా పీఎస్‌యూ ఔత్సాహికుల సంఖ్య పెరుగుతోంది. దానికి అనుగుణంగా గేట్ స్కోర్ కటాఫ్ కూడా పెరుగుతూ వస్తోంది. గేట్-2019కు సంబంధించి ప్రముఖ పీఎస్‌యూల కటాఫ్ మార్కులు/పర్సంటైల్ వివరాలు..

#### ఎన్‌పీసీఐఎల్

- **మెకానికల్:** జనరల్ 836, ఓబీసీ 786, ఎస్సీ 648, ఎస్టీ 561, పీడబ్ల్యూడీ 561.
- **కెమికల్:** జనరల్ 790, ఓబీసీ 694, ఎస్సీ 585, ఎస్టీ 512, పీడబ్ల్యూడీ 512.
- **ఎలక్ట్రికల్:** జనరల్ 819, ఓబీసీ 738, ఎస్సీ 584, ఎస్టీ 584, పీడబ్ల్యూడీ 584.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్:** జనరల్ 853, ఓబీసీ 762, ఎస్సీ 581, ఎస్టీ 581, పీడబ్ల్యూడీ 581.
- **కంప్యూటర్ సైన్స్:** జనరల్ 876, ఓబీసీ 810, ఎస్సీ 709, ఎస్టీ 715, పీడబ్ల్యూడీ 709.

#### ఎన్‌టీపీసీ

- **ఎలక్ట్రికల్:** జనరల్ 68.33, ఓబీసీ 63, ఎస్సీ 51.67, ఎస్టీ 45.33, పీడబ్ల్యూడీ 26.33.
- **మెకానికల్:** జనరల్ 77.28, ఓబీసీ 73.24, ఎస్సీ 63.54, ఎస్టీ 55.72, పీడబ్ల్యూడీ 35.85.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్:** జనరల్ 51.67, ఓబీసీ 46.67, ఎస్సీ 33.67, ఎస్టీ 33, పీడబ్ల్యూడీ 22.33.
- **మైనింగ్:** జనరల్ 63, ఓబీసీ 53.33, ఎస్సీ 38.67, ఎస్టీ 30.67.

#### ఓఎన్‌జీసీ

- **జియాలజిస్ట్:** జనరల్ 498, ఓబీసీ 220, ఎస్సీ 274, ఎస్టీ 205.
- **జియోఫిజిసిస్టు:** సర్ఫేజ్- జనరల్ 636, ఓబీసీ 474, ఎస్సీ 328, ఎస్టీ 198. వెల్స్-జనరల్ 593, ఓబీసీ 423, ఎస్సీ 361, ఎస్టీ 215.
- **కెమిస్టు:** జనరల్ 615, ఓబీసీ 450, ఎస్సీ 381, ఎస్టీ 248.

#### సెయిల్

- **కెమికల్:** జనరల్ 73.74, ఓబీసీ 69.37, ఎస్సీ 61.54, ఎస్టీ 61.59.
- **మెకానికల్:** జనరల్ 83.53, ఓబీసీ 79.01, ఎస్సీ 70.84, ఎస్టీ 65.53.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్:** జనరల్ 73.72, ఓబీసీ 66.5, ఎస్సీ 58.24, ఎస్టీ 55.98.
- **మెటలర్జీ:** జనరల్ 68.33, ఓబీసీ 60.08, ఎస్సీ 55.04, ఎస్టీ 47.35.
- **మైనింగ్:** జనరల్ 80.09, ఓబీసీ 76.46, ఎస్సీ 67.98, ఎస్టీ 66.

#### ఈసీఐఎల్

- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్:** జనరల్ 45.67, ఓబీసీ 35, ఎస్సీ 36.67, ఎస్టీ 39.67.
- **కంప్యూటర్స్:** జనరల్ 52.67, ఓబీసీ 32.67, ఎస్సీ 43.67, ఎస్టీ 37.67.
- **మెకానికల్:** జనరల్ 80.65, ఓబీసీ 76.07, ఎస్సీ 74.59, ఎస్టీ 66.16.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
10-2-2020

‘మా కల నిజమైంది. గత రెండేళ్లుగా మేం చేసిన కృషి ఫలితాన్నిచ్చింది. నేను క్రీజులోకి వెళ్లిన సమయంలో మాకో మంచి భాగస్వామ్యం అవసరముంది. నా సహచరులకు అదే చెప్పా. ఎట్టి పరిస్థితుల్లోనూ వికెట్ ఇవ్వొద్దని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే భారత్ అంత సులభంగా మమ్మల్ని గెలవనివ్వదనే విషయం మాకు తెలుసు. కఠినమైన ఛేదనే అయినా సాధించాం. కోచింగ్ బృందానికి ఎలా కృతజ్ఞత తెలపాలో అర్థం కావట్లేదు. మా బౌలర్లలో కొంత మంది ఉద్వేగంలో ఉన్నారు. విజయానంతరం మైదానంలో మా ఆటగాళ్ల ప్రవర్తన అలా ఉండాల్సింది కాదు. భారత ఆటగాళ్లను ప్రత్యేకంగా అభినందించాలి. టోర్నీ ఆసాంతం వారు అద్భుతంగా ఆడారు. మా విజయాన్ని కోరుకున్న వారందరికీ కృతజ్ఞతలు. ఇది మాకు ఆరంభం మాత్రమే. తర్వాత కూడా ఈ గెలుపు మాకు స్ఫూర్తిగా నిలుస్తుంది’. –అక్బర్ అలీ, బంగ్లాదేశ్ కెప్టెన్





## భారత్‌కు తొలి ఓటమి

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ హాకీ లీగ్‌లో భారత పురుషుల జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ప్రపంచ చాంపియన్ బెల్జియం జట్టుతో ఆదివారం జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున వివేక్ సాగర్ ప్రసాద్ (15వ ని.లో), అమిత్ రోహిదాస్ (17వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. బెల్జియం జట్టు తరఫున మాక్సిమి ప్లెనెవాక్స్ (17వ, 26వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... అలెగ్జాండర్ హెండ్రిక్స్ (3వ ని.లో) మరో గోల్ చేశాడు. మొత్తం తొమ్మిది జట్లు పాల్గొంటున్న ప్రొ హాకీ లీగ్‌లో రెండు రౌండ్‌లు ముగిశాక ప్రస్తుతం బెల్జియం 14 పాయింట్లతో అగ్రస్థానంలో, భారత్ ఎనిమిది పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. మూడో రౌండ్‌లో భాగంగా భువనేశ్వర్‌లోనే ఆస్ట్రేలియాతో భారత్ ఈనెల 21, 22 తేదీల్లో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది.

## ముక్కోణపు టి20 టోర్నీ ఫైనల్లో భారత మహిళల జట్టు

మెల్‌బోర్న్: మహిళల టి20 ముక్కోణపు క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరింది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 16 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత మూడు జట్లూ నాలుగేసి పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఆస్ట్రేలియా (0.23), భారత్ (–0.07) ఈనెల 11న జరిగే టైటిల్ పోరుకు అర్హత సాధించగా... ఇంగ్లండ్ (–0.16) జట్టు నిష్క్రమించింది.




## పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డు

టోరన్ (పోలాండ్): ఒర్లెన్ కోపెర్నికస్ కప్–2020 వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ మీట్‌లో స్వీడన్‌కు చెందిన అర్మాండ్ డుప్లాన్‌టిస్ పోల్‌వాల్ట్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. 20 ఏళ్ల డుప్లాన్‌టిస్ 6.17 మీటర్ల ఎత్తుకు ఎగిరి... 2014లో రెనాడ్ లావిలెని (ఫ్రాన్స్–6.16 మీటర్లు) నెలకొల్పిన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు.

కుర్రాళ్ల కప్‌లో యువ భారత్ డిఫెండింగ్ చాంపియన్. అన్నట్లుగానే ఈ హోదాకు న్యాయం చేసింది. అందరినీ ఓడించింది. ఆఖరిదాకా అజేయంగా నిలిచింది. చివరకు టైటిల్ పోరులో అనూహ్యంగా ఓడింది. ఐదోసారి విజేతగా నిలవాల్సిన జట్టు... తొలిసారి ఫైనల్ చేరిన బంగ్లాదేశ్ చేతిలో పరాజయం పాలైంది. ఇప్పుడు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. బంగ్లాదేశ్ కొత్త చాంపియన్‌గా అవతరించింది. సీనియర్, జూనియర్, పొట్టి, వన్డే ఇలా ఏ ఫార్మాట్ అయినా బంగ్లాదేశ్ ఐసీసీ ప్రపంచకప్ నెగ్గడం ఇదే తొలిసారి.

# అయ్యో... ఆఖరికి ఓడింది

## టైటిల్ పోరులో యువ భారత్ ఓటమి

### అండర్–19 ప్రపంచకప్ విజేత బంగ్లాదేశ్

‘డక్‌వర్త్’ పద్ధతిలో మూడు వికెట్లతో విజయం ● యశస్వి పోరాటం వృథా

ఫైనల్ రోజు మాకు కలిసిరాలేదు. మా బౌలర్లు చక్కగా పోరాడారు. తక్కువ లక్ష్యమే అయినప్పటికీ చివరి వరకు చక్కగా బంగ్లాను నియంత్రించారు. బ్యాటింగ్‌లో మాకు మంచి ఆరంభం లభించింది. కానీ ఉపయోగించుకోలేకపోయాం. 210–220 పరుగులు చేయాల్సింది. బ్యాటింగ్ సరిగా చేయలేకపోవడం వల్లే మేం టైటిల్ చేజార్చుకున్నాం.
–ప్రియమ్ గార్గ్, భారత కెప్టెన్



మ్యాన్ ఆఫ్ ద సిరీస్ యశస్వి జైస్వాల్

యశస్వి ఈ టోర్నీలో మొత్తం 6 మ్యాచ్‌లు ఆడి 400 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అతను మూడు వికెట్లు కూడా తీశాడు. భారత్‌కే చెందిన రవి బిష్ణోయ్ (6 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు) ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

పొచెఫ్‌స్ట్రూమ్: బంగ్లాను బేబీ అంటే కుదరదేమో...! ప్రత్యేకించి ఈ ప్రపంచకప్‌లో! అందరినీ ఓడించి ఫైనల్ చేరిన బంగ్లాదేశ్ అమీతుమీలో నాలుగుసార్లు ప్రపంచకప్ విజేత, డిఫెండింగ్ చాంపియన్ భారత్‌ను కంగుతినిపించింది. అజేయంగా సాగిన యువ భారత్ ఆట అంతిమంగా పరాజయంతో ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 3 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 47.2 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (121 బంతుల్లో 88; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్ అవిషేక్ దాస్ 3 వికెట్లు తీశాడు. తర్వాత కప్ కొట్టేందుకు 178 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 42.1 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులు చేసి గెలిచింది. 41వ ఓవర్లో వర్షం రావడంతో కొంతసేపు మ్యాచ్ ఆగిపోయింది. అప్పటికి బంగ్లాదేశ్ 163/7 స్కోరుతో ఉంది. వర్షం తగ్గుముఖం పట్టాక బంగ్లాదేశ్ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 46 ఓవర్లలో 170 పరుగులుగా కుదించారు. కెప్టెన్ అక్బర్ అలీ (77 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలబడి గెలిపించాడు. రవి బిష్ణోయ్ 4 వికెట్లు తీశాడు. అక్బర్ అలీకి ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’, యశస్వి జైస్వాల్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద సిరీస్’ అవార్డులు లభించాయి.

**ఆడింది యశస్వి ఒక్కడే...**

టాస్ నెగ్గిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్‌కు మొగ్గు చూపింది. దీంతో భారత్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టిన యశస్వి జైస్వాల్, దివ్యాంశ్ సక్సేనా ఓపెనింగ్ జోడీ విఫలమైంది. స్కోరు పదైనా కాకముందే సక్సేనా (2)ను అవిషేక్ ఔట్ చేశాడు. అయితే హైదరాబాద్ కుర్రాడు ఠాకూర్ తిలక్ వర్మ (65 బంతుల్లో 38; 3 ఫోర్లు)తో కలిసి యశస్వి ఇన్నింగ్స్ నడిపించాడు. ఈ జోడీ సఫలమైతే అయింది కానీ పరుగుల రాకే మందగమనంగా సాగింది. దీంతో జట్టు స్కోరు 50 చేసేందుకే 16.1 ఓవర్లు అవసరమైంది. ఏదేమైనా బంగ్లా బౌలింగ్‌ను చిత్రెత్తిస్తూ నిదానంగా సాగిన ఈ భాగస్వామ్యం బలపడింది. యశస్వి 89 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. జట్టు స్కోరు కూడా 29వ ఓవర్లో వందకు చేరింది. కాసేపటికే తిలక్‌వర్మ ఆటను తన్జీమ్ హసన్ షకీబ్ ముగించడంతో 94 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కెప్టెన్ ప్రియమ్ గార్గ్ (7) విఫలమయ్యాడు.

**జైస్వాల్ ఔటయ్యాక ఆలౌట్...**

ధ్రువ్ జురెల్ (38 బంతుల్లో 22; 1 ఫోర్)ను కలుపుకొని చక్కని పోరాటం చేశాడు జైస్వాల్. జాగ్రత్తగా ఆడటంతో స్కోరు జోరందుకోలేకపోయింది. 39వ ఓవర్లో భారత్ 150 పరుగులు దాటింది. ఆ తర్వాత యశస్వి ఔటయ్యాడు. దీంతోపాటే భారత్ ఇన్నింగ్స్ కూలడం కూడా మొదలైంది. సిద్ధేశ్ వీర్ (0), జురెల్, అథర్వ అంకోలేకర్ (3), రవి బిష్ణోయ్ (2), సుశాంత్ మిశ్రా (3), కార్తీక్ త్యాగి (0) స్వల్ప వ్యవధిలోనే వికెట్లను సమర్పించుకోవడంతో నిర్ణీత ఓవర్లు ఆడకుండానే భారత్ 47.2 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది. చిత్రంగా 21 పరుగుల తేడాలో 7 వికెట్లను కోల్పోయింది. షరీఫుల్ ఇస్లామ్ (2/31), తన్జీమ్ హసన్ షకీబ్ (2/28) భారత్ ఇన్నింగ్స్‌ను దెబ్బతీశారు.

**ఆశలు రేపిన బిష్ణోయ్...**

బంగ్లా ఈ మెగా ఈవెంట్‌లో ఆడిన జోరును చూస్తే ఇది చాలా సునాయాస లక్ష్యం. అందుకు తగ్గట్లే ఓపెనర్లు పర్వేజ్ (79 బంతుల్లో 47; 7 ఫోర్లు), హసన్ షకీబ్ (17) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత బౌలర్ రవి బిష్ణోయ్ స్వల్ప వ్యవధిలో చకచకా 4 వికెట్లు తీసి కుర్రాళ్లలో ఆశలు పెంచాడు. పర్వేజ్ రిటైర్డ్‌హర్ట్ అవ్వగా... తన్జీద్, మహ్మదుల్ (8), తౌహిద్ (0), షహదత్ (1)లను 3 పరుగుల వ్యవధిలోనే అవుట్ చేశాడు. 65 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. షమీమ్ (7), తర్వాత కాసేపటికి అవిషేక్ దాస్ (5) కూడా అవుట్ కావడంతో 102 పరుగుల వద్ద ఆరో వికెట్‌ను కోల్పోయింది. ఈ దశలో ఓపెనర్ పర్వేజ్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగి మెరుపులు మెరిపించాడు. ఇతన్ని యశస్వి అవుట్ చేయగా... రకీబుల్ (9 నాటౌట్) అండతో కెప్టెన్ అక్బర్ అలీ లక్ష్యాన్ని పూర్తి చేశాడు. సుశాంత్ మిశ్రాకు 2 వికెట్లు దక్కాయి. భారత బౌలర్లు ఏకంగా 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం గమనార్హం.


బంగ్లాదేశ్ విజయ సంబరం

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) తన్జీద్ (బి) షరీఫుల్ 88; దివ్యాంశ్ సక్సేనా (సి) మహ్మదుల్ (బి) అవిషేక్ దాస్ 2; తిలక్‌వర్మ (సి) షరీఫుల్ (బి) షకీబ్ 38; ప్రియమ్ గార్గ్ (సి) తన్జీద్ (బి) రకీబుల్ 7; ధ్రువ్ జురెల్ (రనౌట్) 22; సిద్ధేశ్ వీర్ ఎల్బీడబ్ల్యు (బి) షరీఫుల్ 0; అథర్వ అంకోలేకర్ (బి) అవిషేక్ దాస్ 3; రవి బిష్ణోయ్ (రనౌట్) 2; సుశాంత్ (సి) షరీఫుల్ (బి) షకీబ్ 3; కార్తీక్ త్యాగి (సి) అక్బర్ అలీ (బి) అవిషేక్ దాస్ 0; ఆకాశ్ సింగ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (47.2 ఓవర్లలో ఆలౌట్) 177.**

**వికెట్ల పతనం:** 1–9, 2–103, 3–114, 4–156, 5–156, 6–168, 7–170, 8–170, 9–172, 10–177. **బౌలింగ్:** షరీఫుల్ 10–1–31–2, తన్జీమ్ షకీబ్ 8.2–2–28–2, అవిషేక్ దాస్ 9–0–40–3, షమీమ్ 6–0–36–0, రకీబుల్ 10–1–29–1, తౌహిద్ 4–0–12–0

**బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** పర్వేజ్ (సి) ఆకాశ్ (బి) యశస్వి 47; తన్జీద్ (సి) కార్తీక్ త్యాగి (బి) రవి బిష్ణోయ్ 17; మహ్మదుల్ హసన్ జాయ్ (బి) రవి బిష్ణోయ్ 8; తౌహిద్ ఎల్బీడబ్ల్యు (బి) రవి బిష్ణోయ్ 0; షహదత్ (స్టంప్డ్) జురెల్ (బి) రవి బిష్ణోయ్ 1; అక్బర్ అలీ (నాటౌట్) 43; షమీమ్ (సి) యశస్వి (బి) సుశాంత్ మిశ్రా 7; అవిషేక్ దాస్ (సి) కార్తీక్ త్యాగి (బి) సుశాంత్ మిశ్రా 5; రకీబుల్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 33; **మొత్తం (42.1 ఓవర్లలో 7 వికెట్లకు) 170.**

**వికెట్ల పతనం:** 1–50, 2–62, 3–62, 4–65, 5–85, 6–102, 7–143 **బౌలింగ్:** కార్తీక్ త్యాగి 10–2–33–0, సుశాంత్ మిశ్రా 7–0–25–2, ఆకాశ్ సింగ్ 8–1–33–0, రవి బిష్ణోయ్ 10–3–30–4, అథర్వ 4.1–0–22–0, యశస్వి జైస్వాల్ 3–0–15–1.



## క్రీజ్‌లోకి మళ్లీ ‘మాస్టర్’

### దిగ్గజాలు కలిసిన వేళ... కన్నుల పండువగా చారిటీ మ్యాచ్

మెల్‌బోర్న్: క్రికెట్ ‘దేవుడు’ సచిన్ టెండూల్కర్ మళ్లీ క్రీజులోకి దిగాడు. తనను క్రికెట్‌లో రారాజుగా చేసిన బ్యాటింగ్‌తో మళ్లీ మెరిశాడు. ‘కార్చిచ్చు’తో మసి అయిన ఆస్ట్రేలియాలో తన పెద్ద మనసు చాటుకున్నాడు. విరాళాలు పోగు చేసే సత్కార్యంలో తన బ్యాటింగ్ ఆట చూపెట్టాడు. బ్యాటింగ్ ఎవరెస్ట్, క్రికెట్ గ్రేటెస్ట్‌కు బౌలింగ్ చేసే అదృష్టం ఆస్ట్రేలియన్ మహిళల జట్టు సూపర్‌స్టార్ ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ దక్కించుకుంది. ఈ ‘మెన్ ఇన్ బ్లూ’ ఆటగాడు కొంగొత్త డ్రెస్సింగ్‌తో బరిలోకి దిగాడు. పసుపు రంగు హెల్మెట్ ధరించి, అల్ట్రాలైట్ కూకాబుర్రా లోగో (సాధారణంగా ఎంఆర్‌ఎఫ్ లేదంటే అడిడాస్ లోగో) ఉన్న బ్యాట్‌తో ఐదు నిమిషాలు సచిన్ బ్యాటింగ్ చేశాడు. షార్ట్ ఫైన్ లెగ్, డీప్ స్క్వేర్‌లో తనదైన ట్రేడ్‌మార్క్ షాట్లతో అక్కడి ప్రేక్షకుల్ని టెండూల్కర్ అలరించాడు. నిజానికి కార్చిచ్చు విరాళాల సేకరణలో పాలుపంచుకునేందుకు అక్కడికి వెళ్లాడు. కానీ 10 ఓవర్ల ఆటలో మాత్రం ఆడలేదు. అయితే మహిళా స్టార్ పెర్రీ తన బౌలింగ్‌ను ఎదుర్కోవాలని సామాజిక సైట్‌లో వీడియో మెసేజ్ చేయగా... సచిన్ సరేనంటూ ఆమె ముచ్చట తీర్చాడు. తన క్రికెట్ అభిమానుల్ని అలరించాడు. అంతకుముందు జరిగిన 10 ఓవర్ల పొట్టి మ్యాచ్‌లో పాంటింగ్ ఎలెవన్ పరుగు తేడాతో గిల్‌క్రిస్ట్ ఎలెవన్‌పై నెగ్గింది. పాంటింగ్ జట్టు 104/5 స్కోరు చేయగా... మన యువరాజ్ సింగ్ (2) ఆడిన గిల్‌క్రిస్ట్ జట్టు 103/6 వద్ద ఆగిపోయింది. లారా, కోట్నీ వాల్ష్, వసీమ్ అక్రమ్, పాంటింగ్, హేడెన్, గిల్‌క్రిస్ట్, వాట్సన్, సైమండ్స్ తదితర క్రికెటర్లు చారిటీ మ్యాచ్‌లో ఉత్సాహంగా ఆడారు. ఈ మ్యాచ్ ద్వారా 77 లక్షల 23 వేల 129 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 36 కోట్ల 85 లక్షలు) విరాళంగా సేకరించామని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. ఈ మొత్తాన్ని కార్చిచ్చు బాధితులకు అందజేస్తామని తెలిపింది.

**ఔరా... లారా...**

క్రికెట్ తెలిసిన వారికి లారా తెలియకుండా ఉండడు. వెస్టిండీస్ క్రికెట్‌లోనే కాదు... ప్రపంచ క్రికెట్‌లోనే అసాధారణ బ్యాటింగ్ మాంత్రికుడు బ్రియాన్ లారా. అతని ఆట, కెరీర్ ఎంతో అద్భుతంగా సాగింది. ఇంకా చెప్పాలంటే అతని రికార్డు (టెస్టుల్లో 400 నాటౌట్) ఇంకా చెక్కు చెదరలేదు. 50 ఓవర్లలోనే 350 లక్ష్యమైనా ఉఫ్‌మని ఊదేస్తున్న ఈ రోజుల్లో... వన్డేల్లోనే డబుల్ సెంచరీల మీద డబుల్ సెంచరీలు బాదుతున్న రోహిత్, పరుగులు పరుగుల్లా కాకుండా వరదలెత్తిస్తున్న విరాట్, విధ్వంసం సృష్టించే వార్నర్‌లాంటి వారంతా ఉన్న నేటి తరం క్రికెట్లో... లారా సంప్రదాయ క్రికెట్‌లో సాధించిన ‘క్వాడ్రపుల్ సెంచరీ’ జోలికి ఎవరూ వెళ్లలేకపోయారు. కానీ లారా మాత్రం తనకు ఏమాత్రం తెలియని టి20 క్రికెట్‌ను అవలీలగా ఆడేస్తానని తన బ్యాట్‌తో అది కూడా 50 ఏళ్ల వయసులో చాటడం గొప్ప విశేషం. ఈ క్రికెట్ చరిత్రకారుడు బుష్‌ఫైర్ (కార్చిర్చు) చారిటీ మ్యాచ్‌లో పాంటింగ్ ఎలెవన్ తరఫున 10 ఓవర్ల క్రికెట్ ఆడాడు. 11 బంతుల్లోనే 30 పరుగులు చేశారు. అతని 3 ఫోర్లు, 2 సిక్సర్లు చూస్తే మాత్రం ఇప్పటికీ అతను తాజాగా ఆడుతున్న క్రికెటర్‌నే గుర్తుచేస్తాయి తప్ప రిటైర్డ్ క్రికెటర్ అని అనిపించదు!

## శుబ్‌మన్ సెంచరీ

### భారత్ ‘ఎ’ 234/1

లింకన్: న్యూజిలాండ్ ‘ఎ’తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత ‘ఎ’ క్రికెట్ జట్టు దీటైన జవాబు ఇచ్చింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ‘ఎ’ తొలి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో వికెట్ నష్టానికి 234 పరుగులు సాధించింది. శుబ్‌మన్ గిల్ (153 బంతుల్లో 107 బ్యాటింగ్; 13 ఫోర్లు, సిక్స్) అజేయ సెంచరీ చేయగా...



ఆంధ్ర క్రికెటర్, కెప్టెన్ హనుమ విహారి (73 బంతుల్లో 59; 9 ఫోర్లు) తొలి వికెట్‌కు గిల్‌తో కలిసి 111 పరుగులు జోడించాడు. ప్రస్తుతం గిల్‌తో కలిసి చతేశ్వర్ పుజారా (99 బంతుల్లో 52 బ్యాటింగ్; 7 ఫోర్లు, సిక్స్) క్రీజులో ఉన్నాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు అజేయంగా 123 పరుగులు జత చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 276/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ ‘ఎ’ 131.5 ఓవర్లలో 9 వికెట్లకు 390 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. డారిల్ మిచెల్ (103 నాటౌట్; 10 ఫోర్లు, సిక్స్) అజేయ సెంచరీ చేశాడు. భారత ‘ఎ’ బౌలర్లలో సిరాజ్, అశ్విన్, అవేశ్ ఖాన్, సందీప్ వారియర్ రెండేసి వికెట్లు తీశారు.



## హంపి పరాజయం హారిక గేమ్ ‘డ్రా’

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. రెండో రౌండ్ గేముల్లో హంపి 34 ఎత్తుల్లో మరియా ముజిచుక్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోగా... నానా జాగ్నిడ్జె (జార్జియా)తో జరిగిన గేమ్‌ను హారిక 31 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో రెండో రౌండ్ తర్వాత హంపి, హారిక ఒక్కో పాయింట్‌తో వరుసగా ఆరు, ఏడు స్థానాల్లో ఉన్నారు.

## బెంగళూరు రాప్టర్స్‌దే పీబీఎల్ టైటిల్

- ఫైనల్లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై 4–2తో విజయం
- సిక్కి రెడ్డికి ‘ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ద లీగ్’ అవార్డు




సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) చరిత్రలో టైటిల్ నిలబెట్టుకున్న తొలి జట్టుగా బెంగళూరు రాప్టర్స్ జట్టు నిలిచింది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం జరిగిన టైటిల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు రాప్టర్స్ జట్టు 4–2తో తొలిసారి ఫైనల్ చేరిన నార్త్ ఈస్టర్న్ వారియర్స్ జట్టును ఓడించింది. తొలి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో తెలుగు తేజం భమిడిపాటి సాయిప్రణీత్ 14–15, 15–9, 15–3తో లీ చెయుక్ యియు (వారియర్స్)పై నెగ్గి బెంగళూరుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో బొదిన్ ఇసారా–లీ యోంగ్ డే (వారియర్స్) జంట 15–11, 13–15, 15–14తో అరుణ్ జార్జి–రియాన్ అగుంగ్ సపుత్రో (బెంగళూరు) జోడీపై గెలిచింది. ఈ మ్యాచ్‌ను వారియర్స్ ‘ట్రంప్’గా ఎంచుకోవడంతో ఆ జట్టు 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ (బెంగళూరు) 15–9, 15–12తో మిచెల్లి లీని ఓడించింది. దాంతో స్కోరు 2–2తో సమమైంది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో చాన్ పెంగ్ సూన్–ఎమ్ హై వన్ (బెంగళూరు) ద్వయం 15–14, 14–15, 15–12తో గారగ కృష్ణప్రసాద్–కిమ్ హా నా (వారియర్స్) జోడీపై నెగ్గింది. ఈ మ్యాచ్‌ను బెంగళూరు ‘ట్రంప్’గా ఎంచుకోవడంతో ఆ జట్టు 4–2తో ఆధిక్యంలోకి వెళ్లి విజయాన్ని ఖాయం చేసుకుంది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్ జట్టు గెలిచినా తుది ఫలితం మారే అవకాశం లేకపోవడంతో దానిని నిర్వహించలేదు.

విజేత బెంగళూరు జట్టుకు ట్రోఫీతోపాటు రూ. 3 కోట్లు ప్రైజ్‌మనీగా లభించాయి. రన్నరప్ నార్త్ ఈస్టర్న్ వారియర్స్ జట్టుకు రూ. కోటీ 50 లక్షలు... సెమీఫైనల్స్‌లో ఓడిన పుణే సెవెన్ ఏసెస్, చెన్నై సూపర్ స్టార్స్ జట్లకు రూ. 75 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ దక్కింది. లీగ్ దశలో నిలకడగా ఆడిన హైదరాబాద్ హంటర్స్ క్రీడాకారిణి నేలకుర్తి సిక్కి రెడ్డికి ‘ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ద లీగ్’ పురస్కారం లభించింది. తై జు యింగ్ ‘ప్లేయర్ ఆఫ్ ద లీగ్’ అవార్డు సొంతం చేసుకుంది. హైదరాబాద్ హంటర్స్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌కు ‘ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద లీగ్’ అవార్డు దక్కింది.


సిక్కి రెడ్డి

## విజయం దిశగా పాకిస్తాన్

### నసీమ్ షా హ్యాట్రిక్



రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇన్నింగ్స్ విజయం దిశగా సాగుతోంది. 212 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 6 వికెట్లకు 126 పరుగులు చేసింది. పాక్ యువ పేస్ బౌలర్ నసీమ్ షా (4/26) ‘హ్యాట్రిక్’తో బంగ్లాదేశ్‌ను హడలెత్తించాడు. ఇన్నింగ్స్ 41వ ఓవర్లో వరుసగా నాలుగు, ఐదు, ఆరు బంతుల్లో నజ్ముల్ హుస్సేన్, తైజుల్ ఇస్లామ్, మహ్మదుల్లాలను నసీమ్ షా అవుట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్ చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన పిన్న వయస్కుడిగా నసీమ్ షా (16 ఏళ్ల 359 రోజులు) రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు బంగ్లాదేశ్ బౌలర్ అలోక్ కపాలి (19 ఏళ్లు; పాక్‌పై 2003లో) పేరిట ఉండేది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 342/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 122.5 ఓవర్లలో 445 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (143) తన వ్యక్తిగత ఓవర్‌నైట్ స్కోరు వద్దే అవుటయ్యాడు. హారిస్ సొహైల్ (75; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో అబూ జాయెద్, రూబెల్ మూడేసి వికెట్లు తీశారు.

## ఇంగ్లండ్ విజయం

### చివరి వన్డేలో దక్షిణాఫ్రికా ఓటమి

జొహన్నెస్‌బర్గ్: బౌలింగ్‌లో ఆదిల్ రషీద్ (3/51)... బ్యాటింగ్‌లో జో డెన్లీ (79 బంతుల్లో 66; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించడంతో... దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సమంగా ముగిసింది. రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 256 పరుగులు సాధించింది. డికాక్ (81 బంతుల్లో 69; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిల్లర్ (69 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిశారు. అనంతరం ఇంగ్లండ్ 43.2 ఓవర్లలో 8 వికెట్లకు 257 పరుగులు చేసి గెలిచింది. బెయిర్‌స్టో (23 బంతుల్లో 43; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రూట్ (52 బంతుల్లో 49; 3 ఫోర్లు) రాణించారు.

epaper.sakshi.com

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 164 ▼ | 40 ▼ |
| 41,142 | 12,098 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,521 | ▼ 52 |
| డోజోన్స్ | 29,103 | ▼ 277 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,467 | ▼ 38 |
| డాక్స్ | 13,514 | ▼ 61 |
| షాంఘై | 2,876 | ▲ 9 |
| నికాయ్ | 23,827 | ▼ 46 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.52 | 72.16 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.72 | 93.95 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.94 | 79.81 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.72 | 66.11 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.93 | 49.10 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.62 | 52.37 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.29 | 19.85 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.97 | 19.98 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.58 | 10.99 |

# మీ 'పన్ను' దారేది?

**ఆదాయపన్ను రేట్లు తగ్గుతాయని ఆశగా ఎదురు చూసిన వారిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నూతన పన్ను రేట్లతో అయోమయంలో పడేశారు. ప్రస్తుత పన్ను విధానం లేదా నూతన పన్ను విధానంలో తమకు అనుకూలమైన విధానంలోనే రిటర్నులు దాఖలు చేసుకోవచ్చని ప్రకటించారు. రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఆదాయపన్నును కొంత మేరకు తగ్గిస్తూ నూతన పన్ను రేట్లను మంత్రి ప్రతిపాదించారు. అంటే ప్రస్తుతమున్న విధానంలోనే కొనసాగడం లేదా నూతన విధానానికి మారడం పన్ను చెల్లింపుదారుల అభీష్టంపైనే ఆధారపడి ఉంటుంది. మరి నూతన పన్ను విధానానికి మారిపోవాలా..? లేక ఇప్పుడున్న విధానంలోనే కొనసాగాలా..? అని ప్రశ్నిస్తే.. అది ఒక్కో వ్యక్తిని బట్టి ఆధారపడి ఉంటుంది. తమ ఆదాయాన్ని బట్టి దీనిపై నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. పాత, కొత్త విధానంలో పన్ను భారంపై అవగాహన కల్పించే ప్రాఫిట్ కథనం ఇది.**



**రూ**.15 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వ్యక్తి నూతన పన్ను విధానంలో రూ.78,000ను ఆదా చేసుకోవచ్చని ఆర్థిక మంత్రి బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు. ఇది నిజమే. కానీ, ఎవరికి ఈ ప్రయోజనం నిజంగా అంటే.. ఎటువంటి మినహాయింపులను క్లెయిమ్ చేసుకోని వారికే నూతన పన్ను విధానంతో ప్రయోజనమని క్లుప్తంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆదాయపన్ను విధానంలో ఎన్నో మినహాయింపులు(ఎగ్జంప్షన్), తగ్గింపులు(డిడక్షన్) ఉన్నాయి. అయితే, కొందరు కొన్ని రకాల మినహాయింపులనే వినియోగించుకుంటుంటే, కొందరు అయితే అస్సలు ఏ ప్రయోజనాన్ని కూడా వాడుకోకుండా రిటర్నులు ఫైల్ చేస్తున్నారు. ఇలా ఏ డిడక్షన్, ఎగ్జంప్షన్ వినియోగించుకోని వారికి నూతన పన్ను రేట్లు ప్రయోజనకరం. అలాగే, తీసివేతలు, మినహాయింపుల గందరగోళాన్ని అర్థం చేసుకోలేని వారు నూతన విధానానికి మారిపోవచ్చు. లేదు, చట్ట పరిధిలో అన్ని మినహాయింపులు, తగ్గింపులను ఉపయోగించుకుంటానంటే ప్రస్తుత విధానంలోనే ఎక్కువ ఆదా చేసుకోవచ్చు. ''ఇదొక మంచి నిర్ణయం. తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఇచ్చినట్టయింది'' అని ట్యాక్స్‌స్పానర్ సహ వ్యవస్థాపకుడు సుధీర్ కౌశిక్ పేర్కొన్నారు. ''హౌస్ రెంట్ అలవెన్స్, సెక్షన్ 80సీ కింద మినహాయింపులు పొందుతున్న వారికి నూతన పన్ను విధానానికి మారిపోవడం ప్రయోజనకరం కాదు'' అని అశోక్ మహేశ్వరి అండ్ అసోసియేట్స్ ట్యాక్స్ లీడర్ అమిత్ మహేశ్వరి తెలిపారు.

### ప్రస్తుత విధానంలో మినహాయింపులు ఇవీ..

చాప్టర్ 6ఏ

| సెక్షన్ | గరిష్ట మినహాయింపు (రూ.లలో) |
|---|---|
| సెక్షన్80సీ | 1,50,000 |
| సెక్షన్ 80సీసీడీ (ఎన్‌పీఎస్) | 50,000 |
| **సెక్షన్ 80డీ (మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం)** | |
| ● 60 ఏళ్లలోపున్న వ్యక్తి, అతని జీవిత భాగస్వామి, పిల్లలు | 25,000 |
| ● 60 ఏళ్లు దాటితే ఇదే కుటుంబానికి | 50,000 |
| ● తల్లిదండ్రుల కోసం చెల్లించే వైద్య బీమా ప్రీమియం (60ఏళ్లలోపున్న వారికి) | 25,000 |
| ● 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రుల కోసం చెల్లించే ప్రీమియంపై | 50,000 |
| ● సెక్షన్80టీటీఏ (సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ) | 10,000 |
| ● సెక్షన్80టీటీబీ (సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై వడ్డీ) | 50,000 |
| **ఇతర మినహాయింపులు** | |
| సెక్షన్24(ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ) | 2,00,000 |
| స్టాండర్డ్ డిడక్షన్ | 50,000 |

**చా**ప్టర్ 6ఏ పరిధిలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80డీ, సెక్షన్ 80సీసీడీ మినహాయింపులు రూ.2,50,000ను పూర్తిగా వినియోగించుకున్నట్టు అయితే రూ.7,50,000 వరకు ఆదాయం ఉన్న వారూ ప్రస్తుత విధానంలో పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అలాగే, రుణంపై ఇంటిని కొనుగోలు చేసిన వారు చాప్టర్ 6ఏకు అదనంగా సెక్షన్ 24 కింద ఇంటి రుణానికి చేసే వడ్డీ చెల్లింపులు రూ.2,00,000పై, స్టాండర్డ్ డిడక్షన్ 50,000ను కూడా వినియోగించుకుంటే అప్పుడు మొత్తం రూ.10,00,000 ఆదాయం ఉన్నప్పటికీ చెల్లించాల్సిన పన్ను బాధ్యత సున్నాయే అవుతుంది. ఇక సెక్షన్ 80టీటీఏ కింద డిపాజిట్లపై వడ్డీ రూ.10,000 వరకు మినహాయింపు కూడా ఉంది. నూతన పన్ను విధానానికి మారితే జీవిత బీమా, వైద్య బీమా ప్రీమియం, ఇంటి రుణానికి చేసే వడ్డీ చెల్లింపులతోపాటు ఎల్‌టీఏ తరహా మినహాయింపులను కోల్పోవాల్సి వస్తుంది.

### ఎవరికి ఏ పన్ను విధానం ప్రయోజనం...

- రూ.10 లక్షల ఆదాయంపై ప్రస్తుత విధానమే లాభం
- మినహాయింపులను పూర్తిగా వినియోగించుకోవాలి
- దాంతో పన్ను బాధ్యత లేకుండా చూసుకోవచ్చు
- సెక్షన్ 80సీ ఇన్వెస్ట్ చేయని వారికి పన్ను ఆదా ప్రయోజనాలు క్లెయిమ్ చేసుకోని వారికి నూతన పన్ను విధానం ప్రయోజనకరం
- ఎవరికి ఏదన్నది వారి ఆర్థిక ప్రణాళిక ప్రకారమే నిర్ణయం

**ప్రస్తుత విధానం**

| ఆదాయ వర్గం | పన్ను రేట్లు (శాతం) |
|---|---|
| రూ.2,50,000 వరకు | సున్నా |
| రూ.2,50,001–5,00,000 | 5 |
| రూ.5,00,000–10,00,000 | 20 |
| రూ.10,00,000పైన | 30 |

**నూతన పన్ను విధానం**

| ఆదాయ వర్గం | పన్ను రేట్లు (శాతం) |
|---|---|
| రూ.2,50,000 వరకు | సున్నా |
| రూ.2,50,001–5,00,000 | 5 |
| రూ.5,00,001–7,50,000 | 10 |
| రూ.7,50,001–10,00,000 | 15 |
| రూ.10,00,001–12,50,000 | 20 |
| రూ.12,50,001–15,00,000 | 25 |
| రూ.15,00,001 ఆ పైన | 30 |

**రూ**.5 లక్షల వరకు ఆదాయం ఉన్న వర్గాలకు ప్రస్తుత, నూతన విధానం పరంగా ఎటువంటి మార్పుల్లేవు. రూ.2,50,000 వరకు ఆదాయంపై పన్ను లేదు. అలాగే, పన్ను వర్తించే ఆదాయం రూ.5,00,000 దాటని వారు సెక్షన్ 87ఏ కింద పూర్తిగా రిబేటు పొందొచ్చు. అంటే వారు కూడా ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. రూ.5,00,000 దాటి పన్ను వర్తించే ఆదాయం ఉన్న వారు తమకున్న పెట్టుబడులు, వాటిపై మినహాయింపులు, తగ్గింపులను బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి.

### నూతన విధానంలో మినహాయింపులు, తగ్గింపులు


**నూ**తన విధానానికి ఓ తిరకాసు ఉంది. నూతన విధానం కింద పన్ను చెల్లించే వారు ప్రస్తుత మినహాయింపులు, తగ్గింపుల్లో దాదాపు 70 వరకు వినియోగించుకోవడానికి అవకాశం లేకుండా చేశారు. నూతన విధానంలో రిటర్నులు దాఖలు చేసే వారు కోల్పోతున్నవి..

- సెక్షన్ 80సీ కింద పెట్టుబడులు
- హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)
- గృహ రుణంపై వడ్డీ
- లీవ్ ట్రావెల్ అలవెన్స్ (ఎల్‌టీఏ)
- మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం
- స్టాండర్డ్ డిడక్షన్
- సేవింగ్స్ బ్యాంకు బ్యాలన్స్‌పై వడ్డీ
- విద్యా రుణంపై చెల్లించే వడ్డీ
- సాధారణంగా ఎక్కువ మంది వీటిని వినియోగించుకుంటారు. అటువంటి వారికి ప్రస్తుత విధానమే నయం.

**నూతన విధానంలోనూ 50 వరకు మినహాయింపులు, తగ్గింపులను కొనసాగించారు. అవి...**

- ఇంటి అద్దెపై స్టాండర్డ్ డిడక్షన్
- వ్యవసాయ ఆదాయం
- లైఫ్ ఇన్సూరెన్స్ రూపంలో వచ్చే ఆదాయం
- వీఆర్ఎస్ ప్రయోజనాలు
- రిటైర్మెంట్ సమయంలో మిగిలిన సెలవులను నగదుగా పొందడం

**నూ**తన విధానంలోనూ ఎన్‌పీఎస్(రిటైర్మెంట్ సాధనం) పై పన్ను ఆదా చేసుకునే ఒక అవకాశాన్ని కొనసాగించారు. అది వ్యక్తిగతంగా ఎన్‌పీఎస్‌లో చేసే పెట్టుబడులు కాకుండా.. ఉద్యోగుల తరఫున కంపెనీలు ఎన్‌పీఎస్‌కు జమ చేసే చందాలకు సెక్షన్ 80సీసీడీ (2) కింద పన్ను ఆదా ప్రయోజనం వర్తిస్తుంది. మూలవేతనం, కరువు భత్యం (డీఏ)పై వార్షికంగా 10% ఎన్‌పీఎస్ చందాలపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు వార్షిక మూలవేతనం, కరువు భత్యం రూ.5 లక్షలు ఉందనుకుంటే ఇందులో 10% రూ.50,000పై పన్ను చెల్లించక్కర్లేదు. ఎన్‌పీఎస్ అయినా లేదా ఈపీఎఫ్ అయినా ఉద్యోగ సంస్థ చేసే చందాలకు ఇదే వర్తిస్తుంది. ఒకవేళ ఒక ఉద్యోగి తరఫున సంస్థ వార్షికంగా రూ.7.5 లక్షలకు మించి జమ చేస్తే అప్పుడు పన్ను పడుతుంది.



### ఒక్కసారి మారిపోతే..?

**ప్ర**స్తుత విధానంలో కొనసాగొచ్చు లేదా నూతన విధానానికి మారిపోవచ్చన్న వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. అయితే, ఈ రెండింటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకునే వెసులుబాటు ఏటేటా ఉంటుందా..? లేక ఒక్కసారి నూతన విధానానికి మారిపోతే అందులోనే మరుసటి ఏడాది నుంచి రిటర్నులు దాఖలు చేయాలా..? అన్న సందేహం రావచ్చు. ఏ విధానంలో రిటర్నులు దాఖలు చేయవచ్చన్నది కొన్ని అంశాలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ''వ్యక్తులు లేదా హిందూ అవిభాజ్య కుటుంబం ఎటువంటి వ్యాపార ఆదాయం లేకపోతే, గడిచిన ప్రతీ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయంపై రిటర్నులు ఏ విధానంలో దాఖలు చేయాలన్నది ఎంచుకునే ఆప్షన్ ఉంటుంది. ఇతర కేసుల్లో అయితే, ఒక్కసారి నూతన విధానానికి మారిపోతే ఆ తర్వాత నుంచి అదే విధానంలో కొనసాగాల్సి ఉంటుంది'' అని బడ్జెట్ మెమొరాండం స్పష్టం చేస్తోంది. ''ప్రతీ ఆర్థిక సంవత్సరంలో వ్యక్తులు ఏ పన్ను విధానాన్ని అయినా ఎంచుకోవచ్చు. పన్ను మినహాయింపులు, తగ్గింపులతో రిటర్నులు దాఖలు చేయవచ్చు లేదా నూతన విధానంలో తక్కువ పన్ను రేట్ల ప్రకారం రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని షరతులు ఉన్నాయి. ఎటువంటి వ్యాపార ఆదాయం లేని వారు నూతన పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. ఒకవేళ వ్యాపార ఆదాయం ఉన్న వారు మినహాయింపులు, తగ్గింపులను వినియోగించుకుని ప్రస్తుత విధానంలో పన్ను రిటర్నులు దాఖలు చేసినట్టయితే అప్పుడు పాత విధానంలోనే కొనసాగినట్టవుతుంది. తర్వాతి సంవత్సరాల్లోనూ నూతన విధానానికి మారే అవకాశం ఉండదు'' అని ట్యాక్స్‌మన్ డాట్ కామ్ డీజీఎం వాధ్వా తెలిపారు. వ్యాపార ఆదాయం లేని పన్ను చెల్లింపుదారుడు ప్రస్తుత విధానం లేక నూతన ప్రతిపాదిత విధానాన్ని ఎంచుకోవచ్చు. అయితే, వ్యాపార ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారునికి ఈ రెండింటిలో ఎందులో కొనసాగాలన్న ఆప్షన్ ఒక్కసారి మాత్రమే ఉంటుంది.

**ఏ విధానంలో ఎంత భారం**

### రూ.7.5 లక్షల ఆదాయం ఉన్న వారు

- స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, సెక్షన్ 80సీ సాధనాల్లో రూ.1,50,000 పెట్టుబడులతోపాటు ఎన్‌పీఎస్‌లో అదనంగా రూ.50,000 ను ఇన్వెస్ట్ చేయడం ద్వారా మొత్తం రూ.2,50,000 ఆదాయంపై మినహాయింపులు పొందొచ్చు. ఎన్‌పీఎస్ లేకపోతే సెక్షన్ 80డీ కింద తన కుటుంబానికి, తల్లిదండ్రులకు చెల్లిస్తున్న వైద్య బీమా ప్రీమియంను మినహాయింపుగా చూపించుకున్నా సరిపోతుంది. మొత్తం ఆదాయం రూ.7,50,000 నుంచి మినహాయింపులు రూ.2.5 లక్షలను తీసివేయగా మిగిలిన పన్ను వర్తించే ఆదాయం రూ.5,00,000 అవుతుంది. పన్ను వర్తించే ఆదాయం మినహాయింపుల తర్వాత రూ.5లక్షలు దాటనందున సెక్షన్ 87ఏ కింద పన్ను చెల్లించకుండా రిబేటు పొందొచ్చు.
- కొత్త విధానంలో ఈ మినహాయింపులు లేవుకనుక.. మొదటి రూ.2,50,001–5,00,000పై 5% కింద రూ.12,500, తర్వాతి రూ.2.5 లక్షలపై 10% పన్ను రేటు ప్రకారం రూ.25,000.. మొత్తం రూ.37,500 పన్ను చెల్లించాలి.
- ఒకవేళ పాత విధానంలోనే కొనసాగుతూ కొన్ని మినహాయింపులనే క్లెయిమ్ చేసుకునేట్టు అయితే.. ఉదాహరణకు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయని వారు, సెక్షన్ 80సీ కింద రూ.150,000, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, సెక్షన్ 80డీ కింద వైద్య బీమా ప్రీమియంను మినహాయింపులుగా చూపించుకోవచ్చు. అలా రూ.2,00,000ను మినహాయింపుగా చూపించుకున్నారనుకుంటే.. మిగిలిన రూ.50,000పై ప్రస్తుత విధానంలో 20 శాతం పన్ను రేటు ప్రకారం రూ.10,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు ప్రస్తుత విధానమే బెస్ట్.
- ఒకవేళ సెక్షన్ 80సీ కింద కేవలం రూ.1,00,000 మాత్రమే వినియోగించుకుని, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000ను కూడా క్లెయిమ్ చేసుకుంటే అప్పుడు పన్ను చెల్లించాల్సిన ఆదాయం రూ.1,00,000 అవుతుంది. దీనిపై 20% అంటే రూ.20,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇదీ ప్రయోజనమే.
- సెక్షన్ 80సీ కింద రూ.50,000 వరకూ పెట్టుబడులు ఉంటే, దీనికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000 కలుపుకోవచ్చు. వైద్య బీమా ప్రీమియం రూ.12,000 వరకు చెల్లిస్తున్న వారు చాలా మందే ఉంటారు. ఈ విధంగా చూస్తే కనీస మినహాయింపులు రూ.1,00,000–1,50,000 వరకు ఎక్కువ మందికి ఉంటుంటాయి. వీరికి ప్రస్తుత విధానమే లాభకరం.

### రూ.10 లక్షల ఆదాయం విషయంలో...

- వీరు కూడా స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80సీ, 80సీసీడీ కింద పూర్తిగా రూ.3,00,000ను వినియోగించుకుంటే అప్పుడు రూ.2,00,000 మొత్తంపై ప్రస్తుత విధానంలో 20 శాతం కింద రూ.40,000 పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ గృహ రుణం తీసుకుని వడ్డీ చెల్లిస్తుంటే ఆ విధంగా మరో రూ.2,00,000పైనా పన్ను భారం లేకుండా చూసుకోవచ్చు. దీంతో నికరంగా చెల్లించాల్సిన పన్ను సున్నాయే అవుతుంది. ఇప్పటి వరకు ఇల్లు సమకూర్చుకోని వారు రుణంపై ఇంటిని తీసుకోవడం ద్వారా ఈ ఆదాయ వర్గాల వారు ఏటా రూ.40,000 వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.
- అదే నూతన విధానంలో రూ.2,50,001–5,00,000పై 5 శాతం కింద రూ.12,500, 5,00,001–7,50,000 ఆదాయంపై 10 శాతం ప్రకారం రూ.25,000వేలు, తర్వాత రూ.2,50,000పై 15 శాతం పన్ను రేటు ప్రకారం రూ.37,500 మొత్తం రూ.75,000 పన్ను చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రస్తుత విధానంలో కనీసం సెక్షన్ 80సీ, 80సీసీడీ, 80డీ, స్టాండర్డ్ డిడక్షన్‌లు వినియోగించుకున్నా నూతన విధానంతో పోలిస్తే తక్కువ పన్ను చెల్లిస్తే చాలు.
- ప్రస్తుత విధానంలో ఏ మినహాయింపులను క్లెయిమ్ చేసుకోని వారు, అదే సమయంలో సెక్షన్ 80సీలో కేవలం రూ.లక్ష వరకు ఇన్వెస్ట్ చేస్తున్నట్టయితే అప్పుడు వీరు రూ.4,00,000పై ప్రస్తుత విధానంలోనే 20 శాతం పన్ను రేటుపై రూ.80,000 చెల్లించాల్సి వస్తుంది. కనుక వీరికి కొత్త విధానం బెటర్.
- ఒకవేళ ఇంటి రుణం లేని వారికి హెచ్ఆర్ఏ మినహాయింపు ప్రయోజనం ఉంటుంది. కనుక దాన్ని పరిగణనలోకి తీసుకుని చూడాలి. హెచ్ఆర్ఏ క్లెయిమ్‌కు మూడు విధానాలున్నాయి. వేతనంలో భాగంగా ఉద్యోగి పొందుతున్న వాస్తవ హెచ్ఆర్ఏ మొత్తం.. లేదా మెట్రోల్లో నివసించే వారి మూల వేతనంలో 50%, అదే నాన్ మెట్రో ప్రాంతాల్లోని వారి మూల వేతనంలో 40%.. లేదా మీరు వార్షికంగా చెల్లించిన అద్దె నుంచి మీ వార్షిక వేతనంలో 10 శాతాన్ని తీసివేయగా మిగిలిన మొత్తం. ఈ మూడింటింలో ఏది తక్కువ అయితే ఆ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు.
- 10 లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారు తమ పెట్టుబడులను అన్నింటినీ లిస్ట్ చేసుకుని, మినహాయింపులను పరిగణనలోకి తీసుకుని అప్పుడు ఏ విధానంలో రిటర్నులు దాఖలు చేయాలన్నది నిర్ణయించుకోవచ్చు.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఫిబ్రవరి-4-2020 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 5.75 | 6 | 6.1 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.4 | 6.55 | 6.5 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.9 | 6.25 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.9 | 6.3 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.25 | 6.2 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.15 | 6.55 | 6.35 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.3 | 6.4 |
| ఐడీబీఐ బ్యాంక్ | 5.9 | 6.4 | 6.25 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.25 | 6.75 | 6.75 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.05 | 6.3 | 6.2 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| పీఎన్‌బీ | 6.1 | 6.3 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.1 | 6.1 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.5 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# ఎప్పుడైనా ఇన్వెస్ట్ చేసుకోతగినది!

### మిరే అస్సెట్ ఎమర్జింగ్ బ్లూచిప్ ఫండ్




**దీ**ర్ఘకాలానికి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు, అందులోనూ లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్స్ పట్ల సానుకూలంగా ఉన్న వారు.. ఈ విభాగంలో మిరే అస్సెట్ ఎమర్జింగ్ బ్లూచిప్ ఫండ్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎందుకంటే ఇది ఆరంభం నుంచి ఇప్పటి వరకు మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహాయిస్తే చక్కని పనితీరుతో దూసుకుపోతోంది. గతంలో మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఎక్కువ ఎక్స్‌పోజర్‌తో ఉండే ఈ పథకం, మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్వర్గీకరణ అనంతరం ఎక్కువ పెట్టుబడులను లార్జ్ క్యాప్ విభాగానికి కేటాయించే విధంగా మార్పులు చేసింది. పలు సంస్థలు ఈ పథకానికి 5 స్టార్ ఇవ్వడం గమనార్హం.

**రాబడులు**

ఈ పథకంలో ఏడాది రాబడులు 18 శాతంగా ఉన్నాయి. మూడేళ్లలో వార్షికంగా 14 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. అలాగే, ఐదేళ్లలో వార్షికంగా 15.76 శాతం, ఏడేళ్లలో వార్షికంగా 23.42 శాతం రాబడులను అందించింది. కానీ, ఈ పథకం రాబడులకు ప్రామాణికంగా భావించే బీఎస్ఈ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ సూచీ పెరుగుదల ఏడాదిలో 10 శాతం, మూడేళ్లలో 11.56 శాతం, ఐదేళ్లలో 8.6 శాతం, ఏడేళ్లలో 12.5 శాతం చొప్పునే ఉండడాన్ని ఇన్వెస్టర్లు గమనించాలి. ప్రామాణిక సూచీ కంటే ఈ పథకం పనితీరే మెరుగ్గా ఉంది. అంతేకాదు, గత 15 నెలల కాలంలోనూ పోటీ పథకాల కంటే రాబడుల పరంగా ముందుంది. ఇదే కాలంలో బెంచ్ మార్క్ రాబడులు 15 శాతంలోపే ఉండగా, మిరే అస్సెట్ ఎమర్జింగ్ బ్లూచిప్ రాబడులు 16.5 శాతంగా ఉన్నాయి.


**పెట్టుబడుల విధానం**

లార్జ్‌క్యాప్‌లో కనీసం 35 శాతం, గరిష్టంగా 65 శాతం వరకు ఇన్వెస్ట్ చేస్తుంది. అలాగే, మిడ్‌క్యాప్‌లో కనీసం 35 శాతం పెట్టుబడులు పెడుతుంటుంది. ఈ పథకం గత పనితీరును పరిశీలించినట్టయితే కొన్ని సందర్భాల్లో వెనుకబడినప్పటికీ.. తర్వాతి సంవత్సరాల్లో అద్భుత రాబడులతో సగటున మెరుగైన పనితీరును చూపించినట్టు అర్థం చేసుకోవచ్చు. గత రెండేళ్లలో ఎన్నో అస్థిరతలు నెలకొనగా.. ఈ సమయంలోనూ ఈ పథకం పనితీరు ఎంతో ఆకట్టుకునే విధంగా ఉండడాన్ని గమనించాలి. గత ఏడేళ్లలో చూసుకుంటే ఈ విభాగంలోనే ఈ పథకం పనితీరు మెరుగ్గా ఉంది. ప్రస్తుతం తనవద్దనున్న పెట్టుబడుల్లో 99.4 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది. ముఖ్యంగా మెగాక్యాప్, లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో 52 శాతం పెట్టుబడులు ఉండగా, మిడ్‌క్యాప్‌లో 42.5 శాతం, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో 5.3 శాతం వరకు పెట్టుబడులు కలిగి ఉంది. లార్జ్‌క్యాప్‌తో పోలిస్తే వ్యాల్యూయేషన్ల పరంగా మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ ఎంతో ఆకర్షణీయ ధరల్లో ఉండడంతో వీటిల్లో ఎక్స్‌పోజర్ పెంచుకున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 59 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగాల స్టాక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 33 శాతం వరకు పెట్టుబడులను ఈ రంగంలోని కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత హెల్త్‌కేర్ రంగం (10.83 శాతం), ఎనర్జీ (10 శాతం), ఎఫ్‌ఎంసీజీ (8.50 శాతం) రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది.




### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 6.92 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 5.98 |
| ఎస్‌బీఐ | 4.53 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 3.54 |
| ఎల్అండ్‌టీ | 3.47 |
| యాక్సిస్ బ్యాంకు | 3.27 |
| వోల్టాస్ | 2.95 |
| ఇన్ఫోసిస్ | 2.84 |
| మ్యాక్స్ ఫైనాన్షియల్ | 2.66 |
| ఇండస్‌ఇండ్‌బ్యాంకు | 2.60 |



విజయం సాధించడం తేలికే..
అయితే ఆత్మ విశ్వాసం, సన్నద్ధత, కార్యాచరణ అవసరం!
- జిగ్ జిగ్లర్, అమెరికన్ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణులు

## బొమ్మ-బొరుసు



# అవసరమైతే మరిన్ని బ్యాంకుల విలీనం

- 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి భారీ బ్యాంకుల తోడ్పాటు
- కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** అవసరమైన పక్షంలో మరిన్ని బ్యాంకులను విలీనం చేసే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ తెలిపారు. 2024–25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్న లక్ష్యం సాకారమయ్యేందుకు.. కన్సాలిడేషన్ ద్వారా ఏర్పడే అంతర్జాతీయ స్థాయి బ్యాంకులు తోడ్పడగలవని ఆయన చెప్పారు. భారీ బ్యాంకులతో పెద్ద సంఖ్యలతో ప్రజలకు ఆర్థిక సేవలు, మెరుగైన పథకాలు అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం గతేడాది ఏకంగా 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగింటిగా విలీనం చేసే ప్రతిపాదన ప్రకటించిన సంగతి తెలిసిందే. విలీనాల కారణంగా 2017లో 27గా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 12కు తగ్గనుంది. 2017 ఏప్రిల్‌లో అయిదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 2019లో విజయా బ్యాంకు, దేనా బ్యాంకులను బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ)లో విలీనం చేశారు.

**ఎల్‌ఐసీ లిస్టింగ్‌తో పారదర్శకత ..**
ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ లిస్టింగ్ చేయడం ద్వారా సంస్థలో మరింత పారదర్శకత పెరగగలదని ఠాకూర్ చెప్పారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 2020–21 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ప్రతిపాదన చేశారు. ఎల్ఐసీలో కొన్ని వాటాలతో పాటు ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 90,000 కోట్ల దాకా సమీకరించాలని కేంద్రం నిర్దేశించుకుంది. ప్రభుత్వానికి ప్రస్తుతం ఎల్‌ఐసీలో 100 శాతం, ఐడీబీఐ బ్యాంకులో 46.5 శాతం వాటాలు ఉన్నాయి. అటు రుణ పునర్‌వ్యవస్థీకరణ వెసులుబాటుతో గతేడాది దాదాపు అయిదు లక్షల లఘు, చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) ప్రయోజనం చేకూరిందని ఠాకూర్ చెప్పారు. తాజాగా రుణ పునర్‌వ్యవస్థీకరణ వ్యవధిని వచ్చే ఏడాది మార్చి 31 దాకా పొడిగిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

## ఆఫ్‌లైన్లో వివో భారీ విస్తరణ




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ వివో దేశవ్యాప్తంగా ఆఫ్‌లైన్లో భారీగా విస్తరిస్తోంది. ఈ ఏడాది కొత్తగా 250 ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను ప్రారంభించనుంది. దీంతో ఇటువంటి కేంద్రాల సంఖ్య 600లకు చేరుతుందని వివో ఇండియా బ్రాండ్ స్ట్రాటజీ డైరెక్టర్ నిపున్ మార్య తెలిపారు. మహారాష్ట్రలోని థానేలో ఫ్లాగ్‌షిప్ ఎక్స్‌పీరియెన్షియల్ సెంటర్‌ను 1,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో కంపెనీ ఏర్పాటు చేసింది. మెట్రోలు, రాజధాని నగరాల్లో 2020లో 20 ఫ్లాగ్‌షిప్ సెంటర్లను నెలకొల్పుతామన్నారు. వీటిలో యాక్సెసరీ జోన్, ఐవోటీ, గేమింగ్ ఎక్స్‌పీరియెన్స్, వీఆర్, ఫోటో జోన్స్ ఉంటాయని వివరించారు. డిసెంబరు గణాంకాల ఆధారంగా పరిమాణం పరంగా వివో 24.7 శాతం వాటాను దక్కించుకుని ఆఫ్‌లైన్ మార్కెట్లో తొలి స్థానంలో ఉంది.

# ‘కరోనా’, గణాంకాలు కీలకం

- పెరుగుతున్న కరోనా మృతులు
- దీంతో మార్కెట్‌లో అప్రమత్తత
- రిటైల్, పారిశ్రామికోత్పత్తి గణాంకాలపై దృష్టి
- చివరి దశ క్యూ3 ఫలితాలు



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ పరిణామాలు, ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు ఈ వారం మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని నిపుణులంటున్నారు. వీటితో పాటు ఈ వారంలో వెలువడే కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు, ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ముడి చమురు ధరల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, ప్రపంచ మార్కెట్ల పోకడ, దేశీ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి తదితర అంశాలు కూడా స్టాక్ మార్కెట్ కదలికలకు కీలకమని వారంటున్నారు.

**కరోనా కలకలం...**
కరోనా వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆదివారం నాటికి చైనాలో 811కు పెరిగింది. ఇది 2002–03లో ప్రబలిన సార్స్ వైరస్ మరణాల కంటే అధికం. కరోనా వైరస్ 25 దేశాలకు విస్తరించిందని, 37,000 మంది ఈ వైరస్ బారిన పడ్డారని అంచనా. కరోనా వైరస్‌కు సంబంధించిన ఏమైనా ప్రతికూల వార్తలు వస్తే, మార్కెట్‌పై ప్రభావం తీవ్రంగానే ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంచనాలను మించే కరోనా కల్లోలం ఉండే అవకాశాలున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి.

**గణాంకాల ప్రభావం...**
ఈ నెల 12న డిసెంబర్ నెల పారిశ్రామికోత్పత్తి, జనవరి నెల రిటైల్‌ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడతాయి. ఇక శుక్రవారం(ఈనెల14న) జనవరి నెల టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు వస్తాయి. ఈనెల 11 (మంగళవారం)న ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

**చివరి దశ క్యూ3 ఫలితాలు...**
డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు చివరి దశకు వచ్చాయి. ఈ వారంలో 2,000కు పైగా కంపెనీలు క్యూ3 ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్నాయి. దీంట్లో నిఫ్టీ సూచీలోని 9 కంపెనీలున్నాయి. గెయిల్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, వొడాఫోన్ ఐడియా, నాల్కో, భెల్, ఆయిల్ ఇండియా, హిందాల్కో, నెస్లే ఇండియా, పీఎఫ్‌సీ, సెయిల్, అశోక్ లేలాండ్, తదితర కంపెనీలు ఈ వారంలోనే ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్నాయి.

**కరోనాపై మార్కెట్ కన్ను...:** వృద్ధి పుంజుకుంటుందని స్పష్టంగా తేలేదాకా, మార్కెట్ పరిమిత శ్రేణిలోనే కదలాడుతుందని మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ సిద్ధార్థ ఖేమ్కా అంచనా వేస్తున్నారు. కరోనా వైరస్ సంబంధిత పరిణామాలను మార్కెట్ జాగ్రత్తగా గమనిస్తోందని పేర్కొన్నారు. వృద్ధి బాగా ఉండగలదన్న అంచనాలున్న రంగాల షేర్లు పుంజుకుంటాయని వివరించారు. బడ్జెట్, ఆర్‌బీఐ పాలసీ, కీలక కంపెనీల క్యూ3 ఫలితాలు వంటి ముఖ్యమైన అంశాలు ముగిశాయని శామ్‌కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోదీ పేర్కొన్నారు. ఇక మార్కెట్ వాస్తవిక అంశాలకు సర్దుబాటు అవుతుందని వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులో కరోనా వైరస్ సంబంధిత పరిణామాలే మార్కెట్‌కు కీలకమని వివరించారు. కరోనాకు సంబంధించి ప్రపంచ మార్కెట్ల ప్రతిస్పందన మన మార్కెట్‌ను ప్రభావితం చేస్తుందని శామ్‌కో ఎనలిస్ట్ ఉమేశ్ గుప్తా పేర్కొన్నారు.

## వరుసగా ఆరో నెలా ఎఫ్‌పీఐల పెట్టుబడులు

**భా**రత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడుల ప్రవాహం వరుసగా ఆరో నెలా కొనసాగుతోంది. డిపాజిటరీల డేటా ప్రకారం.. ఫిబ్రవరి 3–7 మధ్య ఎఫ్‌పీఐలు డెట్ సెగ్మెంట్‌లో రూ. 6,350 కోట్లు పెట్టుబడులు పెట్టారు. అయితే, ఇదే వ్యవధిలో ఈక్విటీ మార్కెట్ నుంచి రూ. 1,173 కోట్లు ఉపసంహరించుకున్నారు. నికరంగా రూ. 5,177 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. చైనా ఎకానమీ, ప్రపంచ వృద్ధిపై కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో భారత్ వంటి వర్ధమాన మార్కెట్లపై ఎఫ్‌పీఐలు ఆచితూచి వ్యవహరిస్తున్నారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ సీనియర్ ఎనలిస్టు మేనేజరు హిమాంశు శ్రీవాస్తవ తెలిపారు.

# సెయిల్‌లో 5 శాతం వాటా విక్రయం!

రూ.1,000 కోట్లు సమీకరణ అంచనా




**న్యూఢిల్లీ:** సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా)లో 5 శాతం వాటాను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఈ వాటా షేర్లను విక్రయించాలనేది ప్రభుత్వ భావన. ఈ వాటా విక్రయం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.1,000 కోట్లు సమకూరుతాయని అంచనా. ఈ వాటా విక్రయానికి సంబంధించిన రోడ్‌షోలను సింగపూర్, హాంగ్‌కాంగ్‌ల్లో నిర్వహించాలని దీపమ్, ఉక్కు శాఖలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. కరోనా వైరస్ ప్రబలడంతో హాంగ్‌కాంగ్ రోడ్‌షో వాయిదా పడే అవకాశాలున్నాయి.

**మార్చిలోపు సెయిల్ వాటా విక్రయం....**
సెయిల్ కంపెనీలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి 75 శాతం మేర వాటా ఉంది. 2014, డిసెంబర్‌లో ఈ కంపెనీలో 5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం విక్రయించింది. సవరించిన అంచనాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ వాటాల విక్రయం(డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.65,000 కోట్లు సమీకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం ఇప్పటిదాకా రూ.34,000 కోట్లు మాత్రమే సమీకరించగలిగింది. మరో నెలన్నర రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

# రైల్ వీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం

**ఉక్కునగరం(గాజువాక):** విశాఖ స్టీల్‌ప్లాంట్ చరిత్రలో మరో ముందడుగు పడింది. భారతీయ రైల్వేతో చేసుకున్న ఒప్పందం మేరకు ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో నిర్మించిన ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్‌లో శనివారం వీల్స్ ఉత్పత్తి ప్రారంభించారు. స్టీల్ ప్లాంట్ సీఎండీ పి.కె.రథ్ తొలి వీల్ ఉత్పత్తిని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణానికి రూ.1,680 కోట్లు వ్యయం అయిందన్నారు. ఈ ప్లాంట్ ఏడాదికి లక్ష రైల్ వీల్స్ తయారీ సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కె.కె. ఘోష్, డైరెక్టర్(కమర్షియల్) డి.కె. మొహంతి, డైరెక్టర్(ఆపరేషన్స్) ఎ.కె. సక్సేనా, రైల్వే బోర్డు ఈడి లక్ష్మీ రామన్, ఎస్.ఎం.ఎస్. జర్మనీ కంపెనీ సీనియర్ అధికారి కుల్జీ, ఎస్.ఎం.ఎస్ ఇండియా సీనియర్ అధికారి గ్రీనియర్‌తో పాటు స్టీల్‌ప్లాంట్, మెకాన్ సంస్థల ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.



ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లు

## బోర్డ్ మీటింగ్స్

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, మదర్సన్ సుమీ సిస్టమ్స్, బలరామ్‌పూర్ చినీ మిల్స్, జేఎమ్‌టీ ఆటో, కజారియా సిరామిక్స్

## కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 10-2-2020

| | |
|---|---|
| విశాఖ | 380–00 |
| చిత్తూరు | 373–00 |
| వరంగల్ | 328–00 |
| విజయవాడ | 345–00 |
| గోదావరి | 345–00 |
| 9–2–2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 325–00 |

# రూ. 10వేల కోట్ల సమీకరణకు లైన్ క్లియర్

**యస్ బ్యాంక్ ఈజీఎంలో షేర్‌హోల్డర్ల ఆమోదం**





**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ తాజాగా రూ. 10,000 కోట్ల నిధులు సమీకరించేందుకు, అధీకృత షేర్ క్యాపిటల్‌ను రూ. 800 కోట్ల నుంచి రూ. 1,100 కోట్లకు పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. బ్యాంక్ అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఈ ప్రతిపాదనలకు షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. రూ. 2 ముఖ విలువ గల 450 కోట్ల ఈక్విటీ షేర్లతో రూ. 900 కోట్ల మేర, ఒక్కోటి రూ. 100 చొప్పున రెండు కోట్ల ప్రిఫరెన్స్ షేర్లతో రూ. 200 కోట్ల మేర బ్యాంక్ తన అధీకృత షేర్ క్యాపిటల్‌ను పెంచుకోనుంది. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) లేదా ఇతరత్రా షేర్ల ప్రైవేట్ ప్లేస్‌మెంట్ రూపంలో యస్ బ్యాంక్ రూ. 10,000 కోట్లు సమీకరించుకోనుంది.

# తక్షణ మద్దతుశ్రేణి 40,820-40,690

## మార్కెట్ పంచాంగం

కరోనా వైరస్ ప్రభావం, బడ్జెట్‌పై అంచనాలు నెరవేరకపోవడంతో భారత్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూసినప్పటికీ.... గతవారం ప్రపంచ మార్కెట్ల వేగవంతమైన ర్యాలీని ఇక్కడి ఈక్విటీలు కూడా అనుసరించాయి. ఈ మధ్యలో అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్, భారత రిజర్వ్‌బ్యాంక్ పాలసీ నిర్ణయాలు యథాతథంగా వుండటంతో మార్కెట్లపై పెద్దగా ప్రభావాన్ని చూపించలేదు. పటిష్టమైన బుల్ మార్కెట్లో హఠాత్ పతనం సంభవించినపుడు, సాంకేతికంగా రిట్రేస్‌మెంట్ ర్యాలీలు కూడా బలంగానే వస్తుంటాయి. అటువంటిదే గతవారం జరిగిన ర్యాలీగా ప్రస్తుతానికి పరిగణించాల్సివుంటుంది. రానున్న వారాల్లో సూచీలు కొత్త రికార్డుల్ని నెలకొల్పితేనే, బుల్‌ట్రెండ్ కొనసాగుతున్నదని భావించాల్సివుంటుంది. అది జరగకపోతే, బలమైన డౌన్‌ట్రెండ్‌లోకి భారత్ మార్కెట్ మళ్లవచ్చు. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.....

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు**




ఫిబ్రవరి 7తో ముగిసినవారం ప్రథమార్థంలో బీఎస్ఈ సెన్సెక్స్ నిలువునా 39,563 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమయ్యింది. ద్వితీయార్థంలో వేగంగా కోలుకుని 41,394 పాయింట్ల వద్దకు పెరిగింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 1,406 పాయింట్ల భారీ లాభంతో 41,142 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మార్కెట్ క్షీణిస్తే 40,820–40,690 పాయింట్ల శ్రేణి వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ శ్రేణిని పరిరక్షించుకుంటే గతవారం జరిగిన రికవరీ కొనసాగే అవకాశం వుంటుంది. ఆ సందర్భంలో తొలుత 41,390 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపై 41,520 పాయింట్ల వద్దకు, ఆపైన 41,700 పాయింట్ల స్థాయికి చేరవచ్చు. ఈ వారం తొలి మద్దతుశ్రేణిని కోల్పోతే 40,475 పాయింట్ల స్థాయికి వేగంగా తగ్గవచ్చు. ఈ లోపున 40,015 వరకూ క్షీణత కొనసాగవచ్చు.

**నిఫ్టీ తక్షణ మద్దతుశ్రేణి 11,985-11,950**




గతవారం ప్రారంభంలో 11,614 పాయింట్ల కనిష్టస్థాయివరకూ తగ్గిన ఎన్ఎస్ఈ నిఫ్టీ, అటు తర్వాత జోరుగా 12,160 పాయింట్ల వరకూ ర్యాలీ సాగించింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 436 పాయింట్ల లాభంతో 12,098 పాయింట్ల వద్ద ముగిసింది. కీలకమైన 200 డీఎంఏ స్థాయి సమీపంలో మద్దతు పొందిన నిఫ్టీ జనవరి రికార్డుస్థాయి 12,430 పాయింట్ల నుంచి కోల్పోయిన 800 పాయింట్లకుపైగా నష్టాల్లో 61.8 శాతం రికవరీ చేసుకోగలిగింది. ఈ ఫిబోనకి స్థాయి అయిన 12,120 పాయింట్లు రానున్న రోజుల్లో నిఫ్టీకి కీలకం. ఈ స్థాయి దిగువన ఈ సోమవారం నిఫ్టీ గ్యాప్‌డౌన్‌తో మొదలైతే 11,985–11,950 పాయింట్ల శ్రేణి వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ శ్రేణిని పరిరక్షించుకుంటూ 12,120 పాయింట్లపైన నిఫ్టీ స్థిరపడితే తొలుత 12,160 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన 12,215 పాయింట్ల వద్దకు పెరగవచ్చు. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 12,270 వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. పైన ప్రస్తావించిన తొలి మద్దతుశ్రేణిని ఈ వారం కోల్పోతే వేగంగా 11,885కు తగ్గవచ్చు. ఈ లోపున 11,750 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్

## స్టాక్ వ్యూ

### సన్ ఫార్మా | బ్రోకరేజ్ సంస్థ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు




**ప్రస్తుత ధర:** రూ.430 **టార్గెట్ ధర:** రూ.500

**ఎందుకంటే:** దేశంలోనే నంబర్ వన్ ఫార్మా కంపెనీ ఇది. అధిక ఉత్పాదకత గల కంపెనీల్లో ఇది ఒకటి. సిబ్బంది సంఖ్యను 10 శాతం పెంచుకోనున్నది. దీంతో ఉత్పాదకత, వృద్ధి మరింతగా పుంజుకోగలవని భావిస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. ఆదాయం 5 శాతం వృద్ధితో రూ.8,140 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభ మార్జిన్ 22.6 శాతంగా నమోదైంది. అమెరికాలో జనరిక్స్ వ్యాపారం నిలకడను సాధిస్తోంది. ధరలు తగ్గినప్పటికీ, మార్కెట్ వాటా పెరుగుతుండటమే దీనికి కారణం. ప్రత్యేక (స్పెషాలిటీ) ఔషధాల పోర్ట్‌ఫోలియోను పునర్వ్యవస్థీకరిస్తుండటం, ఇలాంటి స్పెషాలిటీ ఔషధాల అమ్మకాలు రెండేళ్లలో 20 శాతం మేర చక్రగతి వృద్ధి చెందనుండటం, ఈ ఔషధాల అమ్మకాల మెరుగుదల కారణంగా నిర్వహణ లాభం, మార్జిన్లు పెరుగుతుండటం, భారత్, ఇతర వర్ధమాన దేశాల్లో వృద్ధి ఆరోగ్యకరంగా ఉండటం.... ఇవన్నీ సానుకూలాంశాలు. అమెరికాలో జనరిక్స్ మందుల విషయంలో పోటీ తీవ్రమవుతుండటం, ఈ కేటగిరీ ఔషధాల ధరలు తగ్గుతుండటం, అమెరికాలో కేసులు పెరిగే అవకాశాలు, పరిశోధన, అభివృద్ధిపై అధికంగా పెట్టుబడులు పెడుతుండటం వల్ల మార్జిన్లు తగ్గుతుండటం, ప్రజావేగు ఫిర్యాదు విషయమై సెబీ దర్యాప్తులో ప్రతికూల ఫలితం వెలువడే అవకాశాలు..... ప్రతికూలాంశాలు. రెండేళ్లలో నికర లాభం 14 శాతం, ఆదాయం 10 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని అంచనా. 2021–22 అంచనా ఈపీఎస్‌కు 19 రెట్ల ధరకు ప్రస్తుతం ఈ షేర్ ట్రేడవుతోంది. ఇది కొనుగోళ్లకు ఆకర్షణీయ ధర అని భావిస్తున్నాం.

### ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ | బ్రోకరేజ్ సంస్థ: జియోజిత్ బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు





**ప్రస్తుత ధర:** రూ.443 **టార్గెట్ ధర:** రూ.542

ఎందుకంటే: భారత్‌లో అతి పెద్ద హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటి. ఫ్లాట్స్(రెసిడెన్షియల్), గృహాల కొనుగోళ్లకు వ్యక్తులకు, బిల్డర్లకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 283 కార్యాలయాలతో పటిష్టమైన నెట్‌వర్క్ ఉంది. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు అంచనాలను మించాయి. అందుబాటు ధరల గృహ సెగ్మెంట్‌పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో రుణాలు 13 శాతం వృద్ధి చెందాయి. మొత్తం రుణ మంజూరీలు 3 శాతం ఎగసి రూ.13,177 కోట్లకు పెరిగాయి. వ్యయాలు తక్కువగా ఉండటంతో నికర వడ్డీ మార్జిన్ 2.4 శాతానికి పెరిగింది. గత క్యూ3లో రూ,.132 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.398 కోట్లకు పెరిగాయి. ఫలితంగా నికర లాభంలో పెద్దగా వృద్ధి లేక, రూ.598 కోట్లకే పరిమితమైంది. అనుకూల లిక్విడిటీ పరిస్థితుల కారణంగా నికర వడ్డీ ఆదాయం 18 శాతం వృద్ధితో రూ.1,228 కోట్లకు పెరిగింది. రుణ నాణ్యత ఒకింత క్షీణించింది. ఈ క్యూ3లో 20 కోట్ల డాలర్ల మేర విదేశీ వాణిజ్య రుణాలను సమీకరించింది. గత కొన్ని క్వార్టర్లుగా రుణ నాణ్యత క్షీణిస్తూ ఉన్నప్పటికీ, కంపెనీ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉండటం కలిసివచ్చే అంశం. విస్తృతమైన నెట్‌వర్క్, పటిష్టమైన బ్రాండ్, నికర వడ్డీ మార్జిన్ మెరుగుపడటం.. సానుకూలాంశాలు. ఈ షేర్ ప్రస్తుత పుస్తక విలువ(బుక్ వేల్యూ) రూ.322గా ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరపు అంచనా పుస్తక విలువకు 1.1 రెట్ల ధరను (టార్గెట్ ధర) ఏడాది కాలంలో అందుకోగలదని భావిస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# వేరే ఫండ్‌కు మారిపోవాలా?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**ఒక కంపెనీ(యాక్సిస్) మ్యూచువల్ ఫండ్స్, ఇతర కంపెనీల మ్యూచువల్ ఫండ్స్ కంటే మంచి రాబడులనిస్తున్నాయి. ఒకే కేటగిరీ అని కాకుండా అన్ని కేటగిరీల ఫండ్స్ విషయంలో కూడా ఈ కంపెనీ పనితీరు బాగా ఉంది. దీనికేమైనా ప్రత్యేకమైన కారణాలున్నాయా?**
–సూరిబాబు, విశాఖపట్టణం

సదరు కంపెనీ అనుసరిస్తున్న పెట్టుబడుల వ్యూహం మంచి ఫలితాలనిస్తున్నందువల్ల ఆ కంపెనీ ఫండ్స్ మంచి పనితీరు కనబరుస్తున్నాయని చెప్పవచ్చు. ఒక్కో కంపెనీకి ఒక్కో విధమైన పెట్టుబడుల వ్యూహం ఉంటుంది. కంపెనీల వ్యూహాలు వేర్వేరుగా, విభిన్నంగా ఉంటాయి. అయితే వేర్వేరు వ్యూహాలు వేర్వేరు కాలాల్లో మంచి ఫలితాలనిస్తాయి. రెండేళ్ల క్రితం చూస్తే, మీరు చెప్పిన కంపెనీ ఫండ్స్ కాకుండా వేరే కంపెనీ ఫండ్స్ మంచి రాబడులనిచ్చాయి. అంటే ఆ కాలంలో ఆ ఫండ్ మేనేజర్ వ్యూహం మంచి ఫలితాలనిచ్చిందన్న మాట. ఇప్పుడు మీరు పేర్కొన్న కంపెనీ ఫండ్స్ మంచి రాబడులనిస్తున్నాయి. పరిస్థితులు ఎలా ఉన్నా, అత్యున్నత నాణ్యత గల కంపెనీలపైననే సదరు ఫండ్ సంస్థ, దృష్టి పెడుతోంది. మార్కెట్ పతనబాటలో ఉన్నప్పుడు ఈ ఫండ్స్ పనితీరు క్షీణించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు పనితీరు బాగా లేదని ఈ మ్యూచువల్ ఫండ్ సంస్థ పక్కన బెట్టిన కంపెనీలు పుంజుకోవచ్చు. అందుకని వేర్వేరు సమయాల్లో వేర్వేరు పరిస్థితులు, వ్యూహాలు ఉంటాయి. మొత్తం మీద సదరు ఫండ్ సంస్థ మ్యూచువల్ ఫండ్స్ పనితీరు బాగా ఉంది. మార్కెట్ బాగా పెరుగుతున్నా, బాగా పతనమవుతూ ఉన్నా, తమ పెట్టుబడి వ్యూహాలకే ఈ సంస్థ కట్టుబడి ఉంది. కొన్ని సమయాల్లో ఈ వ్యూహం మంచి ఫలితాలను ఇవ్వలేకపోయినప్పటికీ, ఈ వ్యూహానికే కట్టుబడి ఉంది. అందుకే ఇప్పుడు ఈస్థాయి రాబడులను ఈ ఫండ్స్ రాబడుతున్నాయి.

**గత రెండేళ్ల నుంచి ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇతర ఫండ్స్‌తో పోల్చితే ఈ ఫండ్ రాబడులు ఏమంత సంతృప్తికరంగా లేవు. ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించమంటారా? లేక వేరే ఫండ్‌కు మారిపొమ్మంటారా?**
–సౌదామిని, హైదరాబాద్

మీరు ఈ ఫండ్‌లో కొనసాగవచ్చు. సాధారణంగా ఫ్రాంక్లిన్ ఫండ్స్ నాణ్యత పరంగా ఉన్నత స్థాయిలోనే ఉంటాయి. స్మాల్ క్యాప్ కంపెనీలకు సంబంధించి కొన్ని కంపెనీలు ఒక్కోసారి బ్లాక్‌బస్టర్ షేర్‌గా అవతరిస్తాయి. అది ఎప్పుడనేది తెలుసుకోవడం కష్టసాధ్యమైన విషయం. సాధారణంగా గత కొంత కాలంగా స్మాల్ క్యాప్ కంపెనీలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అందుకనే ఇతర కేటగిరీ ఫండ్స్‌తో పోల్చితే స్మాల్ క్యాప్ ఫండ్స్ రాబడులు ఓ మోస్తరుగానే ఉన్నాయి. ఇక ఫ్రాంక్లిన్ స్మాల్ క్యాప్ ఫండ్ విషయానికొస్తే, ఇది మంచి నాణ్యత గల ఫండే కాబట్టి, మీరు ఈ ఫండ్‌లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నిరభ్యంతరంగా కొనసాగించొచ్చు. స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేవాళ్లు కేవలం రెండేళ్ల ఫండ్ పనితీరు ఆధారంగా నిర్ణయాలు తీసుకోకూడదు. స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో మంచి రాబడులు పొందాలంటే దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

**నేను మరో పదేళ్లలో రిటైరవ్వబోతున్నాను. రిటైర్మెంట్ తర్వాతి అవసరాల కోసం ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. నాకు సరైన పెట్టుబడి వ్యూహాన్ని సూచించండి.**
–మహ్మద్ గౌస్, విజయవాడ

మీకు ఎంత సాధ్యమైతే అంత పొదుపు, మదుపు చేయండి. మీరు మరో రెండు లేదా మూడేళ్లలో రిటైరయ్యేవరకూ ఈక్విటీలో ఇన్వెస్ట్ చేయండి. అంటే మీకు ఈక్విటీలో ఇన్వెస్ట్ చేయడానికి ఏడేళ్ల కాలం ఉంది. ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసే ముందు ముఖ్యంగా మూడు పనులు చేయాలి. ముందుగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఆ తర్వాత హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవాలి. ఈ మూడు పనులు పూర్తి చేసిన తర్వాత రిటైర్మెంట్ అవసరాల కోసం మదుపు చేయడానికి ఉపక్రమించండి. రిటైరైన తర్వాత ఏడాదికి ఎంత మొత్తం అవసరమవుతుందో లెక్కేయండి. ఈక్విటీ ఫండ్స్ సాధారణంగా 10–12 శాతం మేర రాబడులనిస్తాయి. కొన్ని ఫండ్స్ 18–24 శాతం మేర రాబడులు ఇచ్చిన దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ 10–12 శాతం మేర రాబడులు వస్తాయనే అంచనాలనే పెట్టుకుంటే మంచిది. ఎక్కువ రాబడులు ఆశించి భంగపడటం కంటే తక్కువ రాబడులు ఆశించి దానికి తగ్గట్లుగా ఆలోచనలు చేయడం శ్రేయస్కరం. ఇప్పటి నుంచి ఎంత వీలైతే, అంత ఈక్విటీ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయండి. మీకు ఇంక్రిమెంట్ పెరిగినప్పుడల్లా ఆ మొత్తానికి సిప్‌ను కూడా పెంచండి. ఏడాదికి కనీసం 10 శాతం సిప్ పెంచడం మంచిది. మీరు మరో మూడేళ్లలో రిటైరవుతారనగా ఈ మొత్తాన్ని స్థిర ఆదాయం వచ్చే సాధనాలకు మళ్లించండి. మూడేళ్లకు అవసరమయ్యే మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఫండ్‌కు బదిలీ చేయండి. సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్, పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్‌లను కూడా పరిశీలించవచ్చు.

**SECURITY PRINTING PRESS, HYDERABAD (TS)**
(A unit of Security Printing and Minting Corporation of India ltd.)
Mini-Ratna Category-1 CPSE
Wholly owned by Government of India
Mint Compound, Saifabad, Hyderabad-500063

No. SPP/HR/2019-20/Legal/5902 Date: 07-02-2020

**Notice inviting application for Empanelment of Inquiry Officers**

Security Printing Press, Hyderabad invites applications and willingness from Retired officers from Central Government, SPMCIL or other Central PSUs for empanelment of Inquiry Officers for the purpose of conducting departmental inquiries on fixed tenure contract basis.

**Note:** For complete details such as Eligibility, experience, Terms and Conditions and other details including application form, please visit our website https://spphyderabad.spmcil.com. Responses may be submitted **latest by 29th Feb, 2020 17:30 Hrs** to the Chief General Manager SPP, Hyderabad.

Changes/Amendments if any, to this notice will be displayed on the SPP Hyd website only.

Sd/-
**Deputy General Manager (HR) & HOO**
**(For Chief General Manager)**

# డిగ్రీలో కామన్ ఫీజు 'దందా'!



**ఫీజులు పెంచుకునేందుకు ప్రైవేటు డిగ్రీ కాలేజీల కొత్త ఎత్తుగడ**

- ఓవైపు ఉన్నత విద్యా మండలిపై ఒత్తిడి.. మరోవైపు సంక్షేమ శాఖల నుంచి రాయబారం
- ఒకే రకమైన కోర్సులకు వేర్వేరు ఫీజులు చెల్లించడం కష్టమంటూ కామన్ ఫీజు మెలిక
- ఫీజులు పెంచితే ప్రభుత్వంపై పెరగనున్న రీయింబర్స్‌మెంట్ భారం

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ కోర్సుల ఫీజులను పెంచుకునేందుకు ప్రైవేటు డిగ్రీ కాలేజీలు కొత్త ఎత్తుగడను తెరపైకి తెచ్చాయి. కామన్ ఫీజు పేరుతో ఫీజుల పెంపునకు ఉన్నత విద్యా మండలిపై ఒత్తిడి పెంచాయి. ఒకే రకమైన కోర్సులకు ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో రకంగా ఫీజులు ఉన్నాయని, దాంతో బడ్జెట్ అంచనాలు, రీయింబర్స్‌మెంట్ మంజూరులో సమస్యలు తలెత్తుతున్నాయంటూ రీయింబర్స్‌మెంట్ ఇచ్చే సంక్షేమ శాఖల నుంచి రాయబారం నడుపుతున్నాయి. యాజమాన్యాలతో అనుకూలంగా ఉండే కొంతమంది అధికారులు ఇందుకు సై అంటున్నారు. దీంతో రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో కామన్ ఫీజు పేరుతో ఇటు తల్లిదండ్రులపై ప్రత్యక్షంగా, అటు ప్రభుత్వంపై రీయింబర్స్‌మెంట్ రూపంలో భారీగా భారం మోపేందుకు రంగం సిద్ధం అవుతోంది.

**845 ప్రైవేటు కాలేజీలు.. 1.55 లక్షల మంది విద్యార్థులు..**

రాష్ట్రంలోని 1,164 డిగ్రీ కాలేజీలు ఉండగా, వాటిల్లో 4,55,265 సీట్లు ఉన్నాయి. అందులో 2019–20 విద్యా సంవత్సరంలో 2,22,708 సీట్లు భర్తీ అయ్యాయి. అయితే వాటిల్లో గురుకులాలు, మైనారిటీ కాలేజీలు కోర్టును ఆశ్రయించి సొంతంగా ప్రవేశాలు చేసుకున్నవి 118 కాలేజీలు ఉన్నాయి. అవి మినహాయిస్తే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా 2019–20 విద్యా సంవత్సరంలో 1,046 కాలేజీల్లోని 4,12,805 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా 1,99,806 సీట్లు భర్తీ అయ్యాయి. అందులో 845 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా వాటిల్లో 1.55 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి.

**రీయింబర్స్‌మెంట్ నుంచి మినహాయిస్తాం..**

రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లో 80 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఇస్తోంది. మరో 20 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులే ఫీజులను చెల్లిస్తున్నారు. కామన్ ఫీజు పేరుతో ఇప్పుడు ఫీజులను పెంచితే ఈ మేరకు భారం తల్లిదండ్రులతోపాటు ప్రభుత్వంపైనా పడనుంది. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వం రూ.200 కోట్లకు పైగా వెచ్చిస్తుండగా, కామన్ ఫీజు చేస్తే మరో రూ.100 కోట్ల వరకు భారం పడే అవకాశం ఉంది. అయితే ఆ భారాన్ని ప్రభుత్వం అంగీకరించదనే ఆలోచనతో మరో ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నాయి. ఇప్పుడున్న ఫీజులపై పెంచే మొత్తాన్ని ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ (వర్తింపజేయకుండా) కాకుండా తల్లిదండ్రులే చెల్లించేలా నిబంధనలు పొందుపరచాలని ఉన్నత విద్యా మండలికి యాజమాన్యాలే సలహా ఇచ్చేశాయి. దీంతో ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఒత్తిడికి తలొగ్గిన యంత్రాంగం అందుకు అనుగుణంగా కసరత్తు చేస్తోంది.

**ఇప్పటికే ఓయూ పరిధిలో ఫీజు పెంపు ..**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కాలేజీల్లో వర్సిటీ నిర్ణయించిన ఫీజు కంటే అదనంగా రూ.10 వేల చొప్పున యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయి. ఇందుకు ఓయూనే ఉత్తర్వులిచ్చి అనుమతించింది. ప్రస్తుతం ఓయూ పరిధిలో 420 డిగ్రీ కాలేజీలు ఉండగా అందులో 325 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రస్తుతం వాటిల్లో 60 వేల మందికిపైగా విద్యార్థులు చేరారు. ఆయా కాలేజీల్లో వర్సిటీ నిర్ణయించిన ఫీజు కంటే అదనంగా రూ.10 వేల చొప్పున ఒక్కో విద్యార్థి నుంచి యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఈ లెక్కన విద్యార్థుల నుంచి రూ.60 కోట్లు అదనంగా వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు కామన్ ఫీజు చేస్తే ఉస్మానియానే కాదు మిగతా వర్సిటీ పరిధుల్లోని కాలేజీల్లోనూ ఫీజులు భారీగా పెరగనున్నాయి.

**కామన్ ఫీజును అడిగేదే పెంపు కోసం..**

ఫీజుల సమీక్ష చేయడం అంటేనే పరోక్షంగా ఫీజులను పెంచడం. ఏ పేరు పెట్టుకున్నా తగ్గించేదైతే ఉండదనేది బహిరంగ రహస్యమే. అందుకే కామన్ ఫీజు ముసుగులో ఇప్పుడు డిగ్రీ కాలేజీల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వంపై ఫీజుల భారం మోపేందుకు యాజమాన్యాలు సిద్ధం అయ్యాయి. అందుకు వంతపాడుతూ యంత్రాంగం సిద్ధం అవుతుండటం విద్యార్థులను ఆందోళనలో పడేస్తోంది.

**వర్సిటీల్లో కోర్సుల వారీగా ఫీజులు..**

| కోర్సు | కాకతీయ | తెలంగాణ | మహాత్మాగాంధీ | శాతవాహన | పాలమూరు | ఉస్మానియా |
|---|---|---|---|---|---|---|
| బీఏ | 6,170 | 6,200 | 6,370 | 6,390 | 6,370 | 6,370 |
| బీకాం కంప్యూటర్ | 12,470 | 10,800 | 8,950 | 10,150 | 8,950 | 10,950 |
| బీకాం జనరల్ | 12,370 | 8,800 | 10,950 | 8,550 | 10,890 | 8,950 |
| బీఎస్సీ | 13,520 | 11,900 | 12,950 | 11,650 | 10,950 | 10,750 |



ఆదివారం మధ్యాహ్నం పొగమంచు కారణంగా మసకగా మారిన హైదరబాద్‌లోని ట్యాంక్ బండ్ పరిసరాలు

# పగలే చీకటి!

**రాష్ట్రంలో భారీగా పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు**

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ ఇంటీరియర్ ఒడిశా, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దక్షిణ తమిళనాడు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు ఇంటీరియర్ కర్ణాటక, మరఠ్వాడ, విదర్భ మీదుగా ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడింది. తెలంగాణలో ఆగ్నేయ, తూర్పు దిశల నుంచి గాలులు వీస్తు న్నాయి. దీంతో రాష్ట్రంలో ఆదివారం అనేక చోట్ల వర్షం పడింది. సూర్యాపేట జిల్లా మోతె మండలం ఉర్లుగొండలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 6 సెం.మీ., మహబూబాబాద్ జిల్లా మరిపెడ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు, నల్లగొండ జిల్లా నల్లికల్, వనపర్తి జిల్లా కేతేపల్లిలలో 4 సెం.మీ. చొప్పున వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు సైతం భారీగా పడిపోయాయి. హన్మకొండలో సాధారణం కంటే 8.6 డిగ్రీలు తక్కువగా 24 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండం 25.4 డిగ్రీలు, నిజామాబాద్‌లలో 25.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**హైదరాబాద్‌లో చిరు జల్లులు..**

ఉపరితల ఆవర్తనం ఫలితంగా ఆదివారం హైదరాబాద్‌లో పలు చోట్ల శీతలగాలులతోపాటు చిరు జల్లులు కురిశాయి. నగరమంతా వాన మబ్బులు పరుచుకోవడంతో పగలే చీకటిని తలపించింది. నగరంలో సాధారణం కంటే తక్కువగా 23 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం కూడా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.







## ఒకే చోట విదేశీ వ్యవహారాల శాఖ కార్యాలయాలు

**హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో మరో 3 కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. కేంద్ర విదేశీ వ్యవహారాలకు సంబంధించిన కార్యాలయాలను ఒకే చోటకు తెచ్చే పనులు పూర్తి కావొచ్చాయి. త్వరలోనే అధికారికంగా ఈ కార్యాలయాలు ప్రారంభంకానున్నాయి. పాస్‌పోర్టు కార్యాలయానికి సంబంధించిన బ్రాంచ్ సెక్రటేరియట్ ఇప్పటి వరకు తెలంగాణ సచివాలయంలో కొనసాగుతుంది. నూతన సచివాలయ నిర్మాణంలో భాగంగా అక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం తెలిసింది. దీంతో బ్రాంచ్ సెక్రటేరియట్ కార్యాలయాన్ని కూడా పాస్‌పోర్టు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించిన అధికారులు దాన్ని ఇక్కడికి తరలించనున్నారు. దీంతోపాటు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ కార్యాలయం కూడా ఇక్కడే కొలువు దీరనుంది. అలాగే నాంపల్లిలోని గృహకల్ప కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ప్రొటెక్ట్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్ కార్యాలయాన్ని కూడా పాస్‌పోర్టు కార్యాలయ ఆవరణలోకి తీసుకువస్తున్నారు. దీంతో విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు పాత భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తున్నారు.

# జస్టిస్ జయచంద్రారెడ్డి కన్నుమూత

**సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు**



**రాయచోటి/అమరావతి:** న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కామిరెడ్డి జయచంద్రారెడ్డి (90) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. బెంగళూరులోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితాన్ని అక్కడే గడుపుతున్నారు. కుమారుడు చనిపోవడంతో కోడలు, మనవళ్ళతో బెంగళూరులో విశ్రాంత జీవితం గడుపుతున్న జస్టిస్ జయచంద్రారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం బెంగళూరులోనే నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మదనపల్లె, రాయచోటి ప్రాంతాల్లో ప్రాథమిక, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన జయచంద్రారెడ్డి.. మద్రాసు లా కళాశాలలో న్యాయశాస్త్రంలో పట్టాను అందుకున్నారు. అనంతరం మద్రాసు హైకోర్టులో క్రిమినల్ న్యాయవాదిగా వృత్తిని చేపట్టి అంచలంచెలుగా ఎదిగారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లా కమిషన్ చైర్మన్‌గా.. లా కమిషన్ ఇండియన్ కౌన్సిలర్‌గా పనిచేసి ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారు.

**కడప జిల్లాలో జననం**

వైఎస్సార్ జిల్లా సుండుపల్లి మండలం తిమ్మసముద్రం గ్రామం వండ్లపల్లెకు చెందిన కామిరెడ్డి క్రిష్ణారెడ్డి, చెన్నమ్మ దంపతులకు జయచంద్రారెడ్డి 1929లో జన్మించారు. ఈయనకు భార్య సరోజని, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**న్యాయవ్యవస్థలో మార్పులకు శ్రీకారం**

దేశంలోని పలువురు న్యాయకోవిదులతో కలిసి జయచంద్రారెడ్డి అనేక మార్పులకు నాంది పలికారు. ముఖ్యమైన కేసులల్లో ప్రభుత్వాలకు, న్యాయాధిపతులకు సలహాలు, సూచనలు అందించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ బోర్డు చైర్మన్‌గా, అడ్వయిజర్‌గా సేవలందించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లా కమిషన్ చైర్మన్‌గా, లా కమిషన్ ఇండియన్ కౌన్సెలర్‌గా, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా పలు పదవులు నిర్వహించారు. యుగోస్లోవియా, రువాండ దేశాలతో జరిపిన న్యాయపరమైన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ, జస్టిస్ పీఎన్ భగవతిల నుంచి ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు.

# టంకశాల @217

**నేడు 217వ ఆవిర్భావ దినోత్సవం ● త్వరలో రూ.20 నాణేలు ముద్రణ**



సుల్తాన్ షాహీల రాజసాధంలోని టంకశాల



చర్లపల్లిలోని ప్రస్తుత టంకశాల

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లో నాణేలు ముద్రించే భారత ప్రభుత్వ టంకశాల చర్లపల్లిలో ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఇది పనిచేస్తుంది. నేడు ఇది 217వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోనున్న ఈ టంకశాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. భారతదేశంలో బ్రిటిష్ హ యాంలో నిర్మించిన అన్ని టంకశాలల కంటే ఇదే పురాతనమైనది. 1803లో హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించే మూడో నిజాం నవాబ్ సికిందర్ ఝా దీన్ని సుల్తాన్ షాహీల రాజ సౌధంలో ఏర్పాటుచేశారు. 1857లో సైనిక తిరుగుబాటు అనంత రం దేశం లోని అన్ని సంస్థానాల టంకశాలలను బ్రిటిష్‌వారు రద్దు చేశారు. బాంబే, కోల్‌కతా వంటి నగరాల్లో తమ సొంత టంకశాలలు ఏర్పాటు చేశారు. విచిత్రమేంటంటే.. అక్కడ చేతితో నాణేలు తయారుచేయగా, 1895 నుంచే హైదరాబాద్‌లో మాత్రం యంత్రాలతో ముద్రిం చేవా రు. 1948లో నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైంది. కేంద్రం ఈ టంకశాలను ఆధీనంలోకి తీసుకున్నా.. 1950 వరకు ఇక్కడ నిజాం కరె న్సీనే ముద్రించారు. 2000 సం వత్స రం వరకు పలు విదేశీ కంపెనీలు ఈ ముద్రణా వ్యవహారాలను చూసేవి. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో భారత ప్రభు త్వం నాణేల దిగుమతికి స్వస్తి చెప్పింది. ఈ టంకశాల అత్యాధునిక భద్ర తా లక్షణాలతో నాణాలను ముద్రిస్తోంది. తిరుపతి, సాయి సంస్థాన్ ట్రస్ట్, హులిగమ్మ ఆలయం, శ్రీ కాళహస్తి దేవస్థానం వంటి ప్రము ఖ ఆలయాల నుంచి వ చ్చే బంగా రం, వెండిని శుద్ధి చేసి కొత్త రూపం ఇస్తారు. అలాగే కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారాన్ని కడ్డీలుగా మార్చే బాధ్యత కూడా దీనిదే. ఎన్నో మైలురాళ్లను తన ప్రస్థానంలో అధిరోహించిన ఈ టంకశాల త్వర లోనే రూ.20 నాణేలను ముద్రించబోతోంది.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.